సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 276
బుధవారం 27-12-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ప్రజా పాలన
అభయహస్తం గ్యారంటీలకు శ్రీకారం

రాష్ట్ర మంత్రివర్గం చేతుల మీదుగా
27 డిసెంబర్ 2023న ప్రజా పాలన దరఖాస్తు ఆవిష్కరణ



గౌ॥ శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారు
ఉప ముఖ్యమంత్రి

గౌ॥ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు
ముఖ్యమంత్రి

అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో

28 డిసెంబర్ 2023 నుండి 06 జనవరి 2024 వరకు దరఖాస్తులు స్వీకరించబడును

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ప్రగతి పథం... సకలజన హితం... మన ప్రజా ప్రభుత్వం!


చిట్టి శ్రీదేవి

బొమ్మల లోకం

పిల్లలకు బొమ్మలంటే ప్రాణం...
బొమ్మ లేకపోతే అన్నం తినరు.
అమ్మ తనను జోకొడుతుంటే...
పిల్లలు తమ బొమ్మను నిద్రపుచ్చుతారు.
ఇష్టంగా ఆడుకున్న బొమ్మను ఎప్పటికీ మర్చిపోరు.
ఆ బొమ్మ పిల్లలను ఆడించి అలరించి ఊరుకోదు.
వారి వ్యక్తిత్వ వికాసంలోనూ ప్రభావం చూపిస్తుంది.
అందుకే... బొమ్మ మంచిని నేర్పించేదై ఉండాలి.

ప్రతి బాల్యం బొమ్మలతో కలసి సాగుతుంది. అమ్మాయిలైతే బొమ్మల్లో సహోదరులను చూసుకుంటారు. తమను తాము ఆ బొమ్మలో ప్రతిక్షేపించుకుంటారు. తాము చేసే పనులను ఆ బొమ్మ చేత కూడా చేయిస్తారు. ఉన్నట్లుండి అమ్మ పాత్రలోకి మారిపోయి ఆ బొమ్మకు స్నానం చేయిస్తారు. దుస్తులు వేసి, పౌడర్ అద్దుతారు, తల దువ్వి, బొట్టు కూడా పెడతారు. ఒక్క మాటలో చెప్పాలంటే బొమ్మలతో బంధాన్ని అల్లుకుంటారు. బొమ్మకు ప్రతిరూపంగా తమను తాము మలుచుకునే ప్రయత్నం జరిగిపోతుంది. పిల్లలకు తెలియకుండానే వాళ్ల మెదడు ఓ సందేశాన్ని గ్రహించి ఉంటుంది. అది మంచి కావచ్చు, హానికారక ప్రభావమూ కావచ్చు. మరి అలాంటప్పుడు పిల్లలు ఆడుకునే బొమ్మలు ఎలా ఉండాలి? చక్కటి సందేశాన్నివ్వాలి. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి దోహదం చేయాలి. అలాంటి ప్రయత్నమే చేస్తున్నారు హైదరాబాద్‌కి చెందిన చిట్టి శ్రీదేవి. బొమ్మలను ఇష్టపడే శ్రీదేవి బొమ్మలతో అందమైన వ్యాపకాన్ని కల్పించుకున్నారు. ఆ వివరాలను సాక్షితో పంచుకున్నారామె.

■ బొమ్మలంటే ఇష్టం

''నేను పుట్టింది గుంటూరులోని అమ్మమ్మ గారింట్లో. బాల్యం, చదువు అంతా హైదరాబాద్‌లోనే. ఎంబీఏ హెచ్‌ఆర్ చేశాను. పెళ్లితో ఉమ్మడి కుటుంబంలో అడుగుపెట్టాను. మా వారు మద్రాస్ ఐఐటీ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చేశారు. ఆ ఇంటికి నేను ఐదవ కోడలిని. అందరం ఒకే ఇంట్లో ఉండేవాళ్లం. ఆ ఇంటి కోడలి ఉద్యోగంలో ఇమిడిపోయాను. మా అబ్బాయి పుట్టిన తర్వాత మా వారి ఉద్యోగరీత్యా యూఎస్‌లో రెండేళ్లకు పైగా ఉన్నాం. ఇండియాకి వచ్చిన తర్వాత మళ్లీ అదే రొటీన్. మా నాన్న నాతో... 'చదువుకుని కూడా ఉద్యోగం చేయలేకపోతున్నానని బెంగ పెట్టుకోవద్దు. నిన్ను నువ్వు నీకిష్టమైన వ్యాపకంలో నిమగ్నం చేసుకో' అనేవారు. ఆ మాటల ప్రభావమే కావచ్చు... మా ఆడపడుచు బొటీక్‌లో మూటలు కట్టి పక్కన పెట్టిన స్క్రాప్‌ను చూసినప్పుడు నాకో ఐడియా వచ్చింది. పైగా నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలంటే చాలా ఇష్టం. దాంతో బొటీక్‌లో మిగిలిన క్లాత్ ముక్కలతో బొమ్మలు, బొమ్మలకు ఫ్రాకులు... ఇలా రకరకాల ప్రయోగాలు చేశాను. పదిహేనేళ్ల కిందట మొదలైన ఈ వ్యాపకం ఈ రోజు నాకు 'డాల్స్ శ్రీదేవి' అనే గుర్తింపు తెచ్చిపెట్టింది. గతంలో హాబీగా చేస్తూ వచ్చిన వ్యాపకానికి 2020 నుంచి పూర్తి స్థాయిలో అంకితమయ్యాను. మా అత్తగారు కాలం చేయడం, మా అబ్బాయి ఇంజినీరింగ్‌కి బిట్స్ పిలానీకి వెళ్లడంతో నా డైలీ రొటీన్‌లో ఒక్కసారిగా విపరీతమైన ఖాళీ ఏర్పడింది. ఓ వారం రోజులపాటు చెన్నైలో డాల్ మేకింగ్ కోర్సు చేశాను. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో బొమ్మల ప్రభావం ఎంతగా ఉంటుందో సందేశాత్మకంగా వివరించే ప్రయత్నం చేశాను. సంక్రాంతి బొమ్మల కొలువు కూడా ఒక థీమ్‌తో ఏర్పాటు చేస్తుంటాను. బాలవికాస్, సభలు, స్కూళ్లలో ప్రదర్శిస్తూ ఏడాదిలో 365 రోజులూ పని చేయాలనేది నా కోరిక.

■ ఇండియన్ డాల్

గడచిన పాతికేళ్లుగా మనదేశంలో బార్బీ డాల్స్ ట్రెండ్ నడిచింది. మనదేశంలో పిల్లలు బార్బీ బొమ్మలో కొత్తదనాన్ని ఆస్వాదించారు. కానీ ఆ పిల్లలు టీనేజ్‌లోకి వచ్చిన తర్వాత ఐదారేళ్లకు మన ఊహకు అందని ఓ వాస్తవం బయటపడింది. మన పిల్లలు బార్బీ డాల్ సిండ్రోమ్ బారిన పడిన విషయాన్ని డాక్టర్లు, పిల్లల మనస్తత్వ విశ్లేషకులు సమష్టిగా చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. బార్బీ డాల్‌లా సన్నగా ఉండాలని కోరుకుంటున్నారు మన అమ్మాయిలు. అంత సన్నగా ఉండడం కోసం ఆహారాన్ని తగ్గించేస్తున్నారు. దాంతో పోషకాహార లోపం బారిన పడుతున్నారు. ఇవన్నీ ఒకదానికొకటి అనుబంధ పరిణామాలు. మన వాతావరణం, మన ఆహారం, మన జన్యువుల ఆధారంగా మన దేహ నిర్మాణం జరుగుతుందనే వాస్తవాన్ని పిల్లలకు అర్థం అయ్యేటట్లు చెప్పడానికి మేధావుల నుంచి న్యూట్రిషనిస్టుల వరకు ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా ప్రసంగాలు, కథనాల ద్వారా తెలియచేశారు. భారతీయత నేపథ్యంతో కూడిన బొమ్మలతో ఆడుకుంటే పిల్లల మెదడు కూడా మనదైన సహజ దేహాకృతిని స్వాగతించడానికి సిద్ధంగా ఉంటుంది. అలాగే మనం పిల్లలకు సత్ప్రవర్తన, జాతీయత భావం, క్రమశిక్షణ, ధర్మనిరతి వంటివన్నీ కథల ద్వారా వివరిస్తుంటాం. అలాంటి ఇతివృత్తాలతో బొమ్మలను చేస్తున్నాను. అంటే కథలకు బొమ్మల రూపం ఇస్తున్నాన్నమాట. కశ్మీర్ నుంచి కేరళ వరకు ప్రతి రాష్ట్రానికి దానికంటూ ప్రత్యేకమైన ఆహార్యం ఉంది. ఆ ఆహార్యంతో కూడిన జంట బొమ్మలను చేస్తున్నాను. బొమ్మలతో చెప్పిన విషయం పిల్లలకు బాగా గుర్తుంటుంది. బొమ్మ రూపం చిన్ని మనసుల్లో ముద్రించుకుంటుంది. ఆ బొమ్మ ప్రభావం జీవితకాలమంతా ఉంటుంది'' అన్నారు చిట్టి శ్రీదేవి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

■ ఎన్ని మంచి పుస్తకాలు చదివారు?
■ ఎన్ని మంచి సినిమాలు చూశారు?
■ ఎంతమంది మంచి మిత్రులను పొందారు?
■ ఎన్ని అనుబంధాలను కాపాడుకోగలిగారు?
■ ఎన్ని కొత్త ప్రాంతాలు తిరిగారు?
■ కుటుంబ సభ్యుల మధ్య ఎంత సాన్నిహిత్యం పెంచారు?
■ ఎంత పొదుపు చేశారు?
■ ఆరోగ్యం కోసం ఎంత శ్రద్ధ పెట్టారు?

2023కు వీడ్కోలు

ఇవన్నీ ప్రశ్నలే.
పునరావలోకనం చేసుకోవాలి.
కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో మొదలెట్టాలి.
జీవితం ఒక్కటే. సాధించాల్సినవి లక్ష.
స్త్రీగా జన్మించినందుకు రోజులు ఎలా గడిచిపోయాయో అనుకోకూడదు.
ఎంత బాగా గడిచాయో అనుకోవాలి.
అందుకు తరచి చూసుకుని స్వీయ అంచనా వేసుకోవడమే మార్గం.

ఈ సంవత్సరం ఏం చేశారు?



'ఏం చేస్తున్నావమ్మా?' అని పిల్లలు అడిగి 'అన్నం పెట్టు' అంటారు. 'ఏం చేస్తున్నావోయ్' అని భర్త అడిగి, 'నా వైట్‌షర్ట్ ఎక్కడా?' అని ప్రశ్నిస్తాడు. అత్తగారు, మామగారు 'ఏం చేస్తున్నావమ్మా' అని కేకేసి ఇంకేదో చెప్తారు. వీళ్లంతా ఏ పనీ చెప్పకపోయినా ఇంట్లో గృహిణిగా ఉన్నందుకు తప్పక చేయాల్సిన పనులు ఉంటాయి.

ఈ పనుల్లోనే జీవితం గడిచిపోవాలా? ఈ పనుల మధ్యలో స్త్రీలు తమకంటూ ఒక జీవితాన్ని నిర్మించుకోలేరా?

2023 మరో రెండు మూడు రోజుల్లో వీడ్కోలు తీసుకుంటుంది. కొత్త సంవత్సరం వస్తుంది. గృహిణిగా/ ఉద్యోగం చేస్తూ ఇల్లు చూసుకునే గృహిణిగా ఈ సంవత్సరమంతా ఎలా గడిచిందో బేరీజు వేసుకున్నారా?

■ ఎన్ని పుస్తకాలు చదివారు?

స్త్రీకి మెదడు ఉంటుంది... దానికి వ్యాయామం ముఖ్యం అన్నాడు రచయిత చలం. ఆ వ్యాయామం పుస్తకాలు చదివితే వస్తుంది. సాహిత్యానుభవం వల్ల మస్తిష్కం విశాలం అవుతుంది. జీవన అవగాహన పెరుగుతుంది. జీవితాన్ని ఆస్వాదించడమూ తెలుస్తుంది. స్త్రీలు పుస్తకం చదివితే ఇంటికి వెలుగు. ప్రతిఏటా ఎన్నో మంచి పుస్తకాలు వస్తాయి. పుస్తక ప్రదర్శనలు జరుగుతాయి. అమేజాన్ నుంచి తెప్పించుకోవచ్చు. ఆడియో యాప్స్ కూడా ఉన్నాయి. పుస్తకాలు చదవకుండానే 2023ను మీరు వృథా చేసి ఉంటే మీరు మీ బౌద్ధిక వ్యాయామాన్ని వృథా చేసినట్టు. లేదా కొన్ని పుస్తకాలైనా చదివి ఉంటే వాటిని లిస్ట్ చేసి మీ స్నేహితులకు పంపి ఇన్‌స్పైర్ చేయండి. ఈ సంవత్సరం మరిన్ని చదవాలని లక్ష్యం పెట్టుకోండి.

■ మంచి సినిమాలు చూశారా?

సినిమాలంటే కాలక్షేపపు సినిమాలు కాదు. హాలీవుడ్‌లో, హిందీలో, భారతీయ భాషల్లో అర్థవంతమైన సినిమాలు వస్తున్నాయి. స్త్రీ దృష్టికోణం నుంచి ఎన్నో కథలు చెప్తున్నారు. ఓటీటీలలో కూడా చాలా సినిమాలు వస్తున్నాయి. వీటిలో కొన్నయినా మీరు ఎంచుకుని చూశారా? పోనీ... పాత క్లాసిక్స్... మీరు ఎప్పటినుంచో చూడాలనుకున్నవి... ఎవరూ మధ్యలో డిస్టబ్ చేయని విధంగా చూశారా? సంతోషించారా?

■ ఎంతమంది మిత్రులను పొందారు?

ఇవాళ మనిషికి పెద్ద ఓదార్పు స్నేహమే. వైవాహిక జీవితంలో పడ్డాక పాత స్నేహాలు కొనసాగితే అదృష్టమే. స్కూల్, కాలేజీ నాటి స్నేహితులు మాట్లాడుతూ ఉంటే ఆ స్నేహాన్ని ఈ సంవత్సరం ఎంతమేరకు నిలబెట్టుకున్నారు. లేదా ఇంటి ఇరుగు పొరుగున, పని చేసే చోట ఎన్ని మంచి స్నేహాలు చేయగలిగారు. ఇవాళ రేపు మనుషుల పట్ల నెగెటివిటి పెరిగింది. కాని లోపాలు ఎంచటం తక్కువ... స్నేహాన్ని కొనసాగించడం తక్కువ కొనసాగించారా? బాగా చికాకుగా, డల్‌గా ఉన్నప్పుడు మీరు కాల్ చేసి మాట్లాడే స్నేహితుల సంఖ్య ఈ సంవత్సరం పెరిగిందా? తగ్గిందా?

■ ఎన్ని అనుబంధాలను కాపాడుకోగలిగారు?

బంధువులను దూరం చేసుకోవడం, బంధువులకు దూరం కావడం ఈ కాలపు గడుసుదనంగా మారింది. బంధువులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది అనే పోకడ ఇప్పుడు సర్వసామాన్యం అయ్యింది. కాని బంధుత్వాలు లేకనే జీవనం సాగగలదా? ఎన్ని లోపాలు ఉన్నా మంచికీ చెడ్డకీ ఆధారపడాల్సింది బంధువులే కదా? ఈ బాంధవ్యాలను, అనుబంధాలను డ్యామేజీ చేశారా? లేదా బలపరుచుకున్నారా? ఏదైనా నష్టం జరిగి ఉంటే 2024లో ఆ నష్టాన్ని నివారించే ప్రయత్నం ఎందుకు జరగకూడదు?

■ ఎన్ని కొత్త ప్రాంతాలు తిరిగారు?

సంవత్సరమంతా ఇంటి నాలుగ్గోడలు, ఆఫీసు ప్రాంగణంలోనే గడిచిపోయిందా? ఏ కొత్త ప్రాంతాన్ని చూడలేదా? కొత్తనేలను తాకి కొత్తగాలిని పీలిస్తేనే సంతోషం. సంవత్సరంలో కనీసం 2 కొత్త ప్రాంతాలు చూడగలగాలి. 2023లో చూడకపోతే 2024లో కదలండి.

■ కుటుంబ సభ్యుల మధ్య సాన్నిహిత్యం:

కుటుంబం జీవన సర్వస్వం. ఒకే కుటుంబమే అయినా కుటుంబ సభ్యుల మధ్య స్పర్థలు, అభ్యంతరాలు, నిర్లక్ష్యం, నిర్బాధ్యత వస్తాయి ఒక్కోసారి. కడుపున పుట్టిన వాళ్ల మధ్య ప్రేమను కల్పించారా? తల్లిదండ్రులుగా మీరు మీ పిల్లల మధ్య అడ్డుగోడలు లేకుండా ఉన్నారా? మీ మనసులో ఉన్నదంతా వారికి చెప్పగలరా? వారి మనసులో ఉన్నది చెప్పే వీలు ఇచ్చారా? 2024లో ఈ ప్రశ్నలకు జవాబు వెతకండి.

■ ఎంత పొదుపు చేశారు?

పిల్లల కోసమే ప్రతి పైసా ఖర్చు పెట్టడం ఇన్నాళ్లు చేశారా? 2023లో కూడా అదే చేశారా? తల్లిగా మీ ఆర్థిక భద్రత ఎంత? మీ పేరున స్థిరచరాస్తులు, రొక్కం ఏ మేరకు ఉంది. మీ కోసం మీరు ఎంత పొదుపు చేసుకున్నారు? ఒకరిపై ఆధారపడలేని స్థితిలో ఉండాలనుకోవడం లేదా? కొత్త సంవత్సరం వస్తున్నది మీ స్వయంసమృద్ధికే.


■ ఆరోగ్యం పై ఎంత శ్రద్ధ పెట్టారు?

ఆరోగ్యం సంగతి తర్వాత చూసుకుందాం అని ఇంకా ఎన్నేళ్లు అనుకుంటారు. ఈ సంవత్సరం హెల్త్ ఇన్సూరెన్స్‌లు చేయించుకోండి. మంచి ఆహారానికి బడ్జెట్ కేటాయించుకోండి. జిమ్‌లో చేరండి. వాకింగ్ చేయండి. యోగా క్లాసులకెళ్లండి. మీ ఆరోగ్యం కోసం మీరు కొంత ఖర్చు పెట్టుకోవడాన్ని హక్కుగా పొందండి. 2024లో కచ్చితంగా మీరు సంపూర్ణ ఆరోగ్యం కోసం నడుం బిగించండి.


కాలం వచ్చేది మన కోసం. మనం ఇతరుల కోసం ఎంత జీవించినా మన కోసం కూడా జీవించాలి. కొత్త సంవత్సరంలో మీ కోసం కూడా మీరు జీవించండి.

● ముగ్గు-ముచ్చట


పావని ఆర్
గుర్రంగూడ
హైదరాబాద్


18 చుక్కలు
2 వరుసలు
అటు ఇటు
వదిలి
2 వరకు


కె.లక్ష్మి,
రామనగర్,
విజయవాడ


22 చుక్కలు
10 వరసలు
10 వరకు


15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్యచుక్క


ఉషా కుమారి
మిరియప్పల్లి,
శ్రీకాకుళం మండలం



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

యూత్ పల్స్

AI LOVE YOU
ఆసక్తి... అధ్యయనం... నైపుణ్యం



'నేటి ఆసక్తి రేపటి నైపుణ్యం' అంటారు. కాలేజి చదువుతో సంబంధం లేకుండానే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కి సంబంధించిన ప్రాథమిక విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తి ప్రదర్శిస్తోంది యువతరం. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్... మొదలైన దిగ్గజ సంస్థలు అందించే షార్ట్ టైమ్ ఉచిత కోర్సులలో ప్రావీణ్యం సంపాదించి తొలి అడుగు వేస్తున్నారు....

సంప్రదాయ హద్దులను చెరిపేస్తూ, ఆలోచనలను పునర్నిర్వచిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రెవెల్యూషనరీ ఫోర్స్‌గా ఎదుగుతోంది. విద్యారంగానికి సంబంధించి 'ఏఐ' అనేది గేమ్-చేంజర్ అయింది. ఎడ్యుకేషనల్ యాక్టివిటీస్‌లో ఆటలను పోలిన ఎలిమెంట్స్‌ను పొందుపరిచి, నేర్చుకునే విధానాన్ని ఆసక్తికరం చేసే 'గేమిఫికేషన్' ప్రక్రియ ఊపందుకుంటుంది.

తాము ఏ కోర్సు చదువుతున్నాం అనేదానితో సంబంధం లేకుండా 'ఏఐ'కి సంబంధించిన ప్రాథమిక విషయాలపై ఆసక్తి చూపుతున్న వారికి దిగ్గజ సంస్థల ఏఐ ఉచిత కోర్సులు వరంగా మారాయి.

2025 నాటికి 20 లక్షల మందికి ఏఐ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది అమెజాన్. దీనికి 'ఏఐ రెడీ' అని పేరు పెట్టారు. నెక్స్-జెన్ ఏఐ టెక్నాలజీని పరిచయం చేసే కార్యక్రమం ఇది. ఫౌండేషనల్ ఏఐ కాన్సెప్ట్స్, ప్రాక్టికల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ఎనిమిది ఉచిత ఆన్‌లైన్ కోర్సులను ఆఫర్ చేస్తుంది.

ఏఐకి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సాంకేతిక దిగ్గజం గూగుల్ పదిహేను భాషల్లో అందుబాటులో ఉండే ఉచిత 'ఏఐ సర్టిఫికేషన్' కోర్సులకు రూపకల్పన చేసింది. ఏఐకి సంబంధించిన ప్రాథమిక విషయాలను అవగాహన పరిచే లక్ష్యంతో దీన్ని రూపొందించారు. బిగినర్స్‌కు ఇది బాగా ఉపయోగపడుతుంది. లెసన్స్‌ను ఆరు మాడ్యూల్స్‌గా విభజించారు. వాటిజ్ ఏఐ; ఏఐ ప్రాబ్లం సాల్వింగ్, రియల్ వరల్డ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్, న్యూట్రల్ నెట్‌వర్క్స్, ఇంప్లికేషన్స్‌లాంటి ఆరు చాప్టర్‌లు ఉంటాయి. రకరకాల ఎక్సర్‌సైజ్‌లు ఉండే ఈ ఉచిత కోర్సులలో స్టూడెంట్స్ 50 శాతం ఎక్సర్‌సైజ్‌లను కరెక్ట్‌గా చేయాల్సి ఉంటుంది.

'రెస్పాన్సిబుల్ ఏఐ' అనే కోర్స్‌ను కూడా రూపొందించింది గూగుల్. ఏఐ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఆండ్రూ ఎన్‌జీ దీన్ని రూపొందించారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం రోజువారీ పనుల్లో ఎలా సహాయ పడుతుంది, ఏఐ ఆధునాతన ఉపయోగాలు ఏమిటి... మొదలైనవి ఇందులో ఉంటాయి.

'ఏఐ'కి సంబంధించి ప్రాథమిక విషయాలను అవగాహన పరిచే కోర్సును రూపొందించింది మైక్రోసాఫ్ట్. 24 లెసన్స్‌కు సంబంధించి పన్నెండు వారాల కరికులమ్ ఇది. జెనరేటివ్ ఇంటెలిజెన్స్ పరిచయం, అది పని చేసే విధానం, కంటెంట్‌ను క్రియేట్ చేసే పద్ధతులు, వివిధ రకాల మోడల్స్...మొదలైనవి దీనిలో ఉన్నాయి. ఈ కోర్సును ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌పర్ట్ పినార్ సెనార్ రూపొందించారు... యువతరం ఆసక్తి చూపుతున్న ఎన్నో కోర్సులలో ఇవి కొన్ని మాత్రమే.

'నేటి ఆసక్తి... రేపటి నైపుణ్యం' అనే మాట అక్షరాలా నిజమని ప్రాంజలి సక్సెస్ స్టోరీ చెప్పకనే చెబుతుంది.

పదహారు సంవత్సరాల వయసులో ఏఐ స్టార్టప్ 'డెల్వ్.ఏఐ' ఫౌండర్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది ప్రాంజలి అవస్తీ. ఏడు సంవత్సరాల వయసులో కోడింగ్‌పై ఆసక్తి మొదలైంది. తండ్రి సహాయంతో రకరకాల సాంకేతిక విషయాలపై అవగాహన పెంచుకుంది. మన దేశంలో పుట్టిన ప్రాంజలి పదిసంవత్సరాల వయసులో తల్లిదండ్రులతో పాటు అమెరికాకు వెళ్లింది. హైస్కూల్ రోజుల్లో చాలెంజింగ్ కంప్యూటర్ సైన్స్ ప్రాజెక్ట్‌లపై పనిచేసేది. చిన్నప్పటి నుంచి సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి తెలుసుకోవడం అంటే ఇష్టం. వారి స్ఫూర్తితో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తోంది ప్రాంజలి అవస్తీ.

ఇంపోస్టర్ సిండ్రోమ్ నుంచి బయటపడాలి




సెల్ఫ్-ఇంప్రూమెంట్ అనేది మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మరో వైపు నిర్మాణాత్మక విమర్శలను ఆహ్వానించాలి. వాటిద్వారా తప్పులు సరిదిద్దుకోవాలి. బిజినెస్ ప్రారంభించిన కొత్తలో ప్రతి చిన్న విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి. ఆ ఉత్సాహం మనకు ఎంతో శక్తిని ఇస్తుంది. కంఫర్ట్ జోన్ నుంచి బయటికి రావడానికి ఎప్పుడూ భయపడవద్దు. రకరకాల రంగాలలో విజేతలైన ఎంతోమందిని కలుసుకొని మాట్లాడాను. వారు ఎన్నో సవాళ్లు ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. ఇంపోస్టర్ సిండ్రోమ్(సెల్ఫ్-డౌట్)తో సతమతమయ్యేవారికి నేను చెప్పేది ఏమిటంటే మనపై మనకు నమ్మకం ఉండాలి. లేకపోతే మనలోని నైపుణ్యం, ప్రతిభ వృథా అవుతాయి.

– ప్రాంజలి అవస్తీ, డెల్వ్.ఏఐ, ఫౌండర్

ఏఐ ఇన్నోవేటర్


శ్రేయా ఫ్రాన్సిస్

ఏఐ పరిశోధనలలో చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది కేరళకు చెందిన శ్రేయా ఫ్రాన్సిస్. తాజాగా ఇంటర్నేషనల్ ఏఐ సమ్మిట్‌కు సంబంధించిన 'ఏఐకానిక్స్ సొల్యూషన్స్ ఇంప్లిమెంటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. ఏఐ అండ్ రోబోటిక్స్‌కు సంబంధించి ఎన్నో ప్రాజెక్ట్‌లకు నాయకత్వం వహించింది. ఏఐ టాపిక్‌కు సంబంధించి ఎన్నో అంతర్జాతీయ సమావేశాల్లో కీలక ఉపన్యాసం ఇచ్చింది. ప్రతిష్ఠాత్మకమైన మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ డైవర్సిటీ అవార్డ్‌ను రెండుసార్లు గెలుచుకుంది.



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 276

బుధవారం 27-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఖేల్‌రత్న... అర్జున' వెనక్కి...

భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రకటన -12లో



...ఇంధన షేర్లలో కొనుగోళ్లు

సెన్సెక్స్ లాభం 230 పాయింట్లు... 21,450 పాయింట్ల చేరువలో నిఫ్టీ -13లో



A టు Z... 2023

కరువులు.. కల్లోలాలు.. కష్టాలు.. కన్నీళ్లు.. ప్రపంచానికి 2023 మిగిల్చిన గుర్తులివే! ఆయా సంఘటనలపై విహంగ వీక్షణం..

- వివరాలు 6లో



పథకం ఏదైనా ఒకటే దరఖాస్తు!

28 నుంచి ప్రారంభమయ్యే 'ప్రజాపాలన'లో ప్రజలివ్వాల్సిన దరఖాస్తు ఫారాన్ని 'అభయహస్తం' పేరుతో కాంగ్రెస్ సర్కార్ సిద్ధం చేసింది.

- వివరాలు 14లో



కశ్మీర్‌కూ గాజా గతే

'కశ్మీర్‌పై భారత్, పాక్ చర్చిస్తేనే పరిష్కారం లభిస్తుందని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. లేదంటే గాజాకు పట్టిన గతే కశ్మీర్‌కూ పడుతుందన్నారు.

- వివరాలు 6లో



'పాక్'లో హిందూ మహిళ పోటీ

పాకిస్తాన్‌లో ఫిబ్రవరిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సవీరా పర్కాశ్ అనే హిందూ మహిళ తొలిసారిగా పోటీలో నిలుస్తున్నారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

నేడు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు



సింగరేణి సంస్థ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారిన ఈ ఎన్నికల్లో 39,748 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. తాజా ఎన్నికల్లో టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ పోటీపడనున్నాయి.

- వివరాలు 5లో

పొలిటికల్ రౌండప్



ఈ ఏడాది కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. సంక్షోభం నుంచి సక్సెస్ వరకు సాగిన ప్రస్థానంలో.. చివరకు ప్రభుత్వ ఏర్పాటు కలను నెరవేర్చుకుంది. ఇక, ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించాలన్న బీఆర్ఎస్ కోరిక నెరవేరలేదు. మరో ప్రధాన పార్టీ బీజేపీ.. ఆశించిన ఫలితాలను సాధించలేదు. 2023లో ఆయా పార్టీల స్థితిగతులపై కథనం

- వివరాలు 11లో..

ఆర్థిక చేయూతనివ్వండి

తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధికి సహకరించండి

ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతి

- రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలకు, విభజన చట్టంలోని హామీల అమలుకు తోడ్పాటునివ్వండి
- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇచ్చేలా చర్యలు తీసుకోండి
- ప్రధానితో అరగంట సేపు భేటీ అయిన రేవంత్, భట్టి
- ఇరువురు నేతలను అభినందించిన మోదీ
- ప్రధాని సానుకూలంగా స్పందించారని తెలిపిన డిప్యూటీ సీఎం
- ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి సడలింపులు కోరలేదని వెల్లడి



ప్రధాని మోదీని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధికి చేయూతనివ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలుకు సహకరించాలని, కేంద్రం నుంచి వివిధ రూపాల్లో రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, వైద్య, విద్యరంగాలను మరింత బలోపేతం చేసేందుకు తోడ్పాటునివ్వాలని, రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న పథకాలు, చేపట్టిన వివిధ ప్రాజెక్టుల విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరించాలని విన్నవించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు. మంగళవారం ఢిల్లీకి వచ్చిన రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు తొలిసారిగా ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలిశారు. సుమారు అరగంట పాటు జరిగిన భేటీ సందర్భంగా ఇద్దరు నేతలను ప్రధాని అభినందించారు. కాగా రేవంత్, భట్టిలు ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రం నుంచి అందాల్సిన సహకారం, రావాల్సిన నిధులు తదితర అంశాలపై చర్చించారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇందులో ప్రధానంగా విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం స్టీలు ప్లాంటు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, సైనిక్ స్కూల్, ఐఐఎం ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి అందాల్సిన నిధులు తదితరాలను పొందుపరిచారు. ఇటీవల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలోని అంశాలను కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

ముఖ్యాంశాలు ఇవే..

➤ ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 2015 నుంచి 2021 వరకు ప్రతి ఏటా రూ.450 కోట్ల చొప్పున రూ.2,250 కోట్లను కేంద్రం విడుదల చేసింది. కాగా 2019–20, 21–22, 22–23, 23–24 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్ గ్రాంట్లు రూ.1,800 కోట్లు విడుదల చేయాలి. పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థికసంఘం నిధులు రూ. 2,233.54 కోట్లు వెంటనే విడుదల చేయాలి.

➤ రాష్ట్రంలో 14 రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదనలు పంపించాం. అందులో కేవలం రెండింటికే ఆమోదం తెలిపారు. మిగతా 12 రహదారుల

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని దేశంలోనే

అగ్రగామిగా నిలుపుతాం

ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ అభివృద్ధిని వేగవంతం చేస్తాం

- ఫాక్స్‌కాన్ కొంగరకలాన్ ప్రాజెక్టుకు సహకారం అందిస్తాం
- ఫాక్స్‌కాన్‌కు చెందిన హాన్‌హాయ్ ప్రతినిధి బృందంతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ

2లో



కంప్యూటర్ మాయం

అందులో ఉన్నత విద్యామండలి కీలక డేటా!

- 2014 నుంచి ఫైళ్లు యథాతథంగా ఉంచాలని ఇటీవల సీఎస్ ఆదేశం... ఆ రోజు నుంచి కనిపించని సిస్టమ్

➤ ఉన్నత విద్యామండలికి సంబంధించి కీలకమైన డేటా ఉన్నట్లు భావిస్తున్న కంప్యూటర్ కనిపించకుండాపోయింది. 2014 నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లోని ఫైళ్లు యథాతథంగా ఉంచాలని సీఎస్ ఆదేశించిన రోజే ఈ ఘటన జరగడం అనుమానాలకు తావిస్తోంది. అసలు అందులో ఏముంది? హార్డ్‌డిస్క్‌ను, అందులోని డేటాను ఏం చేసి ఉంటారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

14లో

'మహాలక్ష్మి'కి భద్రత!

మహిళా ప్రయాణికులు పెరగడంతో బస్టాండ్ల వద్ద భారీగా పెరిగిన దొంగతనాలు

- భద్రత కల్పించాలంటూ పోలీసు శాఖకు ఆర్టీసీ విన్నపం
- పోలీసులు కాదంటే.. ప్రైవేటు సెక్యూరిటీ ఏర్పాటు చేసుకునే యోచన
- అన్ని బస్టాండ్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయం

2లో



క్లుప్తంగా...

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి టీయూడబ్ల్యూజే విజ్ఞప్తి



రేవంత్, భట్టికి మెమొరాండం అందిస్తున్న టీయూడబ్ల్యూజే ఢిల్లీశాఖ ప్రతినిధులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో పనిచేస్తున్న తెలంగాణ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (హెచ్–143) ఢిల్లీశాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు విజ్ఞప్తి చేసింది. తెలంగాణ భవన్‌లోని గురజాడ హాల్‌లో మంగళవారం టీయూడబ్ల్యూజే ఢిల్లీ శాఖ అధ్యక్షుడు నాగిళ్ల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి వంగా తిరుపతి, కోశాధికారి శిరీష్ రెడ్డి తదితరులు సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఢిల్లీలో పనిచేస్తున్న తెలంగాణ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇళ్ల స్థలాల కేటాయింపుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, ఆరోగ్యశ్రీ పథకాన్ని ఢిల్లీ జర్నలిస్టులకు వర్తింపజేసేలా కార్పొరేట్ ఆసుపత్రిని ఎమ్ ప్యానెల్‌మెంట్ చేయాలని, దేశ రాజధానిలో కొత్తగా నిర్మించనున్న తెలంగాణ భవన్‌లో సీనియార్టీ ప్రాతిపదికన అక్రిడేటెడ్ జర్నలిస్టులకు నామమాత్రపు అద్దెకు క్వార్టర్లు కేటాయించాలని కోరారు.

అర్హుడైన ప్రతి లబ్ధిదారుడికి అవకాశం కల్పిస్తాం

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్



పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ గ్యారంటీల దరఖాస్తు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు టైం టేబుల్ ఉంటుందని, దీని కోసం ప్రతి వార్డుకు ఒక ఇన్‌చార్జిని కేటాయించామని, టీం లీడర్‌తోపాటు ఏడుగురు సభ్యులుంటారని వివరించారు. లబ్ధిదారులు తమకు వర్తించే స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతీ దరఖాస్తుకు రశీదు ఇస్తామన్నారు. ప్రజావాణిలో ఇప్పటివరకు 22 వేల దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. వాటిని కూడా పరిష్కరిస్తున్నామన్నారు.

మాజీ ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్‌పై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి ఫిర్యాదు మేరకు నమోదు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పర్తి స్రవంతిని మానసికంగా వేధించి అవమానపర్చారనే ఫిర్యాదుల నేపథ్యంలో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తనను అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డితోపాటు కలెక్టర్ లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ఏడాది క్రితం స్రవంతి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషన్ కేసు నమోదుకు సిఫార్సు చేసింది. దీంతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. ''అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నన్ను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశారు. అలాగే మున్సిపల్ కౌన్సిలర్లతో తప్పుడు ఫిర్యాదులు చేయించిన అప్పటి కలెక్టర్ అమయ్‌కుమార్ చైర్‌పర్సన్ అయిన నన్ను సస్పెండ్ చేయడంతో పాటు ఇబ్బందులకు గురిచేశారు. ఈ విషయమై ఎలాంటి విచారణ చేయకుండానే మానసికంగా దెబ్బతీశారు. అలాగే దళిత మహిళ అనే వివక్షతో అప్పటి మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ చైర్‌పర్సన్‌కు ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేశారు. వాళ్లపై తగు చర్యలు తీసుకోండి'' అని స్రవంతి గతంలో తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇదండీ సంగతి



వెనుకబడిన చోటే వెతుక్కోనేలా..

- మల్కాజిగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల ఎంపీ సీట్లపై కాంగ్రెస్ గురి
- స్థానిక పరిస్థితుల ఆధారంగా లోక్‌సభ ఎన్నికలకు వ్యూహం
- త్వరలోనే గ్రేటర్ డివిజన్లకు ఇన్‌చార్జీల నియామకం.. చేరికలపై దృష్టి
- హైదరాబాద్, సికింద్రాబాద్ నేతలతో ఇన్‌చార్జి మంత్రి పొన్నం భేటీ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉన్న నాలుగు పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా మంగళవారం గాంధీ భవన్‌లో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాల పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, స్థానిక నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ రెండు చోట్లా పార్టీ గెలుపునకు సహకరించే అంశాలు, ప్రతికూల పరిస్థితులపై చర్చించిన కాంగ్రెస్ నేతలు అందుకు తగిన కార్యాచరణను రూపొందించుకున్నారు.

నిరాశపరిచిన ఫలితాలు..

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చిన ఫలితాలు కాంగ్రెస్ పార్టీని నిరాశపరిచాయి. ఈ ఫలితాలను సమీక్షించుకున్న కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి, చేవెళ్ల, సికింద్రాబాద్, హైదరాబాద్ స్థానాల్లో తమకు లభించిన ఓట్లు, ఇతర ప్రధాన పక్షాలకు వచ్చిన ఓట్ల సంఖ్య ఆధారంగా వ్యూహం రూపొందించుకోవాలని నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో బీఆర్‌ఎస్‌తో పోలిస్తే వెనుకబడినప్పటికీ చెప్పుకోదగిన స్థాయిలోనే ప్రజల మద్దతు లభించింది. మల్కాజిగిరి పరిధిలో బీజేపీ కంటే ఎక్కువ ఓట్లే వచ్చినా బీఆర్‌ఎస్ కంటే దాదాపు 3.5 లక్షల ఓట్లు తక్కువ వచ్చాయి. మల్కాజిగిరి కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కావడంతో పార్లమెంటు ఫలితాలు కొంతమేర భిన్నంగా ఉంటాయని ఆ పార్టీ అంచనా వేస్తోంది. ఆ నియోజకవర్గం పరిధిలో పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేయడంతోపాటు ఇతర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహించడం ద్వారా బలపడాలని భావిస్తోంది. చేవెళ్లలోనూ బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్‌కు దాదాపు లక్ష ఓట్లు తక్కువగా వచ్చాయి. ఇక్కడ కూడా కొంత వ్యూహాత్మకంగా ముందుకెళ్తే గెలుపు కష్టమేమీ కాదని కాంగ్రెస్ భావిస్తోంది. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్ స్థానాల్లోనే కాంగ్రెస్‌కు కొంత ఇబ్బందికర పరిస్థితి ఉంది. ఇక్కడ అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా పార్టీకి బలమైన నాయకత్వం కూడా లేదు. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లకు కొత్త ఇన్‌చార్జీలను నియమించాలని పార్టీ భావిస్తోంది. ఇన్‌చార్జీల ద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేతల సమన్వయంతో క్షేత్రస్థాయిలో కేడర్‌ను కదిలించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఆసరాగా బ్యాలెట్ బాక్సులు నిండేలా పనిచేయాలని నిర్ణయించింది. హైదరాబాద్ స్థానం పరిధిలో ఎంఐఎంను ఢీకొట్టడం కష్టమే అయినా అభ్యర్థి ఎంపిక నుంచి పోలింగ్ వరకు పకడ్బందీగా వ్యవహరించాలని, ఎంఐఎంకు దీటైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని నిర్ణయించింది.

ప్రజలకు దగ్గరగా పనిచేయండి: ఇన్‌చార్జి మంత్రి పొన్నం

హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాల నేతలతో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందజేయడంలో పార్టీ నేతలు ముందుండాలని సూచించారు. ప్రజలకు దగ్గరగా ఉండేలా నాయకులు పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6 వరకు జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో కాంగ్రెస్ కేడరంతా పాల్గొనాలని కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 28న వాడవాడలా ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

4 ఎంపీ సీట్ల పరిధిలో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు (2023)

స్థానం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ	ఎంఐఎం
మల్కాజిగిరి	5,82,914	9,38,064	4,26,510	-
చేవెళ్ల	6,09,527	7,07,456	3,35,504	25,670
సికింద్రాబాద్	2,80,607	4,63,740	2,18,397	62,185
హైదరాబాద్	1,01,014	1,71,497	2,21,974	4,23,729
మొత్తం	15,74,062	22,80,757	12,02,385	5,11,584



హాన్‌హాయ్ ప్రతినిధి వీ లీకి జ్ఞాపిక అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్

రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం

- ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ అభివృద్ధిని వేగవంతం చేస్తాం
- ఫాక్స్‌కాన్ కొంగరకలాన్ ప్రాజెక్టుకు సహకారం అందిస్తాం
- ఫాక్స్‌కాన్‌కు చెందిన హాన్‌హాయ్ ప్రతినిధి బృందంతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పారిశ్రామికరంగ అభివృద్ధిలో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు సులభంగా లభించేలా చూస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్‌కు చెందిన హాన్‌హాయ్ ప్రెసిషన్ ఇండస్ట్రీ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలిసింది. ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఫాక్స్‌కాన్ చేపట్టిన ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా రేవంత్ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ అభివృద్ధిని వేగవంతం చేస్తామని, అన్ని రంగాలను ప్రోత్సహించేందుకు స్నేహపూర్వక విధానాలు అవలంబిస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ ఉత్పాదక కేంద్రం నిర్వహణకు, ఫాక్స్‌కాన్ రాష్ట్రంలో చేపట్టే భవిష్యత్తు ప్రాజెక్టులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

రెండేళ్లలో 25 వేల ఉద్యోగాలు...

ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థగా పేరొందిన ఫాక్స్‌కాన్‌కు యాపిల్ ఐఫోన్‌తో పాటు గూగుల్, షియోమీ, అమెజాన్, హ్యూలెట్ పాకర్డ్, అలీబాబా, సిస్కో, ఫేస్‌బుక్, సోనీ, మైక్రోసాఫ్ట్, నోకియా వంటి దిగ్గజ కంపెనీలు కస్టమర్లుగా ఉన్నాయి. చైనా, వియత్నాం, థాయ్‌లాండ్, మలేసియా, అమెరికా, యూరప్, భారత్ సహా 24 దేశాల్లో ఫాక్స్‌కాన్ కార్యకలాపాలు సాగిస్తోంది. భారత్‌లో శ్రీసిటీ (ఏపీ), శ్రీపెరంబదూర్ (తమిళనాడు), బెంగళూరు (కర్ణాటక)తోపాటు తెలంగాణ (కొంగరకలాన్)లో ఉత్పాదక కేంద్రాలు ఉన్నాయి. యాపిల్ ఐఫోన్లకు ఇయర్‌పాడ్స్ తయారీకి సంబంధించి తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహించేందుకు ఈ ఏడాది మార్చిలో రాష్ట్ర ప్రభుత్వంతో ఫాక్స్‌కాన్ ఒప్పందం కుదుర్చుకుంది. ప్లాంటు నిర్మాణం కోసం ఈ ఏడాది మే 15న శంకుస్థాపన చేసింది. కొంగరకలాన్ ప్లాంటు ద్వారా దశలవారీగా లక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వంతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే రెండేళ్లలో ఫాక్స్‌కాన్ కొంగరకలాన్ యూనిట్ ద్వారా 25 వేల ఉద్యోగాల కల్పన జరగనుంది.

బీఆర్‌ఎస్ దోపిడీ పత్రాలను విడుదల చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటన

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని ధ్వజం
- రైస్ మాఫియాపై ఉక్కు పాదం మోపుతాం: మంత్రి ఉత్తమ్
- బీఆర్‌ఎస్ హయాంలో రోడ్ల నిర్మాణం తక్కువ: మంత్రి తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్

నల్లగొండ: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు, దుబారా ఖర్చు, దోపిడీ పెద్ద ఎత్తున జరిగాయని, వాటన్నింటిపై దోపిడీ పత్రాలను విడుదల చేస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం నల్లగొండలో జరిగిన ప్రజాపాలన సన్నాహక సమావేశం అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా చేసిందని, ప్రతి శాఖలోనూ అప్పులు పేరుకుపోయాయన్నారు. వాటన్నింటిపై తమ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేస్తే.. వారు ఏదో చెమటోడ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లుగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు స్వేద పత్రం విడుదల చేశారని విమర్శించారు. అందుకే వారు పదేళ్లలో తెలంగాణలో చేసిన దోపిడీపై పత్రాలను విడుదల చేస్తామన్నారు. దేశమే సిగ్గుపడేలా రూ.6 లక్షల కోట్లు అప్పులు చేసి తామేదో సాధించినట్లు చెప్పుకుంటున్నారని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. 1వ తేదీన కూడా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు.

రైస్ మాఫియాపై ఉక్కు పాదం మోపుతాం: మంత్రి ఉత్తమ్

రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే రైస్ మాఫియాపై ఉక్కు పాదం మోపుతామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తే తీవ్రమైన శిక్షలు ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను కుర్చీలు వేసుకుని కట్టిస్తామని చెప్పిందని, కానీ ఏ ఒక్క ప్రాజెక్టు కూడా కట్టించలేదన్నారు. 28వ తేదీ నుంచి జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

పది జాతీయ స్థాయి రోడ్లు వస్తే చాలు: మంత్రి తుమ్మల

వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో రోడ్లు తక్కువగా నిర్మించారని, తాను గతంలో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కొంత ముందుకు తీసుకుపోయానని, ప్రస్తుతం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు భవనాల మంత్రి కావడంతో పది జాతీయ స్థాయి రోడ్లను మంజూరు చేయిస్తే తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉంటుందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్ల మాదిరిగా ముందుకు తీసుకుపోతామని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు బాలునాయక్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, పద్మావతిరెడ్డి, మందుల సామేల్, బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.

మూడు దఫాల్లో నామినేటెడ్ పదవులు

- సంక్రాంతిలోగా కొన్ని... లోక్‌సభ ఎన్నికల్లోగా మరికొన్ని
- పీసీసీ ఇచ్చిన జాబితాపై కసరత్తు దాదాపు పూర్తి

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను మూడు దశల్లో చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసే వరకు దశల వారీగా ఈ పోస్టులను ప్రకటించాలనే యోచనలో ఆయన ఉన్నట్టు తెలుస్తోంది. తొలి దఫా సంక్రాంతి పండుగలోగా భర్తీ చేయాలని భావిస్తున్నారని, ఇందుకు సంబంధించి త్వరలోనే స్పష్టత వస్తుందని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నిజానికి ఈనెల 24నే నామినేటెడ్ పోస్టుల గురించి ప్రకటన చేయడం ద్వారా పార్టీ నేతల్లో ఉత్సాహాన్ని నింపాలని భావించినప్పటికీ అనూహ్య కారణాలతో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం వాయిదా పడటంతో ప్రకటన కూడా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల తొలి వారంలో జరిగే టీపీసీసీ భేటీలో లేదా అంతకు ముందే స్పష్టత రావొచ్చని సమాచారం.

కసరత్తు దాదాపు పూర్తి: ఈ పోస్టుల కోసం 15 రోజుల క్రితమే టీపీసీసీ నుంచి జాబితా వెళ్లింది. పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వారు, పార్టీ నిర్ణయానికి కట్టుబడి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయని నాయకులు, ఉద్యమకారులు, ఓయూ విద్యార్థి నేతలు, ఇతర ముఖ్య నేతల పేర్లను వడపోసే కార్యక్రమం దాదాపు పూర్తయిందని సమాచారం. మంత్రుల సలహాలు కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారని, వారి సిఫారసుల మేరకు కొన్ని పోస్టులను భర్తీ చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఏఐసీసీ పెద్దలతోనూ సీఎం రేవంత్ చర్చించారని, రాష్ట్ర నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం జరగకుండా ఈ పోస్టుల భర్తీకి హైకమాండ్ సూచించినట్లు చెబుతున్నారు.

అడ్డగోలుగా అప్పులు చేసి ఆస్తులు సృష్టించామని చెబుతారా?

- రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసి ఆస్తులు సృష్టించామనడం సిగ్గుచేటు
- అది బావా, బావమరిదిల స్వేదం కాదు
- తెలంగాణ ప్రజల చెమటతో సృష్టించిన ఆదాయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ పాలనలో సృష్టించిన ఆస్తులు బావా, బావమరుదల స్వేదంతో సృష్టించినవా? ఆ సర్కారు హయాంలో చేసిన అప్పులు చెల్లించేందుకు ఇప్పుడు తెలంగాణ ప్రజల స్వేదం చిందించాల్సిందే కదా? అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. 'ఏదో సాధించినట్టు స్వేదపత్రం విడుదల చేశారు. బావా బావమరుదులు కష్టపడి చెమటలు చిందించి సంపాదించినట్టు చెబుతున్నారు. అవి తెలంగాణ ప్రజల చెమటతో వచ్చిన ఆస్తులు. అదే చెమటను చిందించి అప్పులను కట్టాల్సిందే. ఇందులో బీఆర్‌ఎస్ గొప్పతనమేముంది.?' అని నిలదీశారు. మంగళవారం ఢిల్లీ వెళ్లేందుకు ముందు బేగంపేట విమానాశ్రయంలో తనను కలిసిన విలేకరులతో భట్టి మాట్లాడారు. బీఆర్‌ఎస్ స్వేదపత్రంపై ఘాటైన విమర్శలు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో రూ. 7లక్షల కోట్లు అప్పులు చేసి ఆస్తులు సృష్టించామనడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. శ్వేతపత్రంలో పేర్కొన్న అప్పులు వాస్తవమో కాదో చెప్పాలన్నారు.

దోపిడీ సొమ్మును కక్కిస్తాం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్ అవినీతి సొమ్మును కక్కిస్తామని ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ చెప్పినట్టుగానే గత ప్రభుత్వ అక్రమాలపై న్యాయ విచారణకు తమ ప్రభుత్వం ఆదేశించిందని భట్టి చెప్పారు. ఈ విచారణ తర్వాత లెక్కలు కట్టి దోపిడీ సొమ్మును కక్కిస్తామని వ్యాఖ్యానించారు.

ధనవంతులు మరింత సంపన్నులయ్యారు

బీఆర్‌ఎస్ పాలనలో పేదలు మరింత పేదలుగా మారితే ధనవంతులు మరింత సంపన్నులయ్యారని, దీనికి తామేదో తలసరి ఆదాయం పెంచామని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని భట్టి విమర్శించారు. 'హైదరాబాద్‌లో ఓ సంపన్నుడు 2 లక్షల చదరపు అడుగుల స్థలంలో ఇల్లు కట్టుకున్నాడు. గ్రామాల్లో పేదలు 40 చదరపు గజాల్లో ఉంటున్నారు. వారిద్దరి తలసరి ఆదాయం సగటును లెక్కించి గొప్పలు చెప్పుకోవడం సమంజసమేనా.?' అని నిలదీశారు. 'బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క కొత్త సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేశారా? కొత్తగా పరిశ్రమలు తెచ్చారా? కోల్ ఇండస్ట్రీ నెలకొల్పారా? ప్రభుత్వరంగ సంస్థలేమైనా తెచ్చారా? వీళ్ల సృష్టించిన ఆస్తులేంటి? కళ్లకు కనపడవా?' అని ఎద్దేవా చేశారు.

'మహాలక్ష్మి'కి భద్రత!

- మహిళా ప్రయాణికులు పెరగడంతో బస్టాండ్ల వద్ద భారీగా పెరిగిన దొంగతనాలు
- భద్రత కల్పించాలంటూ పోలీసు శాఖకు ఆర్టీసీ విన్నపం
- పోలీసులు కాదంటే.. ప్రైవేటు సెక్యూరిటీ ఏర్పాటు చేసుకునే యోచన



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ వసతి కల్పించటంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అదనంగా 13 లక్షల ప్రయాణికులు పెరగటంతో బస్సులు చాలక ఆర్టీసీకి కొత్త సమస్య ఎదురుకాగా, అది చాలదన్నట్టు ఇప్పుడు మరో ఇబ్బంది తలెత్తింది. బస్సులతోపాటు బస్టాండ్లు కూడా బాగా రద్దీగా మారటంతో ఒక్కసారిగా దొంగల బెడద తీవ్రమైంది. రోజురోజుకు బస్టాండ్లలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ప్రయాణికుల బ్యాగులు, సెల్‌ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను మాయం చేస్తున్నారు. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులూ పెరుగుతున్నాయి. బస్టాండ్లలో భద్రత ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో పోలీసు రక్షణ కావాలని ఆర్టీసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

సొంతంగానే సెక్యూరిటీ..

గతంలో ఆర్టీసీ బస్టాండ్లలో పోలీసు భద్రత ఉండేది. పోలీసు శాఖ హోంగార్డులను కేటాయించింది. కానీ ఆ తర్వాత పోలీసు శాఖలోనే సిబ్బంది కొరత ఏర్పడటంతో వారిని ఉపసంహరించుకుని సొంత అవసరాలకు వాడుకుంటోంది. అప్పటి నుంచి ఆర్టీసీ సొంతంగానే సిబ్బందిని ఏర్పాటు చేసుకుంటోంది. కానీ డిపోలు, బస్టాండ్లలో నియోగించేంత సంఖ్యలో సిబ్బంది లేరు. ఇప్పుడు కూడా పోలీసు శాఖ నుంచి హోంగార్డులను కేటాయించే పరిస్థితి ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆర్టీసీ కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ప్రారంభించినట్టు తెలిసింది. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తోంది.

అన్ని బస్టాండ్లలో సీసీటీవీ కెమెరాలు

దొంగలు రెచ్చిపోతుండటంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. పోలీసుకు ఫిర్యాదు చేస్తే ఆధారాల కోసం వారు సీసీటీవీ ఫుటేజీలు కోరుతున్నారు. కానీ అన్ని బస్టాండ్లలో సీసీటీవీ కెమెరాలు లేవు. ఇటీవల ఎండీ నిర్వహించిన సమావేశంలో అన్ని రీజియన్ల నుంచి దొంగతనాల అంశం చర్చకు వచ్చింది. దీంతో ఎక్కడెక్కడ సీసీటీవీ కెమెరాలు కావాలో కూడా అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్లతోపాటు బస్సులు నిలిపే ప్రధాన రోడ్లలోని పాయింట్ల వద్ద కూడా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వచ్చింది. అన్నిచోట్లా సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు.

60 కొత్త బస్సులు సిద్ధం

మహాలక్ష్మి పథకం అందుబాటులోకి రాకముందే కొన్ని కొత్త బస్సులకు ఆర్టీసీ ఆర్డరిచ్చింది. మార్చి నాటికి 2 వేల బస్సులు రానుండగా తొలివిడతలో 60 బస్సులు సిద్ధమయ్యాయి. ఏసీ, నాన్ ఏసీ స్లీపర్, రాజధాని, ఎక్స్‌ప్రెస్ బస్సులు వీటిల్లో ఉన్నాయి. వీటిని బుధవారమే రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించాల్సి ఉంది. కానీ, ఆ కార్యక్రమం రద్దయింది. మరో రెండుమూడు రోజుల్లో వాటిని ప్రారంభించనున్నట్టు తెలిసింది.

ఆర్థిక చేయూతనివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

అప్‌గ్రేడ్‌కు ఆమోదం తెలపాలి.

- ముులుగులోని గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. కాబట్టి 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలి.
- పునర్విభజన చట్టం ప్రకారం పూర్వ ఖమ్మం జిల్లాలో ఉక్కు కర్మాగారం (బయ్యారం స్టీల్ ప్లాంట్) ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చినందున దానిని వెంటనే నెరవేర్చాలి. అలాగే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సి ఉండగా పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామని రైల్వే శాఖ ప్రకటించింది. దానికి అదనంగా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి.
- 2010లో నాటి కేంద్ర ప్రభుత్వం బెంగళూరు, హైదరాబాద్‌లకు ఐటీఐఆర్‌ను ప్రకటించింది. కానీ 2014లో కేంద్రంలో ప్రభుత్వం మారిన తర్వాత హైదరాబాద్ ఐటీఐఆర్‌ను పక్కనపెట్టారు. దీనిని వెంటనే పునరుద్ధరించాలి.
- పీఎం మిత్ర కింద గుర్తించిన ఏడు మెగా జౌళి పార్కుల్లో వరంగల్‌లోని కాకతీయ మెగా జౌళి పార్కును బ్రౌన్ ఫీల్డ్ పార్కుగా ప్రకటించారు. దానికి రావల్సినన్ని నిధులు రానందున వెంటనే దానిని గ్రీన్‌ఫీల్డ్‌లోకి మార్చాలి.
- ప్రతి రాష్ట్రానికి ఐఐఎం మంజూరు చేయాలనే ప్రతిపాదన ఉంది.. తెలంగాణలో ఐఐఎం లేనందున హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలి. అందుకు తగిన స్థలం అందుబాటులో ఉంది. కేంద్రం కోరితే ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
- ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న రెండు సైనిక పాఠశాలలు రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయాయి. ప్రస్తుతం తెలంగాణలో సైనిక్ స్కూల్ లేనందున సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సైనిక పాఠశాల ఏర్పాటు చేయాలి.
- భారతీయ సైన్యానికి సంబంధించిన ప్రధాన కార్యాలయాలు అన్ని ప్రాంతాల్లో ఉన్నా దక్షిణాదిలో లేనందున, పుణేలో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించాలి.
- రాష్ట్ర పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లోని ప్రభుత్వ సంస్థల విభజన, పదో షెడ్యూల్‌లోని సంస్థల అంశాలను పరిష్కరించాలి. ఢిల్లీలోని ఉమ్మడి భవన్ విభజనకు సహకరించాలి.

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా భేటీ: భట్టి

ప్రధానితో భేటీ వివరాలను రేవంత్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశామని భట్టి వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను కాపాడుకొనేందుకు రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అనేక అంశాలను మోదీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. విభజన చట్టంలో పొందుపరిచిన నిధులు, నీళ్లు, నియామకాలకు సంబంధించిన అంశాలు, హక్కుల విషయంలో గత ప్రభుత్వం పదేళ్లుగా తాత్సారం చేసిందని, కేంద్రం నుంచి తీసుకురావాల్సిన వాటిని తీసుకురాలేకపోయిందని చెప్పారు. ఇవే అంశాలను ప్రధానికి వివరించామన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వంతో వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని, రాష్ట్రంపై అప్పులతో పెనుభారం మోపిందని విమర్శించారు. అప్పుల నుంచి బయటపడేందుకు, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇతోధిక సాయం అందించాలని కోరినట్లు వివరించారు. తమ వినతులపై ప్రధాని సానుకూలంగా స్పందించారని, కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించాల్సిన సహాయాన్ని అందిస్తామన్నారని చెప్పారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితుల సడలింపులపై ప్రధానితో చర్చించలేదని తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన అన్ని రకాల నిధులపై చర్చించి వినతిపత్రం ఇచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా...

త్వరలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీ: మంత్రి సీతక్క

సాక్షి, మహబూబాబాద్: రాష్ట్రంలో 14 వేల వరకు ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి ధనసరి సీతక్క చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, తొర్రూరు మండలాల్లో మంగళవారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు మరమ్మతులుంటే నిధులు మంజూరు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల పెంపునకు కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క వెల్లడించారు.

మీ దృష్టిలో నేనే సీఎం

మాజీ మంత్రి కె.జానారెడ్డి వ్యాఖ్య

మిర్యాలగూడ టౌన్: 'ముఖ్యమంత్రిగా పదవిలో ఎవరున్నా మీ అందరికీ ఉపయోగపడే విధంగా ఉండాలనేది నా అభిమతం. మీ అందరి దృష్టిలో నేనే ముఖ్యమంత్రి'అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కె.జానారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో జానారెడ్డి మాట్లాడారు. తాను ప్రభుత్వ వారధిగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలను కూడా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునే విధంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని జానారెడ్డి పిలుపునిచ్చారు.

'మహాలక్ష్మి' సిలిండర్ల కోసం బారులు

- కేవైసీ ద్వారానే రూ.500కే సిలిండర్ ఇస్తారని ప్రచారం
- గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్న జనం
- కేవైసీతో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదంటున్న అధికారులు



నల్లగొండలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉదయం 9 గంటలకే బారులు తీరిన వినియోగదారులు

సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. వినియోగదారులు తమ వివరాలను (కేవైసీ) అప్‌డేట్ చేయించుకుంటేనే ఈ పథకం వర్తిస్తుందని జరిగిన ప్రచారంతో వారం రోజులుగా ప్రజలు గ్యాస్ కనెక్షన్ బుక్‌లు, ఆధార్‌కార్డులతో గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు రూ.500కే గ్యాస్ సిలిండర్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న 'ప్రజా పాలన'కార్యక్రమం ఎజెండాలో కూడా గ్యాస్ సిలిండర్ల అంశం లేదు. రాష్ట్రవ్యాప్తంగా కోటీ 30 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, ఇందులో మహాలక్ష్మి పథకానికి అర్హులెవరనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈనెల 31లోపు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలనే ప్రచారం సోషల్ మీడియా ద్వారా ప్రచారం సాగుతుండటంతో వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది.

రేషన్ తరహాలోనే గ్యాస్‌కూ...

కేంద్ర ప్రభుత్వం అర్హులకు రేషన్ ఇచ్చేందుకు కార్డులో నమోదైన సభ్యులందరూ వేలిముద్రలు వేసి, ఈ–కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశాలిచ్చింది. దీంతో గత మూడు నెలలుగా రేషన్ దుకాణాల్లో ఈ కేవైసీ ప్రక్రియ సాగుతోంది. రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులందరూ వేలిముద్రలు వేస్తున్నారు. రేషన్ కార్డుల్లో అర్హులను గుర్తించేందుకు కేవైసీ అప్‌డేట్ చేసినట్లుగానే వంటగ్యాస్ వినియోగదారులు సైతం కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని కేంద్రం చెప్పింది. అయితే, ఇది కేవలం గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరుమీద ఉంది? కనెక్షన్ ఉన్న వ్యక్తి మరణించాడా లేక బదిలీ చేసుకున్నాడా? లేక కనెక్షన్ వద్దనుకుని వదిలేశాడా..అన్న అంశాలను తెలుసుకోవడానికేనని గ్యాస్ ఏజెన్సీలు చెప్పాయి. అయితే వినియోగదారులు ఈ–కేవైసీ అప్‌డేట్ చేసుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ రాదనే అపోహతో గ్యాస్ కేంద్రాల ముందు బారులు తీరుతున్నారు.

ఎలాంటి గడువు లేదు..

గ్యాస్ వినియోగదారులకు సంబంధించి కేవైసీ అప్‌డేట్‌కు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి గడువును విధించలేదు. వినియోగదారుల సమగ్ర సమాచారం కోసం సేకరిస్తున్న కేవైసీ అప్‌డేట్‌కు మహాలక్ష్మి పథకానికి సంబంధం లేదు. ఈ విషయాన్ని గ్యాస్ కంపెనీల ప్రతినిధులు కూడా స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం ఏజెన్సీ బాయ్ ఇంటికొచ్చినప్పుడు కేవైసీ వివరాలు సేకరిస్తారని, ప్రజలెవరూ ఏజెన్సీల వద్దకు రావద్దని కోరారు. కాగా, గ్యాస్ వినియోగదారుల కేవైసీతో రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, పౌరసరఫరాల శాఖకు గానీ ఎలాంటి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు.

ఈకేవైసీ చేసుకుంటేనే ఇస్తారట..

కొత్తగా వచ్చిన ప్రభుత్వం గ్యాస్ బండ రూ.500కే ఇస్తోందని చెప్పారు. అయితే ఈ–కేవైసీ చేసుకుంటేనే సబ్సిడీ వస్తుందన్నారు. అందుకోసమే ఒకరోజు పనికి పోకుండా గ్యాస్ కేంద్రానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకుంటున్నా. కాలనీలోని అందరూ అప్‌డేట్ చేయించుకున్నారని ప్రచారం జరగడంతో నేను కూడా గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చాను.

– ఇస్లావత్ మురళి, మంగళి కాలనీ, మహబూబాబాద్

ఇక్కడ షా కనుసన్నల్లోనే..

రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల పర్యవేక్షణ మొత్తం అమిత్ షాకే!



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణకు సంబంధించి రాష్ట్ర పార్టీ పూర్తిస్థాయి ఎన్నికల పర్యవేక్షణ బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కనుసన్నల్లోనే జరగనున్నట్టు పార్టీవర్గాల సమాచారం. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయనే అంచనాల మధ్య... రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాలను సాధించాలని జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ఒక్కో రాష్ట్రాన్ని ఒక్కో అగ్రనేతను అప్పగించాలని భావిస్తున్న బీజేపీ అధిష్టానం తెలంగాణలో ఎన్నికల పర్యవేక్షణను పూర్తిస్థాయిలో అమిత్‌షాకు కట్టబెట్టనున్నట్టు తెలుస్తోంది. కాగా, శాసనసభ ఎన్నికల సందర్భంగా పోటీ చేసేందుకు ఆసక్తి కనబరిచే ఆశావహుల నుంచి రాష్ట్ర నాయకత్వం దరఖాస్తులను ఆహ్వానించిన విషయం విదితమే. లోక్‌సభ ఎన్నికలకు మాత్రం రాష్ట్రానికి సంబంధించిన 17 ఎంపీ సీట్లకు అభ్యర్థులను జాతీయనాయకత్వమే ఖరారు చేయనున్నట్టు తెలుస్తోంది.

చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయానికి అమిత్ షా

గురువారం ఉదయం 12 గంటలకు నగరానికి చేరుకోనున్న అమిత్ షా, ముందుగా చార్మినార్ వద్దనున్న శ్రీభాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోనున్నట్టు పార్టీ నాయకుల సమాచారం. ఆ తర్వాత నగర శివార్లలోని కొంగరకలాన్‌లో శ్లోక ఫంక్షన్ హాలులో రాష్ట్ర పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు.

డబుల్ డిజిట్‌లో ఎంపీ సీట్లు గెలుస్తాం

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఎక్కువ సీట్లు గ్యారంటీ
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా
- రేపు జరిగే రాష్ట్ర పార్టీ కీలక భేటీకి అమిత్ షా
- లోక్‌సభ ఎన్నికలకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ ఖరారుపై చర్చ



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి రెండంకెల సంఖ్య (డబుల్ డిజిట్)లో ఎంపీ సీట్లు గెలుస్తామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లో కిషన్‌రెడి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీతో సహా యూపీఏ భాగస్వామ్య పక్షాల నేతలు ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికలు లోక్‌సభకు సెమీఫైనల్ అన్నారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లోనే కాంగ్రెస్ అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల్లో బీజేపీకి పట్టం కట్టారని, మధ్యప్రదేశ్‌లో నభూతో నభవిష్యతి అనేలా రికార్డ్ స్థాయిలో బీజేపీకి మెజారిటీ వచ్చిందని ఆయన ప్రస్తావించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా తిరుగులేని మెజారిటీతో మోదీ హ్యాట్రిక్ సాధించబోతున్నారని చెప్పారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర పార్టీ శ్రేణులు సంసిద్ధం అయ్యేలా గురువారం కొంగరకలాన్‌లోని శ్లోక ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, బండి సంజయ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ , పార్టీ మండల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్లు, ఇంచార్జులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు, మోర్చాల జాతీయ పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలియజేశారు.

సమీక్షల తర్వాతే నియోజకవర్గాల్లో సమావేశాలు

ప్రస్తుతం అన్ని జిల్లాల్లో శాసనసభ ఎన్నికలకు సంబంధించిన సమీక్షలు జరుగుతున్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సమీక్షల తర్వాత రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి, లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు గానూ రానున్న తొంభై రోజులకు 'ఎలక్షన్ యాక్షన్ ప్లాన్'రూపొందించుకుని ముందుకెళ్తామని చెప్పారు.

ఆ రోజున ప్రతి హిందువు ఇంట్లో దీపం వెలగాలి

జనవరి 22న అయోధ్యలో జరిగే భవ్య రామ మందిర ప్రాణప్రతిష్ట మహోత్సవంలో బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున భాగస్వామ్యం కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 22న దేశంలోని ప్రతీ దేవాలయాన్ని అలంకరించి, గుడుల ముందు స్క్రీన్లు ఏర్పాటు చేసి రామమందిర ప్రారంభోత్సవాన్ని భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని ఆయా మందిరాల నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా ప్రతి హిందువు తమతమ ఇళ్లలో దీపాలు వెలిగించి కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కిషన్‌రెడ్డి కోరారు.

సీపీఐ విప్లవం కోసం పుట్టింది..

ఎన్నికల కోసం పుట్టిన పార్టీ కాదు: సురవరం
మఖ్దూంభవన్‌లో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో సురవరం, చాడ, కూనంనేని, నారాయణ

సాక్షి, హైదరాబాద్: సీపీఐ ఎన్నికల కోసం పుట్టిన రాజకీయ పార్టీ కాదని, విప్లవం కోసం పుట్టిందని ఆ పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం మఖ్దూంభవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అరుణపతాకాన్ని సురవరం సుధాకర్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో సురవరం మాట్లాడుతూ ఎన్నికల్లో తీవ్రమైన లొసుగులు, అంతులేని డబ్బు ప్రభావం, మద్యం, కులం, మతం కారణంగా తాత్కాలికంగా ఓడిపోవచ్చనని, కానీ ప్రజల కోసం నిరంతరం పని చేసే పార్టీ కమ్యూనిస్టు పార్టీయేనని ఉద్ఘాటించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ దేశాన్ని కాపాడుకోవాలంటే ముందు రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి హక్కుల కోసం రాజకీయ పోరాటం చేయాలని, గ్రామీణ, పట్టణాల వరకు కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ సృష్టి, గాలి, భూమి, నీరు, విశ్వం ఉన్నంత వరకు ఎర్రజెండా ఉంటుందన్నారు. పార్టీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, సీపీఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12% ఓట్లున్న వాళ్లు నన్ను ఓడించారు

80 శాతం హిందువుల ఓటమి ఇది: ఎంపీ బండి సంజయ్



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న బండి సంజయ్

కరీంనగర్ కల్చరల్: 'హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన ధర్మం కోసం పోరాడుతున్న నన్ను 12 శాతం ఓటు బ్యాంకు ఉన్న ఒక వర్గం వాళ్లే ఓడగొట్టారు' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇది తన ఓటమిగా భావించడం లేదని, 80 శాతం ఓటు బ్యాంకు కలిగిన హిందువుల ఓటమి ఇదని చెప్పారు. మంగళవారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత మూడు ఎన్నికల్లో ఆ వర్గం వాళ్లే తనను ఓడించారని, అయినా తనకు బాధ లేదని, హిందూ ధర్మ పరిరక్షణ కోసం రాజీలేకుండా పోరాడుతూనే ఉంటానని చెప్పారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, సుఖసంతోషాలతో గడపాలని ఆ దేవుడిని కోరుకున్నా అని పేర్కొన్నారు. 'అసలు చిల్డ్రన్స్ డే ఎందుకు జరుపుకుంటారు? అర్థం పర్థం లేని దినోత్సవాలు జరుపుకోవడం కంటే పిల్లలకు, యువతకు స్ఫూర్తినిచ్చే మహనీయుల చరిత్రను స్మరించుకునేలా కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు సౌకర్యాలు కల్పించకుండా భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఒక వర్గం ఓట్ల కోసం హిందూ మతంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడి చేస్తున్నారని మండిపడ్డారు.

కారు ప్రమాదం చేసింది సాహిలే!

- బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ఇతడు
- తన స్థానంలో డ్రైవర్‌ను ఉంచేందుకు ప్రయత్నం
- ప్రజాభవన్ వద్ద ప్రమాదంపై వస్తున్న స్పష్టత
- దుబాయ్ పారిపోయిన అతడిపై ఎల్‌ఓసీ జారీ
- తప్పించుకోవడంలో పోలీసుల పాత్రపై విచారణ
- రూఢీ కావడంతో ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు



ప్రమాదానికి కారణమైన కారు



తండ్రి షకీల్‌తో సాహిల్(ఫైల్)



ఇన్‌స్పెక్టర్ దుర్గారావు

సాక్షి, సిటీబ్యూరో: పంజగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ ఎదురుగా ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం' చుట్టూ అల్లిన కట్టు కథల్ని పోలీసు ఉన్నతాధికారులు ఛేదిస్తున్నారు. ప్రమాద సమయంలో కారును బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమీర్ కుమారుడు సాహిల్ అలియాస్ రహీల్ అమీర్ నడిపినట్లు గుర్తించారు. దీనిపై తొలుత పంజగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసులో షకీల్ కుమారుడి పేరు లేకపోవడం, అంతకు ముందే అతను తప్పించుకున్నట్లు ప్రచారం జరగడంతో మంగళవారం ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ప్రాథమిక విచారణ నేపథ్యంలో సాహిల్ పాత్రను నిర్ధారించారు. పరారీలో ఉన్న అతడి కోసం ముమ్మరంగా గాలిస్తున్న నేపథ్యంలోనే దుబాయ్ పారిపోయినట్లు తెలిసింది. దీంతో అతడిపై అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవులకు లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేసినట్లు డీసీపీ ఎస్‌ఎం విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసుల పాత్ర రూఢీ కావడంతో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావును సస్పెండ్ చేస్తూ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ప్రమాదం చేసి అక్కడే మంతనాలు...

సాహిల్, అతడి స్నేహితుడితో పాటు ఇద్దరు యువతులు ఆదివారం తెల్లవారుజామున బీఎండబ్ల్యూ కారులో (టీఎస్ 13 ఈటీ 0777) బేగంపేట వైపు నుంచి పంజగుట్ట వైపు వస్తున్నారు. ఆ సమయంలో కారు సాహిల్ నడుపుతున్నాడు. తెల్లవారుజామున 2.45 గంటల ప్రాంతంలో వేగంగా దూసుకు వచ్చిన కారు ప్రజాభవన్ ఎదురుగా ఉన్న బారికేడ్లను ఢీకొట్టింది. దీంతో అవి పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు కారు సైతం వాటిలో ఇరుక్కుపోయింది. ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న నలుగురూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే సాహిల్ తన స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. ఈ నలుగురితో పాటు అక్కడికి చేరుకున్న మరో ఐదుగురూ ప్రమాద స్థలికి సమీపంలో ఉన్నని ఓ జ్యువెలరీ దుకాణం పక్క గల్లీలో చాలాసేపు మంతనాలు జరిపారు. ఈ లోగా విషయం తెలుసుకున్న పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు ఆ ప్రాంతానికి చేరుకుని వివరాలు ఆరా తీస్తుండగా... పక్కనే గల్లీలో మంతనాలు జరుపుతున్న వారు తారసపడ్డారు. వారిని ప్రశ్నించగా సాహిల్ అది తన వాహనామేనని, తానే నడుపుతుండగా ప్రమాదం జరిగిందని అంగీకరించారు. దీంతో కారులో ప్రయాణించిన మిగిలిన ముగ్గురి వివరాలు నమోదు చేసుకున్న ఆయన సాహిల్‌ను పంజగుట్ట పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కేసులో ప్రస్తావన లేకపోవడంతో...

అనంతరం సాహిల్‌ను ఓ హోంగార్డుకు అప్పగించి పక్కనే ఉన్న ట్రాఫిక్ ఠాణాలోకి తీసుకువెళ్లి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేయించాలని సూచించారు. అప్పటికే సాహిల్ తన వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న అబ్దుల్ ఆరిఫ్‌కు ఫోన్ చేసి ఈ విషయం చెప్పి మరో డ్రైవర్ సోహైల్‌ను తీసుకుని పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించాడు. సాహిల్ వెళ్లేటప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న అబ్దుల్ ఆరిఫ్, సోహైల్‌లు సాహిల్‌ను తప్పించారు. సాహిల్, సోహైల్ అక్కడి నుంచి మరో కారులో పారిపోగా... వెంటనే అప్రమత్తమైన హోంగార్డు ఆరిఫ్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించాడు. పంజగుట్ట ట్రాఫిక్ ఠాణాలో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇందులో సాహిల్, సోహైల్‌ల పేర్లు, పరారైన ప్రస్తావన సహా ఏ అంశాన్నీ పేర్కొనకుండా ఆరిఫ్ మాత్రమే కారకుడైనట్లు ఆరోపణలు చేశారు. పోలీసులు కారును స్వాధీనం చేసుని పంజగుట్ట ఠాణాకు తరలించారు. అత్యంత గోప్యంగా ఉంచిన ఈ విషయం సోమవారం వెలుగులోకి రావడంతో పోలీసులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉద్దేశపూర్వకంగానే అధికారులు మాజీ ఎమ్మెల్యే కుమారుడైన సాహిల్‌ను తప్పించారని అనుమానాలు వ్యక్తమయ్యాయి.

డీసీపీ స్వయంగా విచారణ చేయడంతో...

ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఈ ఉదంతంపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్‌ఎం విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. మంగళవారం ఉదయం రంగంలోకి దిగిన ఆయన పంజగుట్ట ఠాణాకు వచ్చి విచారణ చేపట్టారు. ఘటనాస్థలి పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను సైతం పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే సాహిల్ పాత్ర వెలుగులోకి వచ్చింది. అతడి సూచన మేరకే వారి ఇంట్లో పని చేసే ఆరిఫ్ ఠాణా వద్దకు వచ్చాడని, సోహైల్‌తో కలిసి అతడిని తప్పించి, తానే ప్రమాదం చేసినట్లు పోలీసులకు చెప్పాడని గుర్తించారు. ఆరిఫ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన అధికారులు... సాహిల్‌పై అదనపు సెక్షన్ల కింద ఆరోపణలు చేశారు. పరారీలో ఉన్న అతడి కోసం రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు అతడు దుబాయ్‌లో ఉన్న తన కుటుంబం వద్దకు పారిపోయినట్లు గుర్తించి ఎల్‌ఓసీ జారీ చేశారు. పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ సెలవులో ఉండటంతో ఎస్సార్‌నగర్ ఏసీపీ వైవీ రావ్‌కు ఈ కేసు దర్యాప్తు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామాల నేపథ్యంలో డీసీపీ మంగళవారం పంజగుట్ట ఠాణాకు చెందిన అధికారులను తమ కార్యాలయానికి పిలిపించి సమీక్ష నిర్వహించడంతో పాటు తీవ్రంగా మందలించారు. ఓ దశలో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు లో బీపీతో అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. చివరకు కేసు నమోదు తదితర అంశాల్లో ఆయన పాత్ర తేలడంతో కొత్వాల్‌కు నివేదించారు. ఆయన ఇన్‌స్పెక్టర్ దుర్గారావును సస్పెండ్ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

17 సెక్షన్ల కింద ఆరోపణలు..

కారు ప్రమాద ఘటనలో సూత్రధారిగా ఉన్న సాహిల్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ న్యాయస్థానానికి సమాచారం ఇచ్చిన పంజగుట్ట పోలీసులు అతడి చుట్టూ ఉచ్చు బిగిస్తున్నారు. ప్రాథమికంగా ఆదివారం తెల్లవారుజామున పంజగుట్ట పోలీసులు ఆరిఫ్‌పై (ఐపీసీ), మోటారు వాహనాల చట్టం (ఎంవీ యాక్ట్), ప్రజా ఆస్తుల పరిరక్షణ చట్టంల్లోని (పీడీపీపీ) మూడు సెక్షన్ల (274, 189, 3) కేసు నమోదు చేశారు. అయితే ఉన్నతాధికారుల విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాల నేపథ్యంలో కేవలం పీడీపీపీలోని సెక్షన్ మినహాయిస్తే మిగిలిన రెండూ సరైనవి ప్రయోగించలేదని గుర్తించారు. దీంతో ఆరిఫ్ రిమాండ్ రిపోర్టులో సాహిల్ పేరుతో పాటు ఈ ఐపీసీ, ఎంవీ యాక్ట్‌ల్లోని మరో 14 సెక్షన్లను జోడించారు. తొలుత నమోదు చేసిన ఐపీసీలోని 274, ఎంవీ యాక్ట్‌లోని 189 సెక్షన్లు తొలగించారు. వీటికి బదులుగా వీరిద్దరిపై పీడీపీపీ యాక్ట్‌లోని సెక్షన్ 3తో పాటు ఐపీసీలోని 308, 419, 279, 201, 203, 212, 213, 214, 182, 109, 34తో పాటు ఎంవీ యాక్ట్‌లోని 184, 185, 187, 188, 205లను జోడించారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా సాహిల్‌తో పాటు అతడి తండ్రి షకీల్ పేర్లనూ నిందితులుగా చేర్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

బ్రేకప్ చెప్పాడని..

- గంజాయి కేసులో మాజీ ప్రియుడిని ఇరికించేందుకు పథకం
- లా విద్యార్థిని అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

బంజారాహిల్స్: తనకు బ్రేకప్ చెప్పాడని మాజీ ప్రియుడిపై కక్ష తీర్చుకునేందుకు తాజా ప్రియుడితో కలిసి వేసిన పన్నాగం బెడిసికొట్టి ఓ లా విద్యార్థిని కటకటాలపాలైంది. మాజీ ప్రియుడిని గంజాయి కేసులో ఇరికించేందుకు యత్నించి అడ్డంగా బుక్ అయిన సదరు యువతితో పాటు ఆమెకు సహకరించిన మరో ఆరుగురు యువకులను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా.. రహ్మత్‌నగర్‌కు చెందిన గుండ్రపల్లి అదోక్షజ అలియాస్ రింకి అలియాస్ రీనా(26) కూకట్‌పల్లిలోని అనంత లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ ఫైనలియర్ చదువుతోంది. రెండేళ్ల క్రితం సరూర్‌నగర్‌కు చెందిన కాశగోని శ్రావణ్(30)ని ప్రేమించింది. వారి మధ్య మనస్పర్థలు రావడంతో నాలుగు నెలల క్రితం విడిపోయారు. బ్రేకప్ అయిన తర్వాత తనను తిరుగుబోతు అని పబ్‌లలో బాయ్‌ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేస్తోందని, డ్రగ్స్ తీసుకుంటోందని శ్రావణ్ ప్రచారం చేస్తున్నాడని, అతడిపై కక్ష తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో గడ్డి అన్నారం ప్రాంతానికి చెందిన తాజా ప్రియుడు దీపక్ మోహన్‌తో కలిసి పథకం వేసింది. పది రోజులుగా ఎన్డీపీఎస్ యాక్ట్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటాన్ని గుర్తించిన ఆమె శ్రావణ్ కారులో గంజాయి ప్యాకెట్లు పెట్టి అతడిని ఇరికించాలని ప్లాన్ వేసింది. ఇందులో భాగంగా రూ.14 వేలు దీపక్‌కు జీపే చేసింది. దీపక్ తన స్నేహితుడు యశ్వంత్‌సాయికి రూ.3,500 ఇచ్చి ధూల్‌పేట్‌కు వెళ్లి గంజాయి తీసుకురావాల్సిందిగా చెప్పడంతో సోమవారం అతను ఎనిమిది గంజాయి ప్యాకెట్లు కొనుక్కొచ్చాడు. రింకి, దీపక్, యశ్వంత్‌సాయి, దీక్షిత్‌రెడ్డి, ప్రణీత్‌గోపి, సూర్యతేజ, మహేందర్ యాదవ్ తదితరులు ప్లాన్ ప్రకారం శ్రావణ్‌కు ఫోన్ చేసి కృష్ణకాంత్ పార్కు వద్దకు రావాలని విడిపోయిన రింకీని, నిన్ను మళ్లీ కలుపుతామని నమ్మించారు. శ్రావణ్ కారులో అక్కడికి రాగా వెనక ప్రణీత్, సూర్యతేజ కూర్చోగా ముందు సీట్లో శ్రావణ్ పక్కన దీక్షిత్ కూర్చున్నారు. దీపక్, అదోక్షజ ఇద్దరూ బైక్‌పై జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని అమ్నేషియా పబ్‌కు వచ్చారు. కారులో వస్తున్నప్పుడే పథకం ప్రకారం ప్రణీత్, సూర్యతేజ తమ జేబుల్లో ఉన్న గంజాయి ప్యాకెట్లను శ్రావణ్ సీటు కింద పెట్టారు. అమ్నేషియా పబ్‌కు వెళ్లిన కొద్దిసేపటికే ఎవరికి వారు ఫోన్లు వచ్చినట్లు నటిస్తూ అక్కడి నుంచి జారుకున్నారు. కిందికి వచ్చిన అదోక్షజ అమ్నేషియా పబ్ ముందు ఓ కారులో గంజాయి ఉందంటూ పోలీసులకు సమాచారం ఇచ్చింది. జూబ్లీహిల్స్ పోలీసులు పబ్ వద్దకు చేరుకుని తనిఖీలు చేయగా కారు సీట్ల కింద ఎనిమిది గంజాయి ప్యాకెట్లు దొరికాయి. శ్రావణ్‌ను ప్రశ్నించగా తనకేమీ తెలియదని చెప్పాడు. తీగలాగితే డొంక కదిలినట్లుగా మాజీ ప్రియుడిని గంజాయి కేసులో ఇరికిద్దామని పక్కా ప్లాన్ వేసిన అదోక్షజ గుట్టు రట్టయింది. అదోక్షజతో పాటు దీపక్ మోహన్, యశ్వంత్ సాయి, దీక్షిత్‌రెడ్డి, ప్రణీత్ గోపి, సూర్యతేజ, మహేందర్ యాదవ్‌లపై కేసులు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితురాలు అదోక్షజ అలియాస్ రింకి



పొగమంచు చంపుతోంది..

పెద్దపల్లి జిల్లాలో పడిపోయిన ఉష్ణోగ్రతలు

పెద్దపల్లి జిల్లాలో ఉష్ణోగ్రతలు 13 నుంచి 11.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదవుతుండటంతో చలితీవ్రత పెరుగుతోంది. ఉదయం 9 గంటల వరకూ పొగమంచు కమ్ముకోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి వణుకుతున్నారు. వాహనచోదకులు ఉదయం దీపాలు వెలిగించి వాహనాలను నడుపుతున్నారు. పెద్దపల్లి పట్టణ శివారులోని రంగంపల్లి, రాఘవాపూర్, అప్పన్నపేట, పెద్దపల్లిలోని రహదారులు, పట్టణమంతా మంగళవారం ఉదయం పొగమంచు ఇలా కమ్మేసింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

శామీర్‌పేట్‌లో దారిదోపిడీ

ఆటో డ్రైవర్‌ను బెదిరించి రూ.17 వేలు లాక్కున్న దుండగులు

శామీర్‌పేట్: శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి దారి దోపిడీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి నగదు లాక్కెళ్లారు. శామీర్‌పేట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, రామారం గ్రామానికి చెందిన బక్కొల్ల దుర్గయ్య ట్రాలీ ఆటోలో సోమవారం సాయంత్రం టమోటా లోడ్‌ను బోయిన్‌పల్లి మార్కెట్‌లో దింపి గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. శామీర్‌పేట ఫౌజీ దాబా వద్దకు చేరుకోగానే రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను ఆపి తాళం చెవులు లాక్కున్నారు. దుర్గయ్యను కత్తితో బెదిరించి, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అతను తన వద్ద ఉన్న రూ.17 వేలు వారికి ఇచ్చాడు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శామీర్‌పేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టీకా వికటించి చిన్నారి మృతి..

విజయనగర్‌కాలనీ: టీకా వికటించి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్‌ఐ మహమ్మద్ జాహేద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ శ్యాంనగర్‌లో నివసించే పోతురాజు, రేణుక దంపతులకు 40 రోజుల వయసున్న కూతురు ఉంది. చిన్నారికి టీకా ఇప్పించేందుకు ఈ నెల 23న ఆసిఫ్‌నగర్ వెంకటమ్మ తోటలోని అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లారు. 45 రోజుల తర్వాత ఇవ్వాల్సిన వ్యాక్సిన్ 37 రోజులకే ఇచ్చారు. అప్పటి నుంచి అస్వస్థతకు సరైన చిన్నారి స్పృహ కోల్పోవడంతో వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వ నిలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోతురాజు ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఒకరి జీవనోపాధిని దూరం చేయవద్దు.
అది పాపపు ధోరణి.
– వర్ధమాన మహావీరుడు

సాక్షి

బుధవారం, 27 డిసెంబర్ 2023

పాత మూస... కొత్త చట్టం

మారుతున్న కాలానికీ, అవసరాలకూ తగ్గట్టు అన్నీ మారాల్సిందే. ఆ దృష్టితో చూసినప్పుడు బ్రిటిషు కాలపు పాత చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా మూడు నేర సంబంధ చట్టాలను తీసుకురావడం అభిలషణీయమే. అయితే, ప్రతిపక్షాలకు చెందిన 140 మందికి పైగా సభ్యులను వివిధ కారణాలతో సస్పెండ్ చేసిన అనంతరం పెద్దగా చర్చ లేకుండానే గత వారం పార్లమెంట్ ఈ కొత్త చట్టాలను ఆమోదించడంపై సహజంగానే విమర్శలు వచ్చాయి. ఎవరేమన్నా కొత్త చట్టాలకు భారత రాష్ట్రపతి ఈ సోమవారం ఆమోదముద్ర వేయడంతో ఒక తతంగం ముగిసింది. కేంద్ర హోమ్ శాఖ ప్రభుత్వ రాజపత్రంలో నోటిఫై కూడా చేయడంతో, ఇక ఈ సరికొత్త నేర శిక్షాస్మృతులు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయో ప్రకటించడమే లాంఛనంగా మిగిలింది. వెరసి, బ్రిటీషు కాలం నాటి 'ఇండియన్ పీనల్ కోడ్', 'కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్', 'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ – 1872' స్థానంలో కొత్తగా 'భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)', 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', 'భారతీయ సాక్ష్య చట్టం' ప్రవేశించాయి. తెచ్చిన మార్పులేమిటి, వీటి ప్రభావం ఎలాంటిదన్నదే ఇప్పుడిక ప్రజాక్షేత్రంలో వివిధ వర్గాలలో చర్చగా మారింది.

భారతీయుల కొరకు, భారతీయుల చేత, భారతీయ పార్లమెంట్ తెచ్చిన చట్టాలంటూ హోమ్ మంత్రి ప్రకటించారు. బ్రిటిషు వలసవాద అవశేషాలను తొలగించే చర్యగా అధికార పక్షం వీటిని అభివర్ణించింది. అయితే, పేరుకు ఇవి కొత్త క్రిమినల్ చట్టాలే కానీ, బ్రిటిషు కాలపు పాత చట్టాలలోని భాష, అంశాలే ఎక్కువగా వీటిలో ఉన్నాయని నిపుణులు పెదవి విరుస్తున్నారు. పాత చట్టాల్లోని సెక్షన్లనే వరుస మార్చడం తప్ప ఈ కొత్త వాటిల్లో చేసినది తక్కువనే విమర్శలూ ఉన్నాయి. అంతే కాక, అరెస్టు, పోలీస్ కస్టడీలకు సంబంధించి కొత్త చట్టాల్లోని అంశాల పట్ల అభ్యంతరాలూ వినిపిస్తున్నాయి. కొత్త చట్టాల ఫలితంగా కస్టడీని 60 నుంచి 90 రోజుల దాకా పొడిగించే వీలుండడం లాంటివి అందుకు కారణం. ఇలాంటి అంశాలు పౌరహక్కులకు భంగకరంగా పరిణమించే ప్రమాదం ఉంది. నిజానికి, కొత్త చట్టాలు పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలన తర్వాతే సభ ముందుకొచ్చాయి. అయితే, శతకోటి భారతీయుల జీవితాలను శాసించే చట్టాలు గనక వీటిపై సభ క్షుణ్ణంగా చర్చించడం విధాయకం. అది లేకుండానే అవి చట్టం కావడం విషాదం.

అలాగని ఈ చట్టాల్లో అసలంటూ ఆహ్వానించదగినవి ఏమీ లేవనలేం. వివాహ వ్యవస్థను దెబ్బ తీస్తుందనే మిషతో వ్యభిచారాన్ని మళ్ళీ శిక్షార్హంగా మార్చాలని స్థాయీ సంఘం సిఫార్సు చేసినా, ప్రభుత్వం అందుకు తలూపలేదు. లింగమనే నిర్వచనంలో ట్రాన్స్‌జెండర్లను కూడా చేర్చడమూ మంచి నిర్ణయమే. మూకదాడి హత్యలను మరణశిక్షకు అర్హమైనవిగా చేర్చడమూ మంచి పనే. అయితే, 2017 తర్వాత మూకదాడి హత్యల డేటాను క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రచురించడం మానేసింది. అలాంటి దాడుల లెక్కలే లేకుండా కొత్త చట్టాన్ని ఎలా అమలు చేస్తారు? ప్రయోజనం ఏమిటనేది సందేహం. ఇక, రాజద్రోహానికి సంబంధించిన సెక్షన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. వాస్తవంలో పేరు మార్చారే తప్ప, అది మరింత కర్కశంగా మారిందని నిపుణుల ఆందోళన. దేశ సార్వభౌమాధికారం, సమైక్యత, సమగ్రతలకు ప్రమాదం కలిగించేలా ప్రవర్తించినట్టు భావిస్తే చాలు, సెక్షన్ 150 కింద యావజ్జీవ కారాగారవాస శిక్ష వేసే వీలుండడం భయపెడుతోంది.

కొత్త చట్టాల్లో అసలు సిసలు మార్పులు కేవలం 20 శాతమేనని ఒక అంచనా. అదే గనక నిజమైతే, ఈ మొత్తం ప్రక్రియ ప్రచారానికే తప్ప, ప్రయోజనకరం అనిపించుకోదు. అలాగే, ప్రభుత్వానికీ, పోలీసులకూ మరిన్ని అధికారాలు కట్టబెడుతున్న ఈ చట్టాల్లో జవాబుదారీతనం ఆ మేరకు కనిపించట్లేదు. ప్రజాస్వామ్యంలో అది సమర్థనీయం కాదు. వలసవాద చట్టాల్లో లాగానే ఇప్పుడూ ఉంటే జనాన్ని ఏమార్చడమే తప్ప ఏం మార్చినట్టు అన్నది ప్రశ్న. క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలంటే ఆశించేది ఇది కాదు. నిజానికి, సమాజంలోనూ, సాంకేతికంగానూ అనేక మార్పులు వస్తున్నవేళ... నేర చట్టాలను సవరించడం, నవీకరించడం చట్టబద్ధ పాలన అందించే ఏ దేశానికైనా తప్పనిసరి. అయితే, ఆ మార్పులు నిర్దేశిత సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చడం కీలకం. అలాగే, ఆ సవరించిన చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి తగ్గట్టుండడం అత్యవసరం. 150 ఏళ్ళ పాత వలసవాద చట్టాలను వదిలించుకుంటున్నామని ప్రచారం చేసుకుంటున్నప్పుడు, ఆపాటి ఆశలు, చర్చ ముఖ్యమైనవి. కానీ, వాస్తవంలో కొత్త చట్టాలు అలా లేవంటే నిరాశ మిగులుతుంది.

చట్టాల్లో అవసరమైన అనేక ప్రాథమిక సవరణలు చేసే చరిత్రాత్మక అవకాశం చేజారిపోయింది. ఐపీసీ స్థానంలో తెచ్చిన బీఎన్ఎస్ లాంటివి శిక్షలతో భయపెట్టేదిగా కాక, సంస్కరించేదిగా ఉండాలి. 1975 నుంచి 2013 మధ్యకాలంలో ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన దాదాపు 33 ప్రభుత్వ పథకాలనే ప్రస్తుత పాలకులు కొత్త పేర్లతో తమవిగా చెప్పుకుంటున్నారనీ, కొత్త పేర్లతో కొత్త నేర చట్టాలు కూడా ఆ కోవలోవే అనీ కాంగ్రెస్ ఆరోపిస్తోంది. నిందారోపణల మాటెలా ఉన్నా, ఇప్పటికీ మించిపోయింది లేదు. ప్రతిపక్షాలు, పౌరసమాజం తాలూకు భయాందోళలను పోగొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి. అన్ని వర్గాల అనుమానాలనూ నివృత్తి చేయాలి. చట్టాలు తేవడంలో లేకున్నా, కనీసం అమలులోనైనా సర్వజనామోద వైఖరి శోభనిస్తుంది. అవసరమైతే ప్రజాభిప్రాయానికి తగ్గట్టు సరికొత్త చట్టాల్లోనూ ఎప్పటికప్పుడు సవరణలు చేయాల్సిందే. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య మూలమే అది. ఒక్కమాటలో... కొత్త చట్టాలతో దేశంలోని 17.5 వేల పోలీస్ స్టేషన్లు బలోపేతమవడం సరే కానీ, 140 కోట్ల జనాభా నిస్సహాయులుగా మారిపోతేనే కష్టం.

సామాన్యులను వేధించే ప్రశ్నలెన్నో!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు అలా ముగిశాయో లేదో... 2024 సాధారణ ఎన్నికల ఫలితాల గురించిన ఊహాగానాలు అప్పుడే మొదలైనాయి. ఈ ఫలితాల ఊపుతో బీజేపీనే తిరిగి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని కొందరు చెబుతున్న విషయం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసలు ముస్లిమ్‌లకు సీట్లు ఇవ్వని బీజేపీ మళ్ళీ ఎలా అధికారంలోకి వస్తుందనే ప్రశ్న వేధిస్తోంది. అంకెలకు ఉద్వేగాలు ఉండవు. నిరావేశంగా ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే, వాస్తవాలు నిగ్గుదేలుతాయి. అధికార పక్షానికీ, ప్రతిపక్షానికీ ఓట్ల శాతంలో తేడా అతి తక్కువ. ఆ ఎన్నికల ఫలితాలకు ముందూ, తరువాతా ఆయా పార్టీల బలాబలాల్లో పెద్ద మార్పు లేదు. మరి 2024లో ప్రతిపక్షాల విజయం ఒక ఎండమావి అని ఎలా నిర్ణయిస్తారు?

ఈనాడు భారతదేశం మొత్తం రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఎన్నికల గురించే ఆలోచిస్తోంది. అయితే ఈ ఎన్నికల కంటే కూడా 2024 సాధారణ ఎన్నికలలో బీజేపీ మళ్ళీ గెలుస్తుందా లేక కాంగ్రెస్‌తో కూడిన 'ఇండియా' కూటమి వస్తుందా అనే దాని గురించి ప్రజలు మరింత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నిజానికి 'ఇండియా' కూటమికి సంబంధించి ఈ నాలుగు రాష్ట్రాల సీట్ల ఎంపిక విషయంలో కాంగ్రెస్ అలసత్వం చేసింది. ఈ ఎన్నికలలో బీజేపీకీ, కాంగ్రెస్‌కూ వచ్చిన ఉన్న ఓట్ల శాతంలో తేడా అతి తక్కువ. అసలు ముస్లిమ్‌లకు సీట్లు ఇవ్వని బీజేపీ, మళ్ళీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎలా అధికారంలోకి వస్తుంది అనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

మొన్న తెలంగాణ ఎన్నికలలో గెలిచాక ప్రోటెమ్ స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను కాంగ్రెస్ నియమించినందుకు అసెంబ్లీలో ఆయన సారథ్యంలో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయకుండా బీజేపీ బాయ్‌కాట్ చేసింది. ఇది అప్రజాస్వామిక చర్య. ఎందుకంటే ముస్లిమ్‌ల పాత్ర లేకుండా హైదరాబాద్ జీవితమే లేదు. ప్రపంచ మొత్తం పర్యాటకులు హైదరాబాద్ బిర్యానీని ఇష్టపడతారు. చార్మినార్ దగ్గర సెంటు, గాజులు కొనుక్కొనని హిందూ స్త్రీలు లేరు. వారి ఉత్పత్తులను అనుభవిస్తూనే వారిని శత్రువులుగా చూడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వారి సంగీతాన్ని ఆస్వాదిస్తూ, వారి హీరోలతో సినిమాలు నిర్మించి వందల కోట్లు సంపాదిస్తూ, రాజకీయంగా వచ్చేటప్పటికి మాత్రం వారిని నిరోధించడం అప్రజాస్వామికం కాదా!

మరో పక్క సామాజిక రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాటలు ఏంటంటే, ఈ ఎన్నికలలో వచ్చిన సీట్ల సంఖ్య మనకు అంత ప్రధానం కాదు. ఓట్ల శాతమే మనకు నమూనా. మూడు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బేననడం సందేహం లేదు. అంతేకాదు 2024లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరుగుతుందని ఆశిస్తున్న వారికి ఆ ఫలితాలు తీవ్ర ఆశాభంగం కలిగించాయని కూడా చెప్పొచ్చు. తెలంగాణలో కాంగ్రెస్ చరిత్రాత్మక పునరాగమనంతో నెలకొన్న ఉత్సాహాన్ని ఉత్తరాది అపజయాలు ఒక విధంగా తగ్గించివేశాయి. తదుపరి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి అవి అనేక అనుకూలతలను సృష్టించాయని కూడా అంటున్నారు. కానీ ఇదెంతవరకు నిజం? అంకెలకు ఉద్వేగాలుండవు. నిరావేశంగా ఆ నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను విశ్లేషించండి, వాస్తవాలు నిగ్గు దేలుతాయి. ఆ ఎన్నికల ఫలితాలకు ముందూ, తరువాతా ఆ యా పార్టీల బలాబలాల్లో పెద్ద మార్పు లేదని స్పష్టమవుతుంది. మరి 2024లో ప్రతిపక్షాల విజయం ఒక ఎండమావి అని ఎలా నిర్ణయిస్తారు?



మూడు రాష్ట్రాలలో బీజేపీకి తిరుగులేని విజయం లభించడంతో, కేంద్రంలో ఆ పార్టీని మరోసారి అధికారంలోకి రావాలని ప్రజలు ప్రగాఢంగా కోరుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదలా ఉంచి అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాలలో ప్రధాన రాజకీయ పక్షాలకు లభించిన ఓట్ల గణాంకాలను చూద్దాం. మిజోరం, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మొత్తం 12.29 కోట్ల ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో బీజేపీకి 4.82 కోట్లు, కాంగ్రెస్‌కు 4.92 కోట్లు ('ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలను కూడా కలుపుకొంటే 5.06 కోట్లు) లభించాయి. మధ్యప్రదేశ్‌లో మినహా, ఓట్ల పరంగా బీజేపీకి లభించిన ఆధిక్యత స్వల్ప స్థాయిలో మాత్రమే ఉంది. తెలంగాణాలో బీజేపీ కంటే కాంగ్రెస్‌కు పెద్ద మొత్తంలో ఓట్లు లభించాయి. మిగతా రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓట్ల లోటును తెలంగాణ గణనీయంగా భర్తీ చేసింది. మీడియా ఊదరకు విరుద్ధంగా తాజా అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి ప్రజల మద్దతు మరీ విశేషంగా ఏమీ లభించలేదని చెప్పొచ్చు.

అసలు బీజేపీ ప్రాతినిధ్యం వహించే హిందూ ధార్మిక వ్యవస్థ గురించి అంబేడ్కర్ విశ్లేషించారు. హిందూమతం ధర్మవ్యాపక సంస్థ (మిషనరీ మతం) అవునా, కాదా అనేది చర్చనీయాంశం. హిందూ మతం ఏనాడూ ప్రచారక మతంగా లేదని కొందరంటారు. ఒకానొక కాలంలో హిందూ మతం ప్రచారక మతంగా ఉన్నదనడమే సరియైన వాదంగా కన్పిస్తుంది. అది ప్రచారక మతం కాకపోతే భారత భూభాగంలో ఇంతగా వ్యాపించి ఉండేది కాదు. ఈనాడు అది ప్రచారక మతం కాదనేది కూడా సత్యమే. ఒకప్పుడు ప్రచారక మతంగా ఉన్న హిందూమతం ఇప్పుడెందుకు దానికి వ్యతిరేకంగా మారింది? ఈ ప్రశ్నకు నా జవాబు ఇది: హిందూమతం ప్రచారక మతంగా ఎప్పుడాగి పోయిందంటే, హిందువులలో కులవ్యవస్థ ఏర్పడినప్పుడు! కుల వ్యవస్థకూ, మతం మార్పునకూ పొసగదు. మతం మార్పునకు కావలసింది విశ్వాసాలూ ,సిద్ధాంతాలూ స్వీకరించడం మాత్రమే కాదు; ఈ మతం మార్పులో అంతకంటే ముఖ్యమైన మరొక విషయం ఉంది. అది – మతం మార్చుకొన్న వారికి సంఘ జీవనంలో లభించే స్థానం. ఈనాడు ఇతరుడెవరైనా హిందూ మతాన్ని స్వీకరించదలిస్తే, హిందూ మతంలో అతని స్థానమెక్కడ? ఏ కులంలో చేర్చుకోవడం? అన్యులైన వారిని తన మతంలో చేర్చుకోవాలనుకునే ప్రతీ హిందువునీ తికమకపరిచే సమస్య ఇది. ఏదో ఒక క్లబ్బులో చేరినట్టు ఒక కులంలో అందరూ చేరడానికి వీలు లేదు. క్లబ్బు సభ్యత్వం వలే కుల సభ్యత్వం స్వేచ్ఛాయుతమైంది కాదు. ఆ కులంలో పుట్టిన వారికే ఆ కులంలో సభ్యత్వం. అది కుల న్యాయం. ఈ న్యాయం కింద ఏ కులానికి ఆ కులమే స్వయం స్వతంత్రం. ఎవరైనా కొత్త వారిని ఏ కులంలోనైనా చేర్పించే అధికారం ఈ భూమి మీద ఎవ్వరికీ లేదు. నిజానికి అంబేడ్కర్ హిందూ భారతాన్ని ఆశించలేదు. లౌకిక, ప్రజాస్వామిక, సామ్యవాద భారతాన్ని ఆశించాడు. ఆయన మార్గంలో నడవకపోతే భారతదేశం ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్య, తాత్విక రంగాలలో అణగారిపోతుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

గుండెల్లో లేడన్నానా!



రామ మందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిన 25 మంది లాయర్లలో కపిల్ సిబాల్ కూడా ఉన్నారు. అసలు శ్రీరాముడి ఉనికినే ప్రశ్నిస్తూ ఆయన సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. ఇప్పుడు 'మేరే దిల్ మే తో రామ్ హై' అంటున్నారు. పరాకాష్ఠకు చేరిన కాపట్యం.

– నూపుర్ జె శర్మ, సంపాదకురాలు

నోరెందుకు రాదు!



యుద్ధాలలో చిన్నారుల మరణాలు: ఇరాక్‌లో 14 ఏళ్లలో 3,100, సిరియాలో 11 ఏళ్లలో 12,000, యెమెన్‌లో 7 ఏళ్లలో 3,700, ఉక్రెయిన్‌లో 21 నెలల్లో 520, పాలస్తీనాలో 2 నెలల్లో 12,000. బాలల యుద్ధ మరణాలను ప్రపంచం పట్టించుకోవడం లేదా? లేక మధ్యప్రాచ్య బాలల మరణాలను ఖండించడం కష్టంగా ఉంటోందా?

– ఛాన్ జైబ్ ఖాన్, రాజకీయ విశ్లేషకుడు

ప్లీజ్, వదిలేద్దురూ!



ముస్లిమ్‌లు ఈద్, బక్రీద్ మొదలైనవి ఆనందంగా జరుపుకొంటారు. అలాగే క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు తమ పండుగలను ఆనందంగా జరుపుకొంటారు. నా ఏకైక సమస్య ఏమిటంటే – హిందూ పండుగల సమయంలోనే అనవసరమైన వాదనలు, ప్రసంగాలు వినిపిస్తాయెందుకని?

– మిస్టర్ సిన్హా, పొలిటికల్ కామెంటేటర్

ఉన్నవి సరిపోవు



ఫిలాసఫీ, దానితో పాటుగా ప్రాథమిక తర్కం, విలువలు, మెటాఫిజిక్స్ వంటివి పాఠశాల స్థాయిలోనే పిల్లలకు తెలియాలి. రాయడం, చదవడం, లెక్కలు వెయ్యడం నేర్పించినట్లుగానే వీటినీ బోధించాలి. ఇందువల్ల పిల్లల్లో ప్రశ్నించే గుణం అలవడుతుంది. ప్రపంచాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస మరింతగా ఏర్పడుతుంది.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

వింత మనుషులు



ఆస్ట్రేలియన్ క్రికెట్ ఆటగాడు ప్రపంచ కప్పుపై తన పాదాలను ఆన్చినప్పుడు మాత్రమే భారతీయులు తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తారు. కానీ భారతీయ క్రికెటర్లు ఒక నిస్సహాయ ఖడ్గమృగం మీదకు వాలి ఫొటోకు పోజులిచ్చినప్పుడు ఏమీ మాట్లాడరు. వావ్! (ఆ ఫొటోను తన ట్వీట్‌కు ట్యాగ్ చేస్తూ). ఖడ్గమృగం అంతరించిపోతున్న ప్రాణుల జాబితాలో ఉన్న అరుదైన జంతువని కూడా మనం మరిచిపోయినట్లున్నాం?

– ఐశ్వర్య, వైద్య సహాయకురాలు

విపత్తు వాహకాలు



రోహ్‌తంగ్ కనుమ కింద అటల్ సొరంగం 2020 అక్టోబర్‌లో ప్రారంభం అయింది. అంతకు ముందు డిసెంబరులో రోహ్‌తంగ్ దారి గుండా వెళ్లిన వాహనాల సంఖ్య సున్నా. 2023 డిసెంబర్ 24–25 మధ్య సొరంగాన్ని దాటిన వాహనాలు 42 వేలకు పైగానే! హిమాలయ పర్యావరణానికి విపత్తు పొంచి ఉందని చెప్పడానికి ఇంతకంటే మేల్కొలుపు అవసరమా?!

– ఆనంద్ శంకర్, పారిశ్రామికవేత్త

సమ-ఉజ్జీలు



నకిలీ నెయ్యి విక్రయిస్తున్న రామ్‌దేవ్ బాబా కల్తీ వ్యాపారుల రారాజు అని బ్రిజ్ భూషణ్ సింగ్ అన్నారు. లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని రామ్‌దేవ్ బాబా అంటున్నారు. ఇప్పుడు మన రెజ్లర్లు నిష్క్రమించారు కనుక నేను వీరిద్దరి మ్యాచ్ చూడాలనుకుంటున్నాను. బరిలో రామ్‌దేవ్–బ్రిజ్‌భూషణ్. యోగా–నెయ్యి మెలితిప్పుడు.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

బాంబేలో జిన్నా హౌస్

బ్రిటిష్ కాలం నుండి ముంబయ్‌లోని మలబార్ హిల్ ప్రాంతం వీఐపీల స్థావరం. ఇక్కడే మహారాష్ట్ర గవర్నర్ 'రాజ్ భవన్', ముఖ్యమంత్రి బంగ్లా 'వర్ష', మరాఠా యోధుడు శరద్ పవార్ నివాసం 'సిల్వర్ ఓక్' ఉన్నాయి. రాజ్ భవన్‌కు కూతవేటు దూరంలో, అరేబియా సముద్రం అలలను తాకుతూ, మరో చారిత్రక నిర్మాణం కూడా ఉంది. అది పాకిస్తాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా (జననం: 1876 డిసెంబర్ 25) 'దిల్'తో నిర్మించుకున్న 'జిన్నా హౌస్'.

1905 నుండి 1947 వరకు బాంబే ప్రెసిడెన్సీలో జిన్నా న్యాయవాది వృత్తితో పాటు, కాంగ్రెస్ నేతగా వ్యవహరించారు. దక్షిణాఫ్రికాలో కార్మిక నేతగా పేరొంది బాంబే వచ్చిన గాంధీజీకి ఓవల్ మైదానంలో (1915 జనవరి 13) జరిగిన స్వాగత సభకు అధ్యక్షత వహించారు జిన్నా. వీరిద్దరూ గుజరాతీలు కావటం విశేషం. ఆ కాలంలోనే మలబార్ హిల్ లోని తన పాత ఇల్లు 'సౌత్ కోర్టు'ను కూల్చేసి, రెండున్నర ఎకరాల స్థలంలో ఈ బంగ్లాను నిర్మించారు. పాశ్చాత్య సంస్కృతి ఒంటపట్టించుకున్న జిన్నా – ఇటాలియన్ మార్బుల్, ఖరీదైన వాల్నెట్ వుడ్స్‌తో, బ్రిటిష్ పద్ధతిలో కట్టిన ఈ బంగ్లా పూర్తవ్వడానికి ఆరేళ్లు పట్టింది. ఖర్చు అంటారా? అప్పట్లోనే రెండు లక్షల రూపాయిల పై చిలుకు! 'ఈ భవనంలోని ఒక్కొక్క ఇటుక, నేను స్వతహాగా పర్యవేక్షించి ఉపయోగించింది' అని ఒక సందర్భంలో గర్వంగా చెప్పుకున్నారు. ముస్లిం లీగ్ సుప్రీం నేతగా 1944లో గాంధీజీతో దేశ విభజన ప్రాథమిక చర్చలు, ఆ తర్వాత 1946లో నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులతో జరిగిన స్వాతంత్ర్య చర్చలు ఈ హవేలీలోనే జరిపారు జిన్నా. ప్రాణంతో సమానంగా చూసుకున్న సొంతింటిని వదిలి ఆగస్టు 1947లో కరాచీ వెళ్ళటానికి మనసొప్పలేదట పాపం జిన్నాకు. 'డియర్ జవహర్! ఇక నుండి జిన్నా హౌస్‌ను చూసుకునే బాధ్యత మీదే' అని నెహ్రూకు పాకిస్తాన్ నుండి రాసిన ఒక ఉత్తరంలో పేర్కొన్నారు. బాంబేతో తనకు ప్రత్యేక అనుబంధమనీ, తన సహచరులు చాలామంది ఇక్కడే ఉన్నారనీ, ప్రతి సంవత్సరం సెలవులకు వచ్చి ఇక్కడ కొన్ని రోజులు గడుపుతాననీ చెప్పి పాక్‌కు వెళ్లారు జిన్నా. కానీ విధి మరోలా నిర్ణయించింది. ఈ భవనం వదలి వెళ్ళాక 13 నెలలకే (11 సెప్టెంబర్ 1948న) క్షయ వ్యాధితో ఆయన మరణించారు.



జిన్నా హౌస్

తర్వాత కొన్నేళ్లు నెహ్రూ పర్యవేక్షణలో బ్రిటిష్ హైకమిషనర్ ఇందులో నివసించారు. ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్ –1968 దరిమిలా ప్రస్తుతం జిన్నా హౌస్ భారత ప్రభుత్వ అధీనంలో ఉంది. 'కాయద్–ఎ–ఆజమ్' (గొప్ప నాయకుడు) స్మృతి దృష్ట్యా ఈ భవనాన్ని పాకిస్తాన్ కాన్సులేట్ కార్యాలయానికి (అద్దెకు) ఇవ్వాలని పాక్ పాలకులు అడపా దడపా కోరుతూ ఉంటారు.

– జిల్లా గోవర్ధన్, విశ్రాంత పీఎఫ్ అధికారి, ముంబై । 98190 96949


(భాజపా నేత జస్వంత్ సింగ్ రాసిన 'జిన్నా: ఇండియా, పార్టిషన్, ఇండిపెండెన్స్' ఆధారంగా)

మన అజ్ఞాత ఇంజినీర్లు

భారతదేశ అభివృద్ధి చేతివృత్తుల మీద జరిగింది. గౌండ్ల, కంసాలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి వంటి నైపుణ్యాలున్న కులాలు దేశమంతటా ఎన్నో ఉన్నాయి. పౌర సమాజంలో వీరి జనాభానే అధికం. ఈ చేతివృత్తుల కులాలే అనేక రంగాల్లో అద్భుతమైన ఇంజినీరింగ్ పరిజ్ఞానాన్ని సృష్టించాయి. ఉత్పత్తి సంస్కృతికి వీరు ప్రతినిధులు. ఆర్యులు, ముస్లింలు, బ్రిటిష్ వలసవాదులు గనక భారతదేశం మీదకు దండెత్తి వచ్చి ఉండకపోతే, ఈ భారతీయ ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఒక ప్రత్యేక తాత్విక దృక్పథాన్ని సంతరించుకొని ఉండేవి. అయితే ఈ కులాలను ముస్లిం, బ్రిటిష్ దురాక్రమణదారుల కంటే బ్రాహ్మణ హిందూమతమే ఎక్కువగా దెబ్బతీసింది. వీరి నైపుణ్యాలకు ఆధ్యాత్మిక హోదా కల్పించలేదు. వీరిని సమాజంలో తక్కువ స్థాయిలోనే ఉంచింది. అయినా వాళ్ల సమాజ అభివృద్ధిలో నిరంతరం పాలుపంచుకుంటూనే వచ్చారు.

కల్లుగీత కార్మికులు వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలువబడుతున్నారు. వీళ్ళు మనుషులు తాగడానికీ, తద్వారా తమ ఆరోగ్యాన్ని సమతూలంగా ఉంచుకోవడానికీ పనికొచ్చే పానీయాన్ని అందించే చెట్లను కనుగొన్నారు. కనుగొనడమే కాదు, దానికి తగిన పనిముట్లను సిద్ధం చేశారు. ఇందులో వీరి గొప్ప ప్రతిభ దాగివుంది. అందుకే కల్లుగీత కోసం రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం మనిషికీ, ప్రకృతికీ మధ్య ఒక సజీవమైన అనుబంధంగా మారింది.

భారతదేశంలో అత్యంత గొప్ప ఇంజినీరింగ్ నైపుణ్యాలు మరో మూడు కులాల్లో కనిపిస్తాయి. అవి కమ్మరి (ఇనుముతో పనిముట్లు తయారు చేసేవాళ్లు), వడ్రంగి (కలపతో వివిధ పనులు చేసేవాళ్ళు), కంసాలి (బంగారం, వెండితో ఆభరణాలు చేసేవాళ్లు). కమ్మరి వృత్తి ఆర్యుల కాలం కంటే ముందు నుంచే ఉన్నట్టు కనపడుతుంది. వారి పనిముట్లు చరిత్రకు ఆనవాళ్లు పట్టిస్తాయి. ఈ వృత్తికి సంబంధించిన పరిజ్ఞానం ఇప్పటికీ మన గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగం. కమ్మరి పని వ్యవసాయ ప్రక్రియలో అనేక విధాలుగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. భారత దేశపు సామాజిక శక్తులు ఇనుము ఉపయోగాలను ఎలా కనుక్కొని ఉంటాయన్నది ఒక చారిత్రక అంశం. కమ్మరి కొలిమి ఇనుము సంబంధ పనుల్లో కీలకం. ఆ ప్రదేశం రెండు పైపు



లైన్లను తోలు తిత్తితో అనుసంధానించి ఉంటుంది. అది కొలిమిలోకి క్రమబద్ధంగా గాలిని సరఫరా చేస్తుంది. ఈ తిత్తి ఆవిష్కరణ ఒక అద్భుతం.

వడ్రంగి పనికి గొప్ప వృత్తి నైపుణ్యం అవసరం. వీరు సృష్టించిన అత్యంత విప్లవాత్మక సాధనం నాగలి. అలాగే వడ్రంగులు మానవ సమాజానికి అందించిన మరొక సేవ, ఇళ్ల నిర్మాణం. సమాజ ప్రధాన అవసరాలలో ఒకటైన ఇంటికి వాడే కర్రపనిలో వడ్రంగుల నైపుణ్యం మామూలుది కాదు. ఈనాటి ఇళ్ల నమూనాల మూలాలన్నీ వడ్రంగుల నైపుణ్యంలో దాగివున్నాయి.

ప్రపంచంలో తొలినాళ్ల కుండల తయారీ జ్ఞాన వ్యవస్థల్లో కొన్నింటికి భారతదేశం పుట్టినిల్లు అని చెప్పవచ్చు. సింధు నాగరికత నాటికి మన దేశంలో కుండల తయారీ ఎంతో ఉచ్చస్థితిలో ఉంది. కుండల తయారీని ఎలా అభివృద్ధి పరిచారు అన్నది ఒక ఆశ్చర్యం. భారతీయ గ్రామాల్లో కుండల తయారీలో అధునాతన పరిజ్ఞానం కలిగిన కులాలు ఉన్నాయి. వారిని తెలుగునాట కుమ్మరోళ్లని పిలుస్తారు. అసలు సింధు నాగరికత ఈ కుండలు తయారు చేసేవారి భుజస్కందాలపై ఆధారపడే ఏర్పడినట్టు అనిపిస్తుంది. కుండల తయారీ పరిజ్ఞానం తొలుత మట్టికీ, చక్రానికీ మధ్య నుండే సంబంధాన్ని అర్థం చేసుకోవడంతో మొదలవుతుంది. ముడి కుండను మలిచేందుకు ముందు చక్రం తిప్పుతారు. మెత్తని బంక మట్టిని కుండగా మార్చవచ్చనీ, ఆ కుండలను వంటలకూ, నీళ్లు, ఇతర ద్రవ పదార్థాల నిల్వ ఉపయోగించవచ్చనీ వాళ్లకు ఎవరు చెప్పి ఉంటారు? మానవ జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు భూవనరులతో నిరంతరం పోరాడేవాళ్ళే బంకమట్టి నుంచి రకరకాల కుండలు తయారు చేయ వచ్చని కనుగొని ఉంటారు. వేగంగా తిరిగే చక్రం మీద ఉంచిన బంకమట్టిని చేతివేళ్ల కొనలతో నొక్కుతూ ఒక ఆకారంలోకి తెస్తారు. ఈ దశలో కుమ్మరి చేతివేళ్ళు, గోళ్ళు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవాళ గృహాల అంతర్గత అలంకరణకు వినియోగించేలా అనేక ఆకృతులను కూడా అద్భుతంగా తయారు చేస్తున్నారు.

ఇలా దేశంలోని ఎన్నో కులాలు భారతదేశ ఉత్పత్తి సంస్కృతికి ప్రాతినిధ్యం వహించాయి. దేశ నాగరకతను ముందుండి నడిపించాయి.

– కిరణ్ ఫిషర్
అడ్వకేట్ । 79893 81219

సిరి తలకెక్కితే పతనమే!

ఏ వ్యక్తినైనా విడిచి వెళ్ళేముందు సిరి ఆ వ్యక్తి తలకెక్కుతుందని ఎప్పటి నుంచో ప్రజలలో నమ్మకంగా స్థిరపడివున్నమాట! 'మేనంబురుషుని సప్త స్థానంబులు గడిచి, తలకు జని సిరి విడుచున్నాని' అని మార్కండేయ పురాణం, ద్వితీయాశ్వాసంలోని 236వ పద్యంలో పై విషయాన్నే మారన కవి చెప్పాడు.

ఒక సందర్భంలో అసురులకూ, అమరులకూ యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో అమరులు పరాజయం పాలై భంగ పడి బాధలో ఉండగా, దేవ గురువైన బృహస్పతి, వెంటనే వెళ్ళి దత్తాత్రేయుడిని వేడుకొండని వారికి సలహా ఇస్తాడు. దత్తాత్రేయుడు విష్ణుమూర్తి అంశమున పుట్టినవాడు గనుక, బృహస్పతి చెప్పినట్లుగానే దేవతలు వెళ్ళి జరిగినదంతా ఆయనకు విన్నవించుకొని ఆపద నుండి గట్టెక్కించమని ప్రాథేయపడతారు. అంతా విన్న దత్తాత్రేయుడు ఆలోచించి, మళ్ళీ వెళ్ళి అసురులను యుద్ధానికి ఆహ్వానించి తన ముందుకు తీసుకురమ్మని చెబుతాడు. దేవతలు అలాగే చేస్తారు. అమరులను తరుముతూ వచ్చిన అసురులు దత్తాత్రేయుడి ముందుకు రాగానే ఆయన పక్కనే కూర్చొని ఉండి, వెలుగులు చిమ్ముతున్న లక్ష్మీదేవి అందాన్ని చూసి, వచ్చిన సంగతి మరిచిపోయి, మోహంలో చిక్కుకుని, ఎలాగైనా సరే లక్ష్మీదేవిని దక్కించుకుని, తమతో తీసుకెళ్ళిపోవాలనే ఆలోచనలో పడతారు. వారి ఆలోచనను గ్రహించిన దత్తాత్రేయుడు ఏమీ అడ్డు చెప్పకుండా, అలాగే కానిండని చూస్తూ ఊరకుంటాడు. దానవులు లక్ష్మీదేవిని పట్టి శిబిక, అనగా పల్లకీలో కూర్చోబెట్టి, 'శిరంబుల మోచికొని' పోతుంటారు. అది చూసిన దత్తాత్రేయుడు నవ్వుతూ, 'సిరి దానవుల తలలకు ఎక్కి కూర్చుంది. అంటే వారి ప్రాభవం తగ్గడం మొదలైనట్లే, వారి పతనం ప్రారంభమైనట్లే. ఇక ఇప్పుడు వెళ్ళి వారితో యుద్ధం చేయండి. మీరే గెలుస్తారు. మీరు పోగొట్టుకున్నదంతా మీకు తిరిగి దక్కుతుంది' అంటాడు. అదే నిజమై, అప్పుడు జరిగిన సమరంలో అమరుల ధాటికి అసురులు తట్టుకోలేక ఓడిపోయి పారిపోతారు. సిరి తలకెక్కితే మనిషి ఆలోచన మారిపోయి ఉచ్చనీచాలను మరిచిపోతాడనీ, అలా మరిచిపోయి తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటాడనీ మార్కండేయ పురాణంలోని ఈ ఉదంతం మనకు చెబుతుంది.

జ్యోతిర్మయం

– భట్టు వెంకట రావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.పాడ్యమి తె.5.30 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి విదియ, **నక్షత్రం:** ఆరుద్ర రా.11.04 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.6.54 నుండి 8.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.27 వరకు, **అమృత ఘడియలు:** ప.12.48 నుండి 2.27 వరకు. ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.32, **సూర్యాస్తమయం:** 5.28.

క్లుప్తంగా...

వెన్నముద్ద కృష్ణుడిగా శ్రీనృసింహుడు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో అధ్యయనోత్సవాలు నాలుగోరోజు మంగళవారం కొనసాగాయి. స్వామి వారిని ఉదయం వెన్నముద్ద కృష్ణుడిగా.. రాత్రి కాళీయమర్దనుడిగా అలంకరించి ఆలయ తిరు, మాడవీధుల్లో ఊరేగించారు. స్వామివారి సేవకు ముందు పారాయణం పఠించారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు, ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచుల పదవీ కాలం పొడిగించాలి

తెలంగాణ సర్పంచుల సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గ్రామీణాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న సర్పంచుల పదవీ కాలాన్ని రెండేళ్లు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేసింది. ప్రజల రక్షణలో నిమగ్నమైన ప్రస్తుత సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించి.. పాలకవర్గాలను సైతం కొనసాగించాలని విన్నవించింది. 2019 ఫిబ్రవరి 2న ప్రమాణస్వీకారం (2024 ఫిబ్రవరి 1న పదవీ కాలం ముగియనుంది) చేసిన ప్రస్తుత సర్పంచులు 8 నెలల వరకు చెక్‌పవర్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించింది. ఆ తర్వాత సర్పంచుల చెక్ పవర్‌ను ఉపసర్పంచులకు ముడిపెట్టడంతో నిరాశా, నిస్పృహలకు లోనవడాన్ని గమనించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. వివిధ పనుల కోసం సొంత నిధులు ఖర్చు చేసినా.. బిల్లులు మంజూరవక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులందక సర్పంచులు నిస్సహాయులుగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు సర్పంచులు లేకుంటే పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని భావించి ఉమ్మడి ఏపీలో మూడు పర్యాయాలు పదవీ కాలాన్ని పొడిగించారని గుర్తు చేశారు.

నేడు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు

- 39,748 మంది కార్మికులకు ఓటు హక్కు
- టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీల మధ్య పోటీ
- గెలిచే సంఘం కాలపరిమితిపై సందిగ్ధత



సాక్షిప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ రాష్ట్రానికి కొంగుబంగారంగా నిలిచిన సింగరేణి సంస్థ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. నిధులు, నియామకాల్లో నంబర్‌వన్‌గా నిలిచిన సింగరేణి సంస్థ ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకమే. ఈసారి ఎన్నికల్లో 39,748 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 11 ఏరియాల్లో ఈ ఎన్నికలను నిర్వహించేందుకు కార్మికశాఖ ఏర్పాట్లుచేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి సంస్థలో తరచూ సమ్మెలు జరగడం, ఉత్పత్తికి తీవ్రవిఘాతం కలగడం సర్వసాధారణంగా మారింది. దీంతో సంస్థకు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. 1998లో వాస్తవ పరిస్థితులు సమీక్షించిన అప్పటి ముఖ్యమంత్రి సమ్మెల నివారణ లక్ష్యంగా గుర్తింపు సంఘం ఎన్నికలకు శ్రీకారం చుట్టారు. ఇలా మొదలైన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు మొదటి రెండుసార్లు రెండేళ్ల కాలపరిమితితో సాగాయి. ఆ తర్వాత మూడు దఫాలు సింగరేణి యాజమాన్యంతో జరిగిన ఒప్పందం నేపథ్యంలో నాలుగేళ్ల కాలపరిమితితో నిర్వహించారు. అయితే 2017లో కేంద్ర కార్మిక శాఖ రెండేళ్ల కాలపరిమితి అని తేల్చింది. ఎన్నికలకు ముందు నాలుగేళ్లు అని చెప్పి తాము గెలిచాక రెండేళ్లు అంటున్నారని పేర్కొంటూ గుర్తింపు సంఘం హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ క్రమంలో 2021 వరకు ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత కరోనా వైరస్ విజృంభించడంతో మరో రెండేళ్ల పాటు జాప్యం జరిగింది. చివరకు ఏఐటీయూసీ హైకోర్టులో కేసు వేయడంతో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల విషయంలో చలనం వచ్చింది. అయితే ఎన్నికల సన్నాహాలు ఇతర కారణాలతో వాయిదా వేయాలని రాష్ట్ర ఇంధన కార్యదర్శి కోర్టులో పిటిషన్ వేశారు. కానీ ఎన్నికలు జరపాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. రిటర్నింగ్ అధికారి రెండేళ్ల కాలపరిమితితో నోటిఫికేషన్ జారీ చేసినా, ఎన్నికల తర్వాత గెలిచిన సంఘం నాలుగేళ్ల కాలపరిమితి ఒప్పందాన్ని తెరపైకి తెచ్చే అవకాశం ఉండటంతో..గుర్తింపు సంఘం రెండేళ్లే ఉంటుందా? నాలుగేళ్ల వరకు కొనసాగుతుందా? అని సింగరేణి వర్గాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి.

ఎప్పుడు ఎలా?		
1998	ఏఐటీయూసీ	రెండేళ్లు
2001	ఏఐటీయూసీ	రెండేళ్లు
2003	ఐఎన్‌టీయూసీ	నాలుగేళ్లు
2007	ఏఐటీయూసీ	నాలుగేళ్లు
2012	టీబీజీకేఎస్	నాలుగేళ్లు
2017	టీబీజీకేఎస్	నాలుగేళ్లు

2012 నుంచి ప్రతిష్టాత్మకంగా..

సింగరేణి ఎన్నికలు 2012 నుంచి అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మంగా మారాయి. సంస్థ విస్తరించిన 11 ఏరియాల్లో 11 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో కీలకంగా మారాయి. అప్పటి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక పరిశీలకులను నియమించారు. ఈ క్రమంలో రెండుసార్లు గుర్తింపు యూనియన్‌గా బీఆర్ఎస్ పార్టీ అనుబంధ టీబీజీకేఎస్ (తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం) గెలిచింది. తాజా ఎన్నికలు టీబీజీకేఎస్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ మధ్య జరుగుతున్నాయి.

ఉద్యోగాలు.. బదిలీలు

- ప్రజావాణిలో అవే ఎక్కువ సమస్యలు
- మంగళవారం రోజున 2,717 దరఖాస్తులు



లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో నిర్వహిస్తోన్న ప్రజావాణికి అర్జీల వరద కొనసాగుతోంది. మంగళవారం 2,717 దరఖాస్తులు అందగా, వాటిని కంప్యూటరైజ్డ్ చేసి దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందేలా రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ (ఐటీఈ అండ్ సీ) విభాగానికి ప్రభుత్వం బాధ్యతలప్పగించింది. దరఖాస్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. మంగళవారం ఉపాధ్యాయుల దంపతుల బదిలీపై స్పౌజ్ ఫోరం ప్రతినిధులు భారీగా ప్రజావాణికి తరలివచ్చారు. స్పౌజ్ ఫోరం ప్రతినిధులు వివేక్, నరేశ్, అర్చన, సురేశ్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలోని అశాస్త్రీయ విధానాలవల్ల భర్త ఒకచోట, భార్య మరోచోట ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో వెంటనే బదిలీలు చేపట్టాలని కోరారు. మహిళా సమాంతర రిజర్వేషన్ సమస్యను త్వరితగతిన పరిష్కరించి ఏఈఈ గ్రూప్–4 ఫలితాలను విడుదల చేయాలని పలువురు నిరుద్యోగులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. నిరుద్యోగ ప్రతినిధులు నాగులు సాయికిరణ్, పవన్, శరత్ మీడియాతో మాట్లాడుతూ.. హారిజాంటల్ రిజర్వేషన్ విషయంలో అనవసరమైన కాలయాపన చేయకుండా మెమో నెం.7593ను ప్రకారం డాక్యుమెంట్ వెరిఫికేషన్ జాబితాను పదిహేను రోజుల్లో విడుదల చేయాలని కోరారు.

నా భర్త ఉద్యోగం ఇవ్వండి

విధి నిర్వహణలో గాయపడి చికిత్స పొందుతూ చనిపోయిన జెన్‌కో ఉద్యోగి సదానందన్ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ మృతుని భార్య వందన సదానందన్ తన ముగ్గురు పిల్లలతో కలిసి వచ్చి ప్రజావాణిలో వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి సాయం అందలేదనీ, ఇప్పటికైనా భర్త ఉద్యోగం తనకు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మానవ తప్పిదాలతో సింగరేణికి నష్టాలు

ఎమ్మెల్యే కూనంనేని

సాక్షి, హైదరాబాద్: మానవ తప్పిదాలతో సింగరేణి సంస్థ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయిందని సింగరేణి వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మరో 15, 20 ఏళ్లలో సింగరేణి కాలరీస్ మూతపడే దుస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఎస్.బాలమల్లేశ్, ఈటీ నర్సింహతో కలిసి మంగళవారం మఖ్దూంభవన్‌లో కూనంనేని మాట్లాడారు. బుధవారం జరగనున్న సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు ఓటేసి గెలిపించాలని సింగరేణి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు 1.19 లక్షల మంది కార్మికులున్న సింగరేణిలో.. ఆ సంఖ్య ప్రస్తుతం 39వేలకు చేరిందని వివరించారు. సింగరేణి ప్రస్తుత సీఎండీ తొమ్మిదిన్నరేళ్లుగా కొనసాగుతున్నారని, సింగరేణి డబ్బులను రాష్ట్ర ప్రభుత్వానికి మళ్లించారని విమర్శించారు. గుర్తింపు సంఘం సైతం యాజమాన్యంతో కుమ్మక్కైందని ఆరోపించారు.

బొగ్గు తవ్వకాల్లో నిబంధనల ఉల్లంఘన

ఎస్‌సీసీఎల్ సహా ఇతర అధికారులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుమతులను, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను ఉల్లంఘించి బొగ్గు తవ్వకాలు చేపడుతున్నారన్న వాదనలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మైన్స్ సేఫ్టీ డైరెక్టరేట్ జనరల్, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, మంచిర్యాల జిల్లా కలెక్టర్‌సహా పలువురికి నోటీసులు జారీచేసి తదుపరి విచారణను వాయిదా వేసింది. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను ఉల్లంఘించి శ్రీరాంపూర్‌లో ఎస్‌సీసీఎల్ బొగ్గు తవ్వకాలు చేపడుతోందని.. అధికారులు చర్యలు తీసుకోవడంలేదని మంచిర్యాల జిల్లా కుచెందిన నామాల సత్యవతితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టి స్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ వాదనపై వివరణ ఇవ్వాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

సింగరేణి ఎన్నికల్లో ఎందుకీ అనర్హత?

అధికారులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి తెలంగాణ రీజియన్ సింగరేణి కార్మిక సంఘం ఎందుకు అనర్హమైనదో చెప్పాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసి తదుపరి విచారణను వాయిదా వేసింది. మూడు నెలల్లో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని 2019లో హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన అధికారులు తెలంగాణ రీజియన్ సింగరేణి కార్మిక సంఘం నమోదై సంవత్సరం కూడా కాలేదంటూ నిబంధనల మేరకు పోటీనుంచి తిరస్కరించారు. అయితే ఎన్నికలు వాయిదా పడ్డాయి. తాజాగా డిసెంబర్ 27న నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ మాత్రం 2020, జనవరిలోనే ప్రారంభం కావడంతో అనర్హత అలాగే కొనసాగుతూ వస్తోంది. ఇప్పటికి మూడేళ్లు గడిచిందని, ఈ ఎన్నికల్లో పాల్గొనేలా తమ సంఘానికి అవకాశం ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రీజియన్ సింగరేణి కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2023 వరకు ఓటర్లను పరిగణనలోకి తీసుకున్నప్పుడు.. సంఘానికి నిబంధనలను 2020 వరకే తీసుకోవడం సరికాదని వాదించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

ఐదు గంటల్లో పట్టేశారు..

- చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం
- తల్లిదండ్రులకు అప్పగింత..
- సంతానం కలగలేదని అపహరణ
- తల్లీ, కూతురు అరెస్ట్




చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసు అధికారులు

చాంద్రాయణగుట్ట: కిడ్నాప్‌నకు గురైన చిన్నారి(1.6) ఆచూకీని బహదూర్‌పురా పోలీసులు ఐదు గంటల్లోనే గుర్తించి బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పురానీహవేలీలోని కార్యాలయంలో మంగళవారం దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య వివరాలు వెల్లడించారు. బహదూర్‌పురా కిషన్‌బాగ్‌కు చెందిన నసీం బేగంకు నలుగురు సంతానం. ఫలక్‌నుమాలో నివాసం ఉంటున్న ఆమె పెద్ద కుమార్తె ఆయేషా బేగంకు వివాహం జరిగి పదేళ్లయినా సంతానం కలగలేదు. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఓ చిన్నారిని కిడ్నాప్ చేసి పెంచుకోవాలని భావించారు. ఈ నెల 25న గోల్కొండకు చెందిన దంపతులు తమ కుమార్తె (1.5)తో కలిసి బహదూర్‌పురాలోని బంధువుల ఇంటికి వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం కుటుంబ సభ్యులందరూ కిషన్‌బాగ్ పార్కుకు వచ్చారు. పెద్దలు టికెట్లు తీసుకుంటుండగా....చిన్నారి ఆడుకుంటూ పక్కకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన నసీం బేగం బాలికను కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లి కుమార్తెకు అప్పగించింది. చిన్నారి కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన బాధిత కుటుంబ సభ్యులు బహదూర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. స్థానికుల సహకారం, 100 సీసీ కెమెరాల ఆధారంగా బాలిక ఆచూకీని గుర్తించిన పోలీసులు నేరుగా నసీంబేగం ఇంటికి వెళ్లి పాపను తమ అదీనంలోకి తీసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. ఫలక్‌నుమా ఏసీపీ సుధాకర్ పర్యవేక్షణలో డీఐ శ్రీశైలం సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో బాలిక కిడ్నాప్ కథ సుఖాంతమైంది. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కరువులు. కల్లోలాలు. కొట్లాటలు. కన్నీళ్లు...

క్లుప్తంగా చెప్పకుంటే ప్రపంచానికి 2023 ప్రధానంగా మిగిల్చిన గుర్తులివే! 2022లో ఉక్రెయిన్‌పై రష్యా మొదలు పెట్టిన ఆక్రమణ 2023 పొడవునా పడుతూ లేస్తూ కొనసాగింది. ఇది చాలదన్నట్టు ఏడాది చివర్లో ఇజ్రాయెల్ దండయాత్ర పాలస్తీనాలో కనీవినీ ఎరగని మానవీయ సంక్షోభానికి కారణమైంది. లక్షలాది మంది ఆకలి కేకలు ఐరాస సామర్థ్యంపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తాయి. అంతర్జాతీయ సమాజంలో మానవీయ స్పందన కరువైన తీరును కళ్లకు కట్టాయి. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు అటు కరువు, ఇటు వరదలతో అతలాకుతలమయ్యాయి. భూతాపోన్నతి ఒకానొక దశలో 2 డిగ్రీల లక్ష్మణరేఖను దాటేసి ప్రపంచానికి పొంచి ఉన్న ముప్పును మరోసారి గుర్తు చేసింది. ఏదో ఒక రూపంలో అడపాదడపా తలెత్తుతున్న కరోనా ఏడాది ముగుస్తుండగా కొత్త వేరియంట్ రూపంలో మరోసారి గుబులు పుట్టిస్తోంది. చంద్రయాన్, జీ20 సదస్సు నిర్వహణ వంటివి భారత కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ వేదికపై మరింతగా చాటాయి. 2023 త్వరలో కాలగర్భంలో కలిసిపోనున్న నేపథ్యంలో ఈ ఏడాది భారత్‌లోనూ, అంతర్జాతీయంగానూ జరిగిన ప్రధాన సంఘటనలపై విహంగ వీక్షణం.

- సాక్షి, నేషనల్ డెస్క్



A ఆర్టికల్ 370



జమ్మూ కశ్మీర్‌కు పలు విషయాల్లో ప్రత్యేక హోదా కల్పించిన ఈ వివాదాస్పద ఆర్టికల్‌ను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు పూర్తిగా సమర్థించింది. ఏ రాష్ట్రానికీ విడిగా అంతర్గత ప్రజాస్వామ్యం అంటూ ఉండబోదని కుండబద్దలు కొట్టింది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం డిసెంబర్ 11న ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. దాంతో కశ్మీర్‌కు ప్రత్యేక పతాకం, రాజ్యాంగం, అంతర్గత వ్యవహారాల్లో పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 శాశ్వతంగా కాలగర్భంలో కలిసిపోయింది.

B బైడెన్



అమెరికా చరిత్రలో అత్యంత వృద్ధ అధ్యక్షుడైన 81 ఏళ్ల బైడెన్.. 2024లో అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ నెగ్గి తన రికార్డును తానే మెరుగుపరచాలని ప్రయత్నిస్తున్నారు. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు సాయుధ, ఆర్థిక మద్దతు కొనసాగింపుపై విమర్శలతో పాటు పాలస్తీనాలో మానవీయ సంక్షోభం ముదురుతున్నా యుద్ధం ఆపేలా ఇజ్రాయెల్‌ను ఒప్పించలేకపోతున్నారంటూ ఈ ఏడాది మరో అప్రతిష్ట కూడా మూటగట్టుకున్నారాయన. రిపబ్లికన్ పార్టీ తరఫున మరోసారి అధ్యక్ష బరిలో దిగేలా ఉన్న డొనాల్డ్ ట్రంప్ నుంచి బైడెన్‌కు గట్టి పోటీ తప్పకపోవచ్చంటున్నారు. కోర్టు కేసులు 77 ఏళ్ల ట్రంప్ ఆశలపై నీళ్లు చల్లని పక్షంలో 2020లో మాదిరే ఈసారి కూడా అధ్యక్ష పీఠం కోసం వీరిద్దరే పోటీ పడేలా ఉన్నారు.

C చంద్రయాన్-3



అంతరిక్ష రంగంలో భారత కీర్తి పతాకను సమున్నతంగా ఎగరేసిన కీలక ప్రయోగం. 2023 జూలై 14న శ్రీహరికోట నుంచి ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగం దిగ్విజయం సాధించింది. ఆగస్టు 5న చంద్రుని కక్ష్యలోకి ప్రవేశించిన వ్యోమ నౌక 23న చంద్రుని దక్షిణ ధ్రువ సమీపంలో సురక్షితంగా దిగింది. ఈ విజయానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రధాని మోదీ ప్రకటించారు

D డొనాల్డ్ ట్రంప్



బహుశా అమెరికా చరిత్రలోనే అత్యంత వివాదాస్పదుడైన నేత. ఆ దేశంలో నేరాభియోగాలు ఎదుర్కొన్న తొలి మాజీ అధ్యక్షునిగా రికార్డు సృష్టించారు. నీలి చిత్రాల తారతో అఫైర్‌ను కప్పిపుచ్చేందుకు డబ్బుల చెల్లింపు వ్యవహారంలో గత ఏప్రిల్లో కోర్టు మెట్లెక్కిన సందర్భంగా సాంకేతికంగా అరెస్టు కూడా అయ్యారు! ఇదీ రికార్డే. దీంతోపాటు 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ క్యాపిటల్ భవనంపై తన సమర్థకులను దాడికి ఉసిగొల్పిన కేసులో ట్రంప్‌ను కొలరాడో సుప్రీంకోర్టు తాజాగా దోషిగా తేల్చింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించింది! ఇలా అనర్హతకు గురైన తొలి మాజీ అధ్యక్షునిగా కూడా నిలిచారు. అయినా ఎన్నికల్లో పోటీకి సై అంటున్నారు!

E ఎలక్షన్స్



2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావించిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీకి మరింత ఊపునిస్తే విపక్ష కాంగ్రెస్‌ను తీవ్ర నిరాశకు లోను చేశాయి. ఈ ఏడాది చివర్లో జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పాలిత రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో బీజేపీ విజయబావుటా ఎగరేయడమే గాక మధ్యప్రదేశ్‌లోనూ ఘనవిజయం సాధించింది. ఎన్ని హామీలిచ్చినా రాజస్తాన్‌లో ఓటమి చవిచూడటమే గాక అధికారం నిలుపుకోవడం ఖాయమని భావించిన ఛత్తీస్‌గఢ్‌నూ కోల్పోవడంతో కాంగ్రెస్ తీవ్ర నైరాశ్యానికి లోనైంది. తెలంగాణలో సాధించిన అనూహ్య విజయం ఈ ఓటముల ముందు చిన్నబోయింది. ఈ నేపథ్యంలో విపక్ష ఇండియా కూటమి సారథిగా కాంగ్రెస్ ప్రాధాన్యం కూడా తగ్గుముఖం పట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో తమకే ఎక్కువ సీట్లు కేటాయించాలంటూ భాగస్వాముల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి!

F ఫారిన్ అఫైర్స్



విదేశీ వ్యవహారాల్లో 2023 భారత్‌కు మిశ్రమ ఫలితాలిచ్చింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాదిరిగానే గాజాపై ఇజ్రాయెల్ దాడి విషయంలో కూడా ఏ పక్షం వైపూ పూర్తిగా మొగ్గకుండా ఎప్పట్లాగే కేంద్రం ఆచితూచి స్పందిస్తూ వస్తోంది. అంతేగాక జీ20 సదస్సు నిర్వహణ వంటి పలు అంతర్జాతీయ విజయాలు మన ఖాతాలో పడ్డాయి. అయితే కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఉందన్న ఆ దేశ ప్రధాని ఆరోపణలు ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఒకరకంగా ఇరు దేశాల మధ్య నెలల తరబడి 'దౌత్య యుద్ధమే' జరిగింది. ఈ విషయంలో అమెరికా కూడా కెనడాకే దన్నుగా నిలవడం మనకు ఇబ్బందికరంగా మారింది.

G జి 20



ప్రతిష్టాత్మక జీ20 శిఖరాగ్ర సదస్సుకు భారత్ తొలిసారి ఆతిథ్యమిచ్చింది. సెప్టెంబర్లో ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచంలోని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తదితర ప్రముఖ దేశాల అధినేతలు తరలివచ్చారు. ప్రధాని మోదీ ప్రతిపాదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మూడు రోజుల శిఖరాగ్రం ఘనవిజయం సాధించి అంతర్జాతీయ వేదికపై భారత కీర్తి ప్రతిష్టలను మరింతగా పెంచింది.

H హెచ్1బీ రెన్యువల్స్



వేలాది భారతీయ టెకీలకు అమెరికాలో ఉద్యోగాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్న కీలకమైన హెచ్1బీ వీసాల విషయంలో అగ్ర రాజ్యం ఈ ఏడాది కీలక నిర్ణయం తీసుకుంది. వాటిని ఇకపై అమెరికాలోనే రెన్యువల్ చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. తొలి విడతగా 20 వేల దరఖాస్తుల ప్రాసెసింగ్ ప్రక్రియను మొదలుపెట్టింది కూడా. దాంతో రెన్యువల్స్‌కు భారత్‌కో, మరో దేశానికో వెళ్లాల్సిన అవస్థ తప్పనుంది.

I ఇమ్రాన్ ఖాన్



గతేడాది పాకిస్తాన్ ప్రధాని పదవి పోగొట్టుకుని, హత్యాయత్నం నుంచి తూటా గాయాలతో బయట పడ్డ ఇమ్రాన్ ఖాన్ ఈ ఏడాది ఏకంగా జైలుపాలయ్యారు! భూ వివాదం కేసులో తొలుత మే 9న హైకోర్టు ప్రాంగణంలోనే అరెస్టయ్యారు. తర్వాత విడుదలైనా తోషాఖానా కానుకల కేసులో ఆగస్టు 6న మళ్లీ అరెస్టయ్యారు. అప్పటినుంచీ జైల్లోనే మగ్గుతున్నారు. ఆయనపై 140కి పైగా కేసులు దాఖలయ్యాయి! ఫిబ్రవరిలో జరిగే సాధారణ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఇమ్రాన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా పాకిస్తాన్ ముస్లిం లీగ్ పావులు కదుపుతోంది. పాక్‌లో సర్వశక్తిమంతమైన సైన్యం కూడా అందుకు పూర్తిగా సాయపడుతున్నట్టు కన్పిస్తోంది.

J జిన్‌పింగ్



మావో అనంతరం చైనాలో అత్యంత శక్తిమంతుడైన నాయకునిగా అవతరించారు. 2023 మార్చిలో ఏకంగా వరుసగా మూడోసారి దేశ అధ్యక్షునిగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. చైనా చరిత్రలో ఈ ఘనత సాధించిన ఏకైక నాయకునిగా రికార్డులకెక్కారు. పార్టీలోని ప్రత్యర్థులను ఉక్కుపాదంతో అణచివేస్తూ ఎదురులేని నాయకునిగా మారారు. అయితే కరోనా కల్లోలాన్ని సమర్థంగా ఎదుర్కోలేకపోయారన్న అప్రతిష్టను మూటగట్టుకున్నారు. లాక్‌డౌన్‌ను భరించలేక జనం భారీగా తిరుగుబాటుకు దిగడంతో నిబంధనలను సడలించాల్సి రావడం జిన్‌పింగ్ ప్రతిష్టకు మచ్చగా మిగిలింది. రియల్టీ భారీ పతనం, ఆర్థిక ఒడిదుడుకులు ఆయనకు సవాలుగా మారాయి.

K కింగ్ చార్లెస్-3



బ్రిటన్ రాజుగా చార్లెస్-3 పట్టాభిషేకం జరుపుకున్నారు. మే 6న అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాధినేతలంతా హాజరయ్యారు. 73 ఏళ్ల చార్లెస్-3 2022 సెప్టెంబర్ 8న తన తల్లి క్వీన్ ఎలిజబెత్-2 మరణంతో గద్దెనెక్కారు. అత్యంత పెద్ద వయసులో ఆ బాధ్యతలు చేపట్టి రికార్డులకెక్కారు. 8 నెలల తర్వాత లాంఛనంగా పట్టాభిషిక్తుడయ్యారు.

L ఎల్‌జీబీటీక్యూఐ



స్వలింగ సంపర్కం ఈ ఏడాదీ తరచూ వార్తల్లో నిలిచింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అది పార్లమెంటు పరిధిలోని అంశమంటూ అక్టోబర్ 17న తీర్పు వెలువరించింది. అయితే స్వలింగ సంపర్కులకూ ఇతరుల మాదిరిగానే అన్ని హక్కులూ ఉంటాయని స్పష్టం చేసింది. వాటిని కాపాడాలని, వారిని ఎవరూ చిన్నచూపు చూడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని కేంద్రాన్ని, రాష్ట్రాలను ఆదేశించింది.

M మణిపూర్ కల్లోలం



ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ ఈ ఏడాది జాతుల హింసతో అట్టుడికింది. సంఖ్యాధికులైన మెయితీ తెగవారు తమను గిరిజనేతరులుగా గుర్తించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన కుకీలు మే 3న జరిపిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. కుకీ మహిళను దారుణంగా హింసించి నగ్నంగా ఊరేగించడమే గాక అత్యాచారానికి పాల్పడటంతో రాష్ట్రం భగ్గుమంది. అలా చెలరేగిన హింసాకాండ నేటికీ కొనసాగుతూనే ఉంది. వందలాది మంది మరణించగా కనీసం 40 వేల మందికి పైగా కుకీలు పొరుగు రాష్ట్రాలకు వలస బాట పట్టారు. కేంద్రం మెయితీల పట్ల పక్షపాతం చూపుతూ సమస్య పరిష్కారంపై మీనమేషాలు లెక్కిస్తోందంటూ విమర్శలపాలైంది.

N నార్త్ కొరియా



ఉత్తర కొరియా 2023 పొడవునా వరుస క్షిపణి పరీక్షలతో హోరెత్తిస్తూనే ఉంది. పొరుగు దేశం దక్షిణ కొరియానూ, అమెరికానూ హడలెత్తిస్తూనే ఉంది. మొత్తమ్మీద ఈ ఏడాది అది 36కు పైగా క్షిపణి పరీక్షలు జరిపింది. వీటిలో రెండు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షలు కూడా ఉన్నాయి! దాంతో ఉద్రిక్తతల తగ్గింపుకు ఇరు దేశాల మధ్య 2018లో కుదిరిన ఒప్పందాన్ని దక్షిణ కొరియా రద్దు చేసుకునే దాకా వెళ్లింది.

O అపోజిషన్



కాంగ్రెస్‌తో పాటు 28 విపక్షాలు ఒక్క వేదికపైకి రావడం 2023లో జరిగిన ముఖ్య రాజకీయ పరిణామం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమిని ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ చొరవతో ఈ కూటమి తెరపైకి వచ్చింది. జూలై 18న బెంగళూరులో జరిగిన రెండో భేటీలో కూటమికి ఇండియా పేరును ఖరారు చేశారు. కూటమి నాలుగుసార్లు సమావేశమై భావి కార్యాచరణపై చర్చించింది. ఎన్నికలు ముంచుకొస్తున్నందున జనవరి రెండో వారంలోగా సీట్ల సర్దుబాటును ఖరారు చేసుకునే పనిలో ఉంది.

P పాకిస్తాన్ దివాలా



2023లో పాకిస్తాన్ ఆర్థిక కష్టాలు మరింతగా పెరిగాయి. నిత్యావసరాలకు కూడా కటకటలాడే పరిస్థితి తలెత్తింది. బియ్యం, గోధుమ పిండి తదితరాల కోసం జనం కొట్టుకుంటున్న దృశ్యాలు పరిపాటిగా మారాయి. విదేశీ మారకద్రవ్య నిల్వలు అట్టడుగుకు చేరాయి. ఏడాది చివరికి వచ్చేసరికి పాస్‌పోర్టుల ముద్రణకు కావాల్సిన పేపర్ దిగుమతికి కూడా చెల్లింపులు చేయలేని పరిస్థితికి చేరింది. దాంతో ఒక దశలో పాస్‌పోర్టుల జారీయే నిలిచిపోయింది.

Q క్వేక్స్



ఈ ఏడాది భారీ భూకంపాలతో పలు దేశాలు అతలాకుతలమయ్యాయి. ఫిబ్రవరి 6న 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం తుర్కియే, సిరియాల్లో పెను విధ్వంసమే సృష్టించింది. 50 వేల మందికి పైగా దీనికి బలయ్యారు. వీరిలో 44 వేలకు పైగా మరణాలు తుర్కియేలోనే సంభవించాయి! అనంతరం సెప్టెంబర్ 8న మొరాకోలో వచ్చిన 6.8 తీవ్రతతో కూడిన భూకంపానికి 3,000 మందికి పైగా బలయ్యారు. డిసెంబర్ 19న వాయవ్య చైనాలో వచ్చిన భూకంపం 150 మందిని బలి తీసుకుంది. ఉత్తరాఖండ్‌లోని జోషీ మఠ్‌లో నేల కుంగుబాట పట్టిన వైనమూ కలకలం రేపింది. వందలాది ఇళ్లు నిలువునా పగుళ్లిచ్చాయి!

R ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్



ఈ ఏడాది తెలుగు సినిమా అంతర్జాతీయ వేదికపై దేశ గౌరవాన్ని రెట్టింపు చేసింది. ఆస్కార్ అవార్డు సాధించిన తొలి భారతీయ చిత్రంగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఆర్ఆర్ఆర్ చరిత్ర సృష్టించింది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నాటు నాటుకు ఉత్తమ పాట అవార్డు దక్కింది. మార్చిలో జరిగిన ఆస్కార్ వేడుకలో గీత రచయిత చంద్రబోస్, సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి అవార్డును అందుకున్నారు. 2009లో భారతీయ సినిమా 'స్లమ్ డాగ్ మిలియనీర్'లో ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచిన జై హో పాటకూ ఆస్కార్ వచ్చినా ఆ సినిమాను యూకే ప్రొడక్షన్స్ పతాకంపై హాలీవుడ్ దర్శకుడు డానీ బోయల్ రూపొందించారు.

S సస్పెన్షన్లు



2023 ముగింపుకు వచ్చిన వేళ విపక్ష ఎంపీల భారీ సస్పెన్షన్లు పార్లమెంటు శీతాకాల సమావేశాలను వేడెక్కించాయి. డిసెంబర్ 13న లోక్‌సభలో జరిగిన భద్రతా వైఫల్యంపై కేంద్రాన్ని నిలదీస్తూ విపక్ష ఎంపీలు ఉభయ సభలనూ రోజుల తరబడి హోరెత్తించారు. దాంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటి నుంచీ కలిపి వారం రోజుల వ్యవధిలో ఏకంగా 149 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారు. ఇంతమంది ఎంపీలను సస్పెండ్ చేయడం పార్లమెంటు చరిత్రలో ఇదే తొలిసారి. ఈ వరుస సస్పెన్షన్లు రాజకీయంగా దుమారం రేపాయి.

T టన్నెల్



మనిషి సంకల్పం ముందు మంచు శిఖరం తలొంచింది. ఉత్తరాఖండ్‌లో సిల్క్‌యారా సొరంగం కుప్పకూలి లోన చిక్కుబడ్డ 41 మంది కార్మికులు 16 రోజుల ఉత్కంఠ తర్వాత సురక్షితంగా బయట పడ్డారు. హైవే పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న ఈ సొరంగం నవంబర్ 12న పాక్షికంగా కూలిపోయింది. రెస్క్యూ ఆపరేషన్లో రోజుకో సమస్యలతో నిత్యం సస్పెన్సు నెలకొంటూ వచ్చింది. కీలకమైన చివరి అంకం సినిమా క్లైమాక్స్‌నే తలపించింది. యంత్ర బలం చేతులెత్తేసిన వేళ ర్యాట్ హోల్ కార్మికులు చివరి 12 మీటర్ల మేరకు శిథిలాలను జాగ్రత్తగా తవ్వేసి కార్మికులను బయటికి తీసుకొచ్చారు.

U యూసీసీ



ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) ఈ ఏడాది కూడా వార్తల్లో నిలిచింది. కులమత తదితర విభేదాలకు అతీతంగా దేశ ప్రజలందరికీ ఒకే రకమైన వ్యక్తిగత చట్టాలను వర్తింపజేసేందుకు ఉద్దేశించిన యూసీసీని అమలు చేసే దిశగా ఉత్తరాఖండ్ బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిపై ఏర్పాటైన దేశాయ్ కమిటీ నవంబర్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో కొత్త ఏడాదిలో యూసీసీ విషయమై దేశవ్యాప్తంగా ఆసక్తికర పరిణామాలు జరగవచ్చు.

V వెనెజులా



పొరుగున ఉన్న బుల్లి దేశమైన గయానాలోని ఎసిక్విబో ప్రాంతంలో అపార చమురు నిక్షేపాలపై వెనెజులా కన్నేయడం ఉద్రిక్తతలకు కారణమైంది. అవసరమైతే సైనిక చర్యకు దిగైనా దాన్ని దక్కించుకునే దిశగా పావులు కదుపుతుండటంతో దక్షిణ అమెరికాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

W వార్స్



2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా మొదలు పెట్టిన యుద్ధం ఈ ఏడాదంతా కొనసాగుతూనే ఉంది. హమాస్ మెరుపుదాడి కారణంగా అక్టోబర్లో పాలస్తీనాపై ఇజ్రాయెల్ తలపెట్టిన యుద్ధమూ భీకరంగా సాగుతూనే ఉంది. ఇలా 2023 యుద్ధ సంవత్సరంగా గుర్తుండిపోనుంది.

X ఎక్స్



ప్రముఖ సోషల్ సైట్ ట్విట్టర్‌ను సుదీర్ఘ కాలయాపన, వివాదాల తర్వాత 2022 చివర్లో సొంతం చేసుకున్న ఎలాన్ మస్క్, గత జూలైలో దాని పేరును ఎక్స్‌గా మార్చి మరో సంచలనం సృష్టించారు. బ్లూ టిక్ తీసేయడం మొదలుకుని ఆయన తీసుకున్న పలు నిర్ణయాలతో సంస్థ విలువ సగానికి సగం పడిపోయింది.

Y యెవగనీ ప్రిగోజిన్



రష్యా అధ్యక్షుడు పుతిన్ సన్నిహితుడు. వాగ్నర్ ప్రైవేట్ సైనిక మూక చీఫ్. పుతిన్‌తో విభేదాల నేపథ్యంలో ఆగస్టు 23న 'విమాన ప్రమాదం'లో ప్రిగోజిన్ మరణించాడు. రష్యాలో ఇలా అనుమానాస్పదంగా కాలగర్భంలో కలిసిపోయిన వారి జాబితాలో చేరిపోయాడు.

Z జియోనిజం



పశ్చిమాసియాలో ప్రత్యేక యూదు రాజ్య స్థాపనకు పుట్టుకొచ్చిన ఉద్యమం. గాజాపై ఇజ్రాయెల్ యుద్ధంతో ఇది మరోసారి తెరపైకి వచ్చింది. తాను జియోనిస్టునని అమెరికా అధ్యక్షుడు బైడెన్ తాజాగా ప్రకటించడంతో మరోసారి వార్తల్లో నిలిచింది.

భారత్, పాక్ చర్చలు జరపకుంటే

కశ్మీర్‌కూ గాజా గతే: ఫరూక్

శ్రీనగర్: దశాబ్దాలుగా ఎటూ తేలని కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్తాన్‌లు చర్చిస్తేనే పరిష్కారం లభిస్తుందని, లేదంటే కశ్మీర్‌కు సైతం గాజాకు పట్టిన గతే పడుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం శ్రీనగర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. '' ఇటీవల పూంఛ్‌లో అమాయక పౌరుల మరణాలపై వివరణ ఇవ్వకుండా ఇక్కడి సైన్యాధికారులను బదిలీచేసినంత మాత్రాన సమస్యకు పరిష్కారం దొరకదు. అమాయక కశ్మీరీలను సైన్యం చిత్రహింసలు పెట్టి చంపేసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిందే. చనిపోయిన ముగ్గురిలో ఒకతని సోదరుడు భారత సైన్యంలో 24 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. ఇన్నాళ్ల సేవకు ఆ సైనికుడికి దక్కిన ప్రతిఫలం ఇదేనా?. తాము శత్రువులమేమో అనేంతగా హిందూ, ముస్లింల మధ్య విద్వేషం పెంచారు. కశ్మీర్‌పై పాకిస్తాన్‌తో భారత్ చర్చలు జరిపి పరిష్కారం కనుగొనాలి. లేదంటే గాజాలో పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులను కశ్మీరీలు చవిచూడాల్సి రావొచ్చు'' అని ఫరూక్ విమర్శలు గుప్పించారు.

జేఎన్1 వేరియంట్ కేసులు పైపైకి

న్యూఢిల్లీ: కరోనా జేఎన్1 ఉప వేరియంట్ వైరస్ పాజిటివ్ కేసులు దేశంలో నెమ్మదిగా పెరుగుతున్నాయి. నిన్నటితో పోలిస్తే మరో ఆరు జేఎన్1 కేసులు వెలుగుచూడటంతో జేఎన్1 రకం కేసుల సంఖ్య 69కి పెరిగిందని కేంద్రం మంగళవారం వెల్లడించింది. అయితే జేఎన్1 పాజిటివ్‌గా తేలిన రోగుల్లో 92 శాతం మంది తమ తమ ఇళ్లలోనే ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని, భయపడాల్సిన పనిలేదని కేంద్రం స్పష్టం చేసింది.



నౌకాదళంలోకి ఐఎన్ఎస్ ఇంఫాల్

ముంబై: భారత నావికాదళ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠంచేస్తూ అత్యాధునిక స్టెల్త్ గైడెడ్ క్షిపణి విధ్వంసక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ ఇంఫాల్' మంగళవారం భారత నావికాదళంలో చేరింది. ముంబైలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఈ నౌకను ప్రారంభించారు. ముంబైలోని ప్రభుత్వరంగ మజగావ్ డాక్ లిమిటెడ్ దీన్ని తయారుచేసింది. ఈశాన్య రాష్ట్రాల్లోని ఒక నగరం పేరును యుద్ధనౌకకు పెట్టడం ఇదే తొలిసారి.

- 163 మీటర్ల పొడవైన నౌక బరువు ఏకంగా 7,400 టన్నులు. దీని తయారీకి వాడిన పరికరాల్లో 75 శాతం దేశీయంగా తయారైనవే.
- ఈ నౌకలో అత్యాధునిక సెన్సార్లు, నిఘా రాడార్లున్నాయి.
- అన్ని రకాల క్షిపణులు, యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ లాంచర్లు, టోర్పెడోలు, ఏఎస్‌డబ్ల్యూ హెలికాప్టర్లను దీనిపై మోహరించవచ్చు.

జనవరి ఒకటిన ఎక్స్‌పోశాట్ ప్రయోగం

బెంగళూరు: జంట కృష్ణబిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల రహస్యాలు కనుగొనే లక్ష్యంతో ఇస్రో మరో ప్రయోగానికి సిద్ధమైంది. అంతరిక్ష వెలుగులీనే ప్రాంతాల నుంచి ప్రసరించే ఎక్స్‌రే కిరణాల మూలాలు, ఆవిర్భావం గురించి తెల్సుకునేందుకు 'ఎక్స్‌పోశాట్'ను వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన ప్రయోగించాలని ఇస్రో నిర్ణయించింది. అమెరికా వారి నాసా తర్వాత ఇలా ఖగోళ అంశాలపై పరిశోధన కోసం వ్యోమనౌకను పంపుతున్న రెండో దేశంగా భారత్ పేరు రికార్డులకెక్కనుంది.

పాక్ ఎన్నికల్లో తొలిసారిగా హిందూ మహిళ



పెషావర్: ముస్లింల ఆధిపత్యముండే పాకిస్తాన్‌లో ఫిబ్రవరిలో జరగబోయే దేశ సార్వత్రిక ఎన్నికల సమరంలో తొలిసారిగా ఒక హిందూ మహిళ పోటీకి నిలబడింది. ఖైబర్ ఫఖ్తుంఖ్వా రాష్ట్రంలోని పీకే-25 పార్లమెంట్ స్థానం నుంచి సవీరా పర్కాశ్ అనే మహిళ పోటీచేస్తున్నారు. హిందువు అయిన సవీరా వృత్తి రీత్యా వైద్యురాలు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) తరఫున బునేర్ జిల్లాలో ఆమె నామినేషన్ దాఖలుచేశారు.

ప్రధాని మోదీ అరుదైన ఘనత


న్యూఢిల్లీ: అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా పలుమార్లు రికార్డు సృష్టించిన ప్రధాని మోదీ తాజాగా మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రపంచంలో అత్యంత ఎక్కువ మంది యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లను సాధించిన రాజకీయనేతగా మోదీ కొత్త రికార్డును లిఖించారు. ఆయన అధికారిక 'నరేంద్ర మోదీ' యూట్యూబ్ చానెల్‌ను 2 కోట్ల మంది సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు.



గోడ మీద పులి!

పిలిభిత్(యూపీ): అడవి దాటి జనావాసాల్లో చొరబడిన పులిని చూస్తే జనానికి వణుకు. వాళ్లెక్కడ కొట్టిచంపేస్తారేమోనన్న భయంతో పులి దాడి చేయడం వినేవుంటాం. కానీ మంగళవారం యూపీలో ఓ గ్రామంలో అడుగుపెట్టిన ఆడ పులి అవేం పట్టించుకోకుండా హాయిగా గోడపై నిద్రపోయింది. తండోపతండాలుగా వచ్చిన జనాన్ని చూసి హడలిపోలేదు సరికదా నిద్రపోతూ, ఆవలిస్తూ అందరికీ ఫొటోలు, వీడియోలు తీసుకునే సువర్ణావకాశం ఇచ్చింది. పిలిభిత్ జిల్లాలోని పులుల అభయారణ్యం సమీపంలోని అట్కొనా గ్రామంలో జరిగిందీ వింత ఘటన. అటవీ సిబ్బంది పులికి మత్తు మందిచ్చి పట్టుకెళ్లారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 27 । డిసెంబర్ । 2023



నాలుగేళ్లుగా పాడిగింపులే..

కరీంనగర్: జిల్లాలో 678 ఎస్ఎంసీలు ఉన్నా యి. వీటికి నాలుగేళ్లుగా ఎన్నికలు నిర్వహించక పోవడంతో పాఠశాల పరిపాలన గాడితప్పుతోం దని విద్యావంతులు వాపోతున్నారు. 8లో▸



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బారులుతీరారు. గుడి ప్రాం తం రద్దీగా మారడంతో ఇబ్బందులు పడ్డారు.

గరిష్ఠం/కనిష్ఠం
30.0/15.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. తీవ్ర చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు ముగ్గురు మంత్రుల రాక



కరీంనగర్: కరీంనగర్‌కు బుధవారం రాష్ట్ర మంత్రులు ముగ్గురు రానున్నారు. జిల్లా ఇన్‌చార్జి, ఇరిగేషన్, సీఏడీ పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శాసనసభ వ్యవహారాలు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజాపాలన కార్యక్రమం రివ్యూ మీటింగ్‌కు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమీక్ష సమావేశానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వివరించారు.

ఎల్‌పీసీ సమర్పించాల్సిందే..

- బల్దియా కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నగర పాలక సంస్థకు బదిలీపై వచ్చిన ఉద్యోగులు తప్పనిసరిగా లాస్ట్ పేమెంట్ సర్టిఫికెట్(ఎల్‌పీసీ) సమర్పించాల్సిందేనని కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. బల్దియాకు బదిలీపై వచ్చి, రెండేళ్లు గడుస్తున్నా ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీఈ లచ్చిరెడ్డిలు ఎల్‌పీసీ సమర్పించకుండా, వేతనాలు పొందకుండా ఉద్యోగాల్లో కొనసాగుతున్న వైనంపై ఈ నెల 23న 'రివర్స్ ఇంజినీరింగ్' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కమిషనర్ ఎల్‌పీసీ సమర్పించాల్సిందేనని స్పష్టం చేశారు. వీరిరువురితోపాటు బదిలీపై వచ్చిన ఉద్యోగులు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు.

30న జాతీయ లోక్ అదాలత్

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి, జడ్జి వెంకటేశ్



కరీంనగర్‌క్రైం: ఈ నెల 30న కరీంనగర్, హుజూరాబాద్ కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, జడ్జి వెంకటేశ్ తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు 2,021, సివిల్ కేసులు 350లను గుర్తించి, సంబంధిత కక్షిదారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. రాజీయే రాజమార్గంగా నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లలో రాజీ కుదుర్చుకుంటే ఇరువర్గాల వారికి స్నేహపూర్వక వాతావరణం ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యూ ఇయర్ ఈవెంట్స్‌కు అనుమతి తప్పనిసరి

- సీపీ అభిషేక్ మహంతి



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో న్యూ ఇయర్ సందర్భంగా నిర్వహించే ప్రైవేట్ ఈవెంట్స్, పార్టీలకు ముందస్తు అనుమతి తప్పనిసరని సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజాశాంతికి భంగం కలిగించినా చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాములోరి అక్షింతల శోభాయాత్ర




కరీంనగర్‌టౌన్: అయోధ్య రాములోరి అక్షింతలు, కలశాలతో మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. మేళతాళాల మధ్య కరీంనగర్‌లోని గీతామందిర్(అశోక్‌నగర్) నుంచి వారసంత, టవర్ సర్కిల్, గంజ్ వినాయకుడు, పాత బజార్ శివాలయం, మారుతీనగర్ చౌరస్తా, బొమ్మకల్ చౌరస్తా మీదుగా యజ్ఞవరాహ స్వామి క్షేత్రం వరకు తీసుకెళ్లారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు మురళీధర్, మహేశ్వర్, ప్రసాద్, శ్రీను, అవుదుర్తి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీధర్, విక్రమ్, సాగర్, అనిల్, దర్శనాల కృష్ణ, సతీశ్ పాల్గొన్నారు.

మళ్లీ డిసెంబర్ ముప్పు!

- ఫస్ట్, సెకండ్, థర్డ్ వేవ్‌ల కరోనా గతంలో ఇదే నెలలో విజృంభణ
- తాజాగా జిల్లాలో రెండు పాజిటివ్ కేసులు
- ఆందోళనలో ప్రజలు
- వైరస్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమంటున్న వైద్యులు



జిల్లా ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో సిద్ధంగా బెడ్లు



కరీంనగర్‌టౌన్: జిల్లాలో మళ్లీ కరోనా పంజా విసురుతోంది. 2019 డిసెంబర్‌లో ఫస్ట్ వేవ్, 2020 డిసెంబర్‌లో సెకండ్ వేవ్, 2021 డిసెంబర్‌లో థర్డ్ వేవ్‌తో వైరస్ విజృంభించింది. తాజాగా రెండేళ్ల తర్వాత మళ్లీ అదే డిసెంబర్‌లో జిల్లాలో పాజిటివ్ కేసుల ఆందోళన మొదలైంది. ఒమిక్రాన్ సబ్ వేరియంట్‌గా చెబుతున్న జేఎన్-1 కలకలం రేపుతుండగా కేసులు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత సోమవారం కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో రెండు పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇటీవలి కాలంలో కోవిడ్‌కు సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదు. మాస్క్ పెట్టుకోవడం కూడా మరిచిపోయారు. పెళ్లిళ్లు, మాల్స్, బస్సులు, జన సామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి భయం లేకుండా తిరుగుతున్నారు. నిబంధనలు పాటించక పోవడం వల్లే కరోనా మళ్లీ విజృంభిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సిద్ధమంటున్న వైద్యారోగ్యశాఖ..

వాస్తవానికి 2019లో చైనాలో కరోనా ఛాయలు కనిపించినా, జిల్లాలో మాత్రం 2020 మార్చిలో ఇండోనేషియా నుంచి కరీంనగర్ వచ్చిన మతప్రచారకుల ద్వారా వైరస్ ప్రవేశించిందని చెప్పవచ్చు. మూడు దఫాల్లోనూ డిసెంబర్‌లోనే కరోనా వేవ్స్ మొదలైన దరిమిలా ఈసారి కూడా ఈ నెలలో వైరస్ విస్తరిస్తుందన్న అనుమానాలు నెలకొన్నాయి. అయితే, పలువురు వైద్యాధికారులు మాత్రం కరోనా విస్తరించే అవకాశాలు తక్కువేనని, వచ్చినా గతంలో మాదిరి తీవ్రత ఉండక పోవచ్చని అంటున్నారు. గతంలో ఒమిక్రాన్ వేరియంట్ 40 ఏళ్లలోపు వారిలోనే ఎక్కువగా నమోదైంది. ఇప్పుడు దాని సబ్ వేరియంట్ జేఎన్-1 విషయంలో యువత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. కేసుల పెరిగినా వైరస్‌ను ఎదుర్కొనేందుకు తాము సిద్ధమేనని చెబుతున్నారు. కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ ప్లాంట్లు, 21 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకు, 120 పడకలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

మాస్కులు ధరించాలి

కరోనా కేసులు నమోదవుతున్న వేళ ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్యులు చెబుతున్నారు. కొత్త వేరియంట్‌తో ప్రాణాపాయ పరిస్థితులేమీ లేనప్పటికీ మాస్కు పెట్టుకోవడం వల్ల వైరస్ వ్యాప్తిని అడ్డుకునే అవకాశం ఉందని అంటున్నారు.



లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్

ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొంటాం

ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించాలి. జేఎన్-1 వేరియంట్‌తో పెద్దగా ప్రమాదమేమీ లేదు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం. వైరస్ నిర్ధారణ పరీక్షలకు కిట్లు, మందులు అందుబాటులో ఉంచాం. వైద్యులు, సిబ్బంది రెడీగా ఉన్నారు.

– డాక్టర్ వీరారెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

'ప్రజాపాలన' ఇన్‌చార్జీలు వీరే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28 నుంచి ప్రజాపాలన గ్రామసభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. ఇందుకోసం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు, 15 మండలాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 6 వరకు 10 రోజుల పాటు సభలను గ్రామస్థాయిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలుకు ఇవి వేదిక కానున్నాయి. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు.

నియోజకవర్గాలకు స్పెషల్ ఆఫీసర్లు..

కరీంనగర్‌కు మహేశ్వర్(ఆర్డీవో, కరీంనగర్), హుజూరాబాద్‌కు రాజు(ఆర్డీవో, హుజూరాబాద్), మానకొండూర్‌కు టి.పవన్‌కుమార్(జెడ్పీ సీఈవో), చొప్పదండికి ఎల్.శ్రీలత(డీఆర్‌డీవో).

మండలాలు, మున్సిపాలిటీలకు..

గంగాధరకు శ్రీధర్ డీఏవో, కరీంనగర్‌రూరల్‌కు సదానందం ఎస్‌డీసీ, చిగురుమామిడికి పి.నేతానియల్ ఎస్‌సీడీడీ, మానకొండూర్‌కు బి.వెంకటేశ్వర్లు డీఆర్‌డీవో అడిషనల్, కొత్తపల్లికి వి.పద్మావతి డీఎంవో, చొప్పదండి డాక్టర్ బి.నరేందర్ ఏహెచ్‌వో, గన్నేరువరానికి రామనుజాచారి డీసీవో, రామడుగుకు ఎస్.ప్రియదర్శిని పీడీ ఆత్మ, తిమ్మాపూర్‌కు ఎం.జయశంకర్ డీడీ ఎడ్యుకేషన్, శంకరపట్నంకు శ్రీనివాస్ అగ్రికల్చర్ ఏడీ, హుజూరాబాద్‌కు దేవేందర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, జమ్మికుంటకు బి.నవీన్‌కుమార్ జీఎం డీఐసీ, వి.సైదాపూర్‌కు అనిల్‌ప్రకాశ్ డీబీసీడీవో, ఇల్లందకుంటకు బి.శ్రీనివాస్ డీడీ హెచ్ఎస్‌వో, వీణవంకకు దేవేందర్ జిల్లా ఫిషరీస్ ఆఫీసర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బి.శ్రీనివాస్ ఎంసీ కరీంనగర్, చొప్పదండి మున్సిపాలిటీకి సురేశ్ డీసీఎస్‌వో, హుజూరాబాద్ మున్సిపాలిటీకి డాక్టర్ కె.లలితాదేవి డీఎంహెచ్‌వో, జమ్మికుంట మున్సిపాలిటీకి జనార్దన్ డీఈవో, కొత్తపల్లి మున్సిపాలిటీకి ఎం.రజనీకాంత్ డీఎం సివిల్ సప్లయ్‌లను నియమించారు.

విదేశాల్లో ఉద్యోగాలు

- రేపు ఎంపిక పరీక్ష



కరీంనగర్: బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం డిప్లొమా చదివినవారు జపాన్, జర్మనీ దేశాల్లో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో నర్సింగ్ అప్రెంటిస్‌షిప్‌కు ఇంటర్మీడియట్‌లో 60 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించినవారు అర్హులన్నారు. హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా/బ్యాచిలర్ డిగ్రీ ఫ్రెషర్స్ లేదా హోటల్ లేదా రెస్టారెంట్, ఫుడ్ అండ్ బెవరేజెస్‌లో ఏడాది అనుభవం ఉండి, 20 నుంచి 27 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఏసీ టెక్నీషియన్, పెయింటర్, ప్లంబర్, కార్పెంటర్‌గా రెండేళ్ల అనుభవం , ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 28న బస్‌స్టేషన్ ఎదురుగా గల నెహ్రూ యువ కేంద్రంలో టామ్‌కామ్ ఎంపిక పరీక్ష నిర్వహిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు 82478 38789, 89190 47600, 95739 45684 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'కాంట్రాక్టు'కు గుర్తింపేది?

- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు
- అందని హైపవర్ కమిటీ వేతనాలు
- విద్య, వైద్యం, కనీస సౌకర్యాలు కరువు
- పర్మినెంట్ చేయడంతోపాటు ఎన్నికలు నిర్వహించాలి
- సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికుల డిమాండ్
- నేడు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

పర్మినెంట్ కార్మికులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.. మరి కాంట్రాక్టు కార్మికుల సంగతేంది?.. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి.. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తాం.. పర్మినెంట్ కార్మికులతో సమానంగా వేతనాలు వచ్చేలా చూస్తాం.. సంస్థ లాభాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మిమ్ముల్ని గుర్తించేలా చూస్తామని గత పాలకుల హామీలు నీటిమూటలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ సంఘాలు పట్టించుకోవు.. కాంట్రాక్టు కార్మిక సంఘాలను యాజమాన్యం లెక్కలోకి తీసుకోదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ వ్యాప్తంగా సుమారు 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు పలు విభాగాల్లో పనిచేస్తున్నారు. గత ప్రభుత్వాలు వారిని పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసగించాయని వాపోతున్నారు. ఈసారైనా పలు యూనియన్లు తమకు మద్దతు పలికి తమ సమస్యలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతున్నారు. నేడు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల దయనీయ స్థితిగతులు ఇకనైనా మారాలని కార్మిక సంఘాల నేతలూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కరువు..

- సింగరేణిలో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైంది. – శ్రమకు తగిన వేతనం లేదు. బారెడు పనికి జానెడు జీతాలు.. ఇలా కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు.
- కోలిండియాలోని కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేస్తున్నా.. సింగరేణిలో ఆ ఊసేలేదు.
- ఆందోళనలు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదు.
- సంస్థ విస్తరించి ఉన్న ఆరుజిల్లాలో సుమారు 35వేల మంది పనిచేస్తున్నారు.
- భూగర్భగనుల్లో మొదలుకుని సివిక్, సివిల్, బెల్ట్‌క్లీనింగ్, ఓబీ, తోటమాలి, ఆస్పత్రులు తదితర విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల పని కీలకంగా మారింది.
- గతంలో కన్నా ఇప్పుడు వీరిసంఖ్య భారీగా పెరిగింది.
- సంస్థలో పర్మినెంట్ ఉద్యోగులు 42 వేల మంది ఉండగా, కాంట్రాక్టు కార్మికులు సుమారు 35వేల మంది పనిచేస్తున్నారు.
- సమస్యలు తలెత్తితే తమ తరఫున మాట్లాడే కార్మిక సంఘాలు కరవయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి చర్చించేందుకు తమకూ గుర్తింపు యూనియన్ ఉండాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి..?

పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో యాజమాన్యం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని వాపోతున్నారు. పర్మినెంట్ కార్మికులకు సమస్యలు తలెత్తితే గుర్తింపు, ప్రాతినిధ్య, జాతీయ సంఘాలు రంగంలోకి దిగి యాజమాన్యంతో చర్చించి చట్టబద్ధంగా హక్కులు సాధించుకుంటున్నాయి. అదే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను చర్చించి చట్టబద్ధత తీసుకొచ్చేందుకు పెద్దదిక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ మాదిరిగా సింగరేణిలోనూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నికల్లో తమకు ఓటుహక్కు కల్పించాలని, లేనిపక్షంలో ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్‌లు ఇవే..

- అన్నివిభాగాల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి
- కోలిండియా వేతనాలు లేదా జీవో నంబర్ 22 అమలు చేయాలి
- ఖాళీ క్వార్టర్లు కేటాయించాలి
- ఓబీలతో సహా అన్నింటిలోనూ స్థానికులకే అవకాశం కల్పించాలి
- లాభాల వాటా లేదా 20శాతం బోనస్ ఇవ్వాలి
- కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలి
- 26–09–22న జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలి
- సింగరేణి ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలి
- క్యాటగిరీ ఆధారంగా వేతనాలు చెల్లించాలి
- సీఎంపీఎఫ్, కనీస వేతనాలు అమలు చేయాలి
- అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హక్కులు పరిరక్షించాలి

సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. కోల్ ఇండియా వేతనాలు లేదా జీవో నెం.22ను ఎవరూ పట్టించుకోవడంలేదు. పలు ఘటనల్లో కాంట్రాక్టు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడి వికలాంగులుగా మారుతున్నారు. అందుకే, కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి సింగరేణి చొరవ తీసుకోవాలి. వారిహక్కులను కాపాడేందుకు ఎన్నికలు నిర్వహించాలి.

– కె.విశ్వనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంట్రాక్టు కార్మిక సంఘం నేత

కనీస వసతులు లేవు



సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు కూడా ఓటుహక్కు కల్పించాలని మా యూనియన్ ఆధ్వర్యంలో అనేకఉద్యమాలు చేశాం. కనీస వేతనాలులేక, అరకొర వసతులతో అనేక ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులు పనులు చేస్తున్నారు. వీరిసమస్యలు వెంటనే పరిష్కరించాలి.

– వేల్పుల కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం

ఆ రికార్డులు ఏమిటో.. ఏముందో?

- రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీపై కొనసాగుతున్న దర్యాప్తు
- సీసీ ఫుటేజీలో అనుమానితుడి దృశ్యాలు
- తెలిసినవారి పనేనా అనే అనుమానాలు?



సీసీ ఫుటేజీలో అనుమానితుడు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని రికార్డు గది నుంచి పలు రికార్డులను చోరీ చేసిన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దస్త్రాలను చేతిలో పట్టుకొని వెళ్తున్న దృశ్యాలను సీసీ ఫుటేజీలో గుర్తించారు. నేరుగా రికార్డు రూంకు వెళ్లాడంటే కచ్చితంగా కార్యాలయంలోని ప్రతీ చోటు తెలిసిన వ్యక్తే ఈ పని చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఆఫీస్ సిబ్బంది నుంచే విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. కీలకమైన దస్త్రాలు కాబట్టే తలుపులు పగులగొట్టి మరీ ఎత్తుకెళ్లాడని భావిస్తున్నారు. కానీ, అవి ఏమిటి, వాటిలో ఏమున్నది అనే విషయాలు తెలియలేదు. రిజిస్ట్రేషన్ రికార్డు రూంలో లక్షల సంఖ్యలో ఫైల్స్ ఉంటాయి. వాటిలో ఏవి చోరీకి గురయ్యాయో కూడా అధికారులు చెప్పడం కష్టమే. దొంగిలించిన వ్యక్తిని పట్టుకుంటేనే అసలు విషయం బయటపడనుందని సమాచారం.

హోర్డింగ్ పూర్తిగా తొలగించలే..

- సగానికి పైగా తీసివేసి, ఆపేయడంలో ఆంతర్యమేమిటో?



కళాశాలలో పూర్తిగా తొలగించని హోర్డింగ్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ వ్యవహారంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల తీరు పలు ఆరోపణలకు తావిస్తోంది. రెండు నెలల క్రితం కళాశాలలో అక్రమంగా ప్రధాన రోడ్డును ఆనుకొని భారీ హోర్డింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై హోర్డింగ్స్.. నో రూల్స్ పేరిట 'సాక్షి' దినపత్రికలో గత నవంబర్ 11న కథనం ప్రచురితమైంది. ఫిర్యాదులు రావడంతో ఆలస్యంగా స్పందించిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఈ నెల 7న హోర్డింగ్‌ను సగానికిపైగా తొలగించారు. మిగతాది వదిలేయడంలో ఆంత్యర్యమేమిటో అన్న చర్చ జరుగుతోంది. 20 రోజులు గడిచినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకొని నిర్మించిన హోర్డింగ్ వ్యవహారంలో సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకోలేదు. దీంతో వివాదం సద్దుమణిగాక హోర్డింగ్‌ను మళ్లీ ఏర్పాటు చేస్తారేమోనని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా దాన్ని పూర్తిగా తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చలాన్ కట్టండి.. డిస్కౌంట్ పొందండి

- వాహనాలను బట్టి 60–90 శాతం రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- ఈ నెల 26 నుంచి ప్రారంభం
- వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలంటున్న పోలీసులు



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

కరీంనగర్ క్రైం: పోలీసులు వాహనాల మీద ఉన్న పెండింగ్ చలాన్లపై ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించింది. వివిధ వాహనాలకు 60 నుంచి 90 శాతం వరకు డిస్కౌంట్ వర్తింపజేస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ద్విచక్రవాహనాలు, ఆటోల చలాన్లపై 80, ఆర్టీసీ బస్సులకు 90, కార్లు, లారీలకు 60 శాతం రాయితీ ఇచ్చారు. ఈ ఆఫర్ ఈ నెల 26 నుంచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది 3,55,208 కేసుల్లో రూ.10 కోట్లకు పైగా, గతేడాది 11,12,915 కేసుల్లో రూ.34 కోట్ల వరకు జరిమానా పెండింగ్‌లో ఉంది. చలాన్ల చెల్లింపునకు తుది గడువు ఎప్పటివరకు అనేది తెలియాల్సి ఉంది.

ఆసక్తి చూపుతున్న వాహనదారులు

పోలీసులు ఇచ్చిన ఆఫర్‌ను వినియోగించుకునేందుకు వాహనదారులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది మార్చిలో ఇలాగే ఇచ్చిన డిస్కౌంట్‌ను చాలామంది సద్వినియోగం చేసుకున్నారు. కొన్ని కేసుల్లో వాహనాల విలువ కంటే జరిమానా విలువ ఎక్కువగా ఉంది. దీంతో చెల్లించేందుకు వాహనదారులు ముందుకు రాకపోవడాన్ని గమనించిన ప్రభుత్వం ఈ రాయితీ ప్రకటించినట్లు తెలుస్తోంది. వాహనదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ఫైన్ చెల్లించాలని పోలీసులు సూచిస్తున్నారు.

2022 సంవత్సరంలో ట్రాఫిక్ కేసులు, ఫైన్ వివరాలు

	సంఖ్య	ఫైన్ (రూ.లలో)
కాంటాక్టు కేసులు	19,558	70,94,400
నాన్‌కాంటాక్టు కేసులు	1,99,949	4,70,44,715
స్పీడ్ లేజర్ గన్స్ కేసులు	11,293	1,16,87,455
క్రేన్ కేసులు	23,466	52,62,200
రియలైజేషన్ ఆఫ్ ఫైన్స్	8,58,649	26,52,02,340

2023 సంవత్సరంలో కేసులు, ఫైన్ వివరాలు

	సంఖ్య	ఫైన్ (రూ.లలో)
కాంటాక్టు కేసులు	14,640	56,68,800
నాన్‌కాంటాక్టు కేసులు	2,42,131	5,47,32,185
స్పీడ్ లేజర్ గన్స్ కేసులు	14,630	1,51,42,050
క్రేన్ కేసులు	3,418	18,93,800
రియలైజేషన్ ఆఫ్ ఫైన్స్	80,389	2,52,71,185

క్లుప్తంగా

గుండి సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

రామడుగు(చొప్పదండి): మండలంలోని గుండి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎ.వినయ్‌కుమార్ మద్యం సేవించి విధులకు హాజరైనందున విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24న వినయ్‌కుమార్ మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్నాడనే సమాచారం అందుకున్న అధికారులు బ్రీత్ అనలైజర్‌తో టెస్టు చేశారు. మద్యం సేవించినట్లు రికార్డు కావడంతో నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. విచారణ చేసిన డీఈఈ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు.

సెల్ పాయింట్‌లో చోరీ



ఘటనాస్థలిలో పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అంగడి బజార్‌లో గల ఓ సెల్ పాయింట్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీరాజరాజేశ్వర సెల్ పాయింట్ తాళాలు పగులగొట్టి, షాపులో ఉన్న సుమారు రూ.10 వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చిన యజమాని చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనాస్థలికి చేరుకొని, వివరాలు సేకరించారు.

తాళం వేసిన ఇంట్లో..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 21న తిరుపతి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకోగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి, ఇల్లంతా చిందరవందరగా ఉంది. వెంటనే కోనరావుపేట పోలీసులకు ఫోన్ చేయగా ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై రఘుపతిరెడ్డి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గంగాధర(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో రామడుగు మండలంలోని వెదిర గ్రామానికి చెందిన విలాసాగరపు నారాయణ(60) మృతి చెందినట్లు గంగాధర పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నారాయణకు కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. సోమవారం ఇంటి నుంచి వెళ్లపోయాడు. రాత్రివేళ గంగాధర మండలంలోని కొండన్నపల్లి వరద కాలువ సమీపంలో కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో పోలీసులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, నారాయణ మృతి విషయం అతని కుటుంబసభ్యులకు మంగళవారం సాయంత్రం తెలియడంతో ఆస్పత్రికి వెళ్లి, మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేసు నమోదు

వేములవాడఅర్బన్: దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాలు.. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో తిరుపతి అనే వ్యక్తి ఇంటి విద్యుత్ బిల్ రూ.9 వేలు బకాయి ఉన్నందున వేములవాడ టౌన్ సెస్ లైన్‌మెన్ రమణారెడ్డి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. ఈక్రమంలో తిరుపతి మళ్లీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండనే సమాచారంతో వెళ్లిన లైన్‌మెన్ రమణారెడ్డితో తిరుపతి దురుసుగా ప్రవర్తించాడు. చేతులతో నెట్టివేసినట్లు రమణారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

నాలుగేళ్లుగా పొడిగింపులే..

- ఎస్‌ఎంసీ కమిటీల ఎన్నికలు పట్టని ప్రభుత్వం
- 2019 నుంచి దాటవేతలే
- ఈ నెల 31తో ముగియనున్న కమిటీల గడువు



చింతకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

కరీంనగర్: నాలుగేళ్లుగా విద్యా కమిటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాఠశాల పరిపాలన గాడితప్పుతోందని విద్యావంతులు వాపోతున్నారు. 2019తో ముగిసిన విద్యాకమిటీల కాలపరిమితిని ప్రతి ఆరునెలలకోసారి ప్రభుత్వం పొడగిస్తుండడంతో ఎన్నికల నిర్వహణ గాలిలో దీపంగా మారింది. తాజాగా ఈనెల 31తో విద్యాకమిటీలకు కాల పరిమితి ముగియనుండడంతో ఈసారైనా ఎస్‌ఎంసీ కమిటీలకు ఎన్నికలు జరుగుతాయో లేదోననే మీమాంస నెలకొంది. ఇప్పుడైనా ఎన్నికలు నిర్వహిస్తారో, మళ్లీ గడువు పొడగిస్తారో వేచి చూడాల్సిందే.

జిల్లాలో 678 కమిటీలు

జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు 651 ఉన్నాయి. మిగితావి కేజీబీవీ, ఆదర్శ, యూఆర్‌ఎస్, టీఎస్‌ఆర్‌ఈ పాఠశాలల కమిటీలు కలుపుకుని మొత్తం 678 కమిటీలు ఉన్నాయి. వీటిలో 62 వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పిల్లల విద్యా ప్రమాణాలను సాధించేందుకు తల్లిదండ్రులు, విద్యాభిమానుల సహకారంతో ఎస్‌ఎంసీలను ఏర్పాటు చేశారు. 6–8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన నిర్వహణతో పాటు ప్రభుత్వం నుంచి పిల్లలకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, దుస్తులు, పాఠశాలలకు వచ్చే నిధుల వివరాలు, మౌళిక వసతుల నిర్వహణపై ఎస్‌ఎంసీ కమిటీలను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతినెలా ఎస్‌ఎంసీ సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రణాళికలు రూపొందించి వాటి అమలుకు కమిటీలు శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. కాగా, గత నాలుగేళ్లుగా పాత కమిటీలనే కొనసాగిస్తున్నారు. పలు పాఠశాలల్లో విద్యాకమిటీ సభ్యుల పిల్లలు పై చదువులకు వెళ్లిపోయారు. దీంతో ఆయా కమిటీల పర్యవేక్షణ పాఠశాలలపై లేకపోవడంతో ఎస్‌ఎంసీ కమిటీలు ఉన్నట్టా, లేనట్టా అనే సందిగ్ధం నెలకొంది. నాలుగేళ్లుగా వాయిదాలు పడుతుండగా ఇకనైనా ఎన్నికలు నిర్వహించి పాఠశాలల నిర్వహణ గాడిలో పడేలా చూడాలని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా..



ఎస్‌ఎంసీ చైర్మన్ల పదవీకాలం ఈనెలాఖరు వరకు పొడగిస్తూ ఉత్తర్వులు అందాయి. తిరిగి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేవరకు పాత కమిటీలే పనులను పర్యవేక్షిస్తాయి. కమిటీల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి అందే ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం.

– జనార్దన్‌రావు, డీఈవో

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

- రాత్రివేళల్లో పనులు నిలిపివేయాలని డిమాండ్



లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

మానకొండూర్: రాత్రింబవళ్లు మిషనరీలతో బండరాళ్లు పగలగొడుతూ, బ్లాస్టింగులు చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పెద్దూర్ పల్లెగ్రామస్తులు మంగళవారం టిప్పర్లను అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ టిప్పర్లను వెళ్లనిచ్చేది లేదని మండిపడ్డారు. చెంజర్ల రెవెన్యూ శివారులోని కొండెగల గుట్ట నుంచి గ్రానైట్ తీయగా, మిగిలిన వేస్టేజ్ రాయిని డీబీఎల్ కంపెనీ టిప్పర్ల ద్వారా నేషనల్ హైవే పనులకు నిత్యం తరలిస్తున్నారు. శబ్ద కాలుష్యంతో గ్రామస్తులకు నిద్ర లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగు కారణంగా పంట పొలాల్లో బండరాళ్లు పడటంతో నష్టపోతున్నామని, శబ్ద, వాయుకాలుష్యం ఏర్పడుతుందని, తారురోడ్డు పగుళ్ల బారి అధ్వాన్నంగా మారుతుందని ఆరోపించారు. నాలుగు నెలల క్రితమే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాత్రి వేళల్లో పనులు బంద్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్ రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణకుమార్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన నిందితుడు చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాజును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ వై.కృష్ణకుమార్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, డ్రైవింగ్‌లో నిర్ణీత వేగాన్ని పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇతర పత్రాలు కలిగి ఉండాలన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు చందుర్తి ఉపాధ్యాయుడి ఎంపిక



విద్యార్థులకు భౌతికశాస్త్రం పాఠ్యాంశాలు బోధిస్తున్న ఓదెలుకుమార్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీపాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బాషబత్తిని ఓదెలుకుమార్ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కి ఎంపికయ్యాడు. మంగళవారం ఆయన చిగురుమామిడిలో మాట్లాడారు. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో జనవరి 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ తొమ్మిదవ ఇంటర్నేషనల్ సైన్స్‌ఫెస్టివల్ జరుగుతుందన్నారు. నాలుగోసారి జాతీయ స్థాయి సైన్స్‌ఫెస్టివల్‌కు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. సదస్సులో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తల సెమినార్లు, పరస్పర చర్చలు, ప్రదర్శనలు, పోటీలు, విజ్ఞాన శాస్త్ర భాగస్వామ్య కార్యక్రమాలు, సాంకేతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

దోపిడీ రహిత సమాజానికి కృషి



జెండా ఎగురవేసిన వెంకటస్వామి, నాయకులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

కరీంనగర్: దోపిడీ రహిత సమాజం కోసం సీపీఐ కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో తమ పార్టీ అగ్రనాయకులు ప్రత్యక్షంగా పాల్గొని, జైలుపాలయ్యారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సీపీఐ అనేక నిర్బంధాలను ఎదుర్కొందని, అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందని అన్నారు. దేశ ప్రజలను కులాలు, మతాలవారీగా విభజించి పరిపాలిస్తున్న బీజేపీ, ఎన్‌డీఏకు వ్యతిరేకంగా సీపీఐ శ్రేణులు ప్రజోద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి కిన్నెర మల్లవ్వ, పైడిపెల్లి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, నలువాల సదానందం, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు



ధృవిక

చొప్పదండి: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శనలో చొప్పదండి మండలంలోని భూపాలపట్నంకు చెందిన కరుణకంటి ధృవిక పాల్గొంది. తన ప్రతిభతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది. ఆమె ప్రస్తుతం రెండోతరగతి చదువుతోంది. కూతురి ఘనతపై తల్లిదండ్రులు రాము– స్రవంతి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐటీయూసీకి టీబీజీకేఎస్ మద్దతు

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీకి తమ యూనియన్ ఆర్జీ–1 ఏరియాలో మద్దతు ప్రకటిస్తున్నట్లు టీబీజీకేఎస్ నాయకులు నూనె కొమురయ్య, గండ్ర దామోదర్‌రావు, వడ్డేపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవిషయాన్ని వెల్లడించారు. ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ విజ్ఞప్తి మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాయకులు పర్లపెల్లి రవి, దూత శేషగిరి, కుషనపెల్లి శంకర్, ఎం.రాజేశం, మల్లారెడ్డి, చెల్పూరి సతీశ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, నేరెళ్ల సదయ్య, దొరగాండ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు



కారు బానట్‌పై పడిన పోశయ్య, గాలిలో ఎగిరి తలకిందులుగా పడుతున్న మల్లవ్వ

చందుర్తి(వేములవాడ): కారు అతి వేగానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామానికి చెందిన మల్లారపు పోశయ్య– మల్లవ్వ దంపతులు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కట్టలింగంపేట బస్టాండ్ సమీపంలో రుద్రంగి నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోశయ్య ఎగిరి కారు బానట్‌పై పడగా, మల్లవ్వ గాలిలో లేచి తలకిందులుగా కిందపడింది. దంపతులిద్దరినీ కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లవ్వ పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు. కారు అతివేగమే ప్రమాదనికి కారణమని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

యాసంగి సాగు ముమ్మరం



ఇరుకుల్లలో వరి నాటు వేస్తున్న మహిళా కూలీలు

- నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి తడులు
- కరీంనగర్ రూరల్ డివిజన్‌లో వరినాట్లు ప్రారంభం
- ప్రాజెక్టు ఆయకట్టు కింద 14,987 ఎకరాలు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు రైతులు వరి నారు పోస్తుండగా మరికొందరు పొలాలను దున్నుతున్నారు. అయితే, సాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్న ఉద్దేశంతో పలువురు అన్నదాతలు ముందస్తుగా నాట్లు వేయిస్తున్నారు. ఎస్సారెస్పీ నీటిపై ఆశతో ఉన్నవారు ఆరుతడి పంటలకు బదులు వరి సాగువైపే మొగ్గు చూపుతున్నారు.

వారబందీ విధానం అమలు

కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. వానాకాలంలో వరి పంట సాగు చేసిన రైతులు చెరువులు, బావుల్లో పుష్కలంగా నీరు ఉండటం, ఎస్సారెస్పీ నీటి విడుదల నేపథ్యంలో యాసంగిలో సైతం వరి సాగుకే ముందుకొస్తున్నారు. ఈ నెల 18న ఎస్సారెస్పీ నుంచి నీళ్లు విడుదల చేయగా కరీంనగర్ మండలానికి బుధవారం నుంచి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. వారబందీ విధానంలో 8 రోజులు నీటి సరఫరా, 7 రోజులు నిలిపివేత పద్ధతిలో నీరందించనున్నారు. ఈ నెలలో ఒక తడి, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండేసి తడుల చొప్పున మొత్తం 7 నీటి తడులను విడుదల చేయనున్నారు. మండలంలో 13,009 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా వరిని 12,185 ఎకరాల్లో పండిస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే, సాగునీటి సౌకర్యంతో ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముంది. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధి(కొత్తపల్లితో కలిపి)లోని డీ–89 నుంచి డీ–94 కాల్వల వరకు ఎస్సారెస్పీ ఆయకట్టు కింద మొత్తం 14,987 ఎకరాలు సాగవుతుంది. అత్యధికంగా నగునూరులో 2,950 ఎకరాలు, చామనపల్లిలో 1,789, బొమ్మకల్‌లో 1,289, మొగ్దుంపూర్‌లో 1,054, ఇరుకుల్లలో 1,086, చేగుర్తిలో 1,022, గోపాల్‌పూర్‌లో 993, ఎలబోతారంలో 935 ఎకరాల్లో పండించనున్నారు.

ఆయకట్టు చివరికీ నీరందిస్తాం

ఎస్సారెస్పీ నీళ్లు బుధవారం నుంచి అందుబాటులోకి వస్తాయి. ఆయకట్టు చివరి భూములకూ అందించేలా చర్యలు తీసుకుంటాం. కాల్వల్లో నాచు, తుంగ, చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగించాం.

– సంతోష్, డీఈ, నీటిపారుదలశాఖ

డ్రా చేయలే.. ఎవరికీ పంపలే

- బ్యాంకు ఖాతా నుంచి రూ.8,500 జీఐటీ ముంబయికి బదిలీ
- తిరిగి ఇప్పించాలని బాధితుడి వేడుకోలు



బాధితుడు రవి

జూలపల్లి(పెద్దపల్లి): డ్రా చేయలే.. ఎవరికీ పంపలే.. అయినా ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మరో అకౌంట్‌కు బదిలీ అయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం.. జూలపల్లి మండలంలోని కాచాపూర్‌కు చెందిన దీకొండ రవి గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతనికి పెద్దపల్లిలోని ఎస్‌బీఐ శాఖలో సేవింగ్స్ అకౌంట్ ఉంది. ఖాతాలో రూ.8,574.46 ఈ నెల 24 వరకు ఉన్నాయి. 25న కరీంనగర్ వెళ్లి, సామగ్రి తెచ్చుకుందామని అకౌంట్ చెక్ చేయగా రూ.74.46 చూపించాయి. మంగళవారం బ్యాంకుకు వెళ్లి, ప్రింట్ తీయించగా అతని ఖాతా నుంచి డీఏయూ రూరల్ బ్యాంకింగ్ జీఐటీ ముంబయికి రూ.8,500 బదిలీ అయ్యాయని వచ్చింది. దీంతో రవి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. సంబంధిత కాపీ, బ్యాంకు ఖాతా పుస్తకంపై వచ్చిన ప్రింట్‌ను జూలపల్లి పోలీసులకు అందజేశాడు. అనంతరం మాట్లాడుతూ.. తాను ఎక్కడా వేలిముద్ర వేయలేదని, ఓటీపీ కూడా ఎవరూ అడగలేదని తెలిపాడు. అయినా, ఖాతా నుంచి డబ్బులు బదిలీ అయ్యాయని వాపోయాడు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం చేస్తారని ఎందరికో చెప్పే తనకే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇప్పించాలని పోలీసులను వేడుకున్నాడు.

పాన్‌షాపులో దొంగతనం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని ఓ పాన్‌షాపులో దొంగతనం జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీసేవ కేంద్రం ఎదుట బూర్ల శ్రావణ్ పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. అతను సోమవారం రాత్రి దుకాణం మూసి, ఇంటికి వెళ్లిపోయాడు. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి, రూ.10 వేల విలువైన సామగ్రి చోరీ చేశారు. బాధితుడు మంగళవారం ఉదయం పాన్‌షాపు వద్దకు వచ్చి, దొంగతనం జరిగినట్లు నిర్ధారణకు వచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జీవన్ తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతంలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, అదే ప్రాంతంలోని మరో దుకాణం తాళాలు పగులగొట్టినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ యువతి మృతి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాకకు చెందిన దొండ సౌమ్య(19) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ విజేందర్ వివరాల ప్రకారం.. దొండ సరిత–నర్సయ్య దంపతులకు ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు సౌమ్య ఇంటర్ వరకు చదివి, ఇంటి వద్దే ఉంటూ రోజువారీ కూలీ పనులకు వెళ్లేది. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కూలీకి వెళ్లకపోవడంతో ఎందుకు ఇంటివద్దే ఉంటున్నావని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది, ఆదివారం క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

- వేములవాడకు చెందిన యువకుడి మృతి

జగిత్యాల క్రైం: బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. జగిత్యాల పట్టణ ఎస్‌ఐ మన్మదరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన వావిలాల తిరుపతి(20) సోమవారం ఉదయం జగిత్యాలలోని తన స్నేహితులు వేల్పుల ప్రవీణ్, తోట రాములను కలిసేందుకు వచ్చాడు. అర్ధరాత్రి ప్రవీణ్ తన బైక్‌పై తిరుపతి, రాములను బయటకు తీసుకెళ్లాడు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ అవుట్ గేట్ వద్ద అతివేగం కారణంగా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పందులను ఎత్తుకెళ్లిన ఆరుగురి అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: పందులను ఎత్తుకెళ్లిన కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ విజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల రోడ్డులో నివాసం ఉంటున్న రెవెల్లి ఎల్లయ్య పందులను పెంచుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. మొత్తం 22 జీవాలకు కామధేనువు రైస్‌మిల్లు పక్కన చెట్ల పొదల్లో పాక ఏర్పాటు చేశాడు. గత దసరాకు ముందు దాదాపు రూ.1.50 లక్షలు విలువైన పందులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్, ఓదెల మండలంలోని మడక, ఎలిగేడు మండలంలోని వడ్క్యాపూర్‌కు చెందిన ఈరయ్య, శివాజీ, రాకేశ్, శివాజీ, సునీల్, రాజయ్యలను మంగళవారం అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



చుక్కారెడ్డి మృతదేహం

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలంలోని గొడిశెలపేటకు చెందిన వన్నెల చుక్కారెడ్డి(52) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చుక్కారెడ్డి ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి, మందులు వాడినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి మరోసారి కడుపునొప్పి రావడంతో భరించలేక క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కడుపునొప్పి వల్లే జీవితం విరక్తి చెంది, ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్వేత తెలిపారు.

వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ



హైదరాబాద్: వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ అధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్ కుమార్ డబ్బీ కార్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాసర్కార్-రాజ్యాంగబద్ధ పాలనపై ఫిలింభవన్‌లో సదస్సు నేడు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో నూతన ప్రజాసర్కార్-రాజ్యాంగబద్ధ పాలన -ప్రజల భాగస్వామ్యం-ప్రజా సంఘాల పాత్ర అనే అంశంపై బుధవారం ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ సారథి పెద్దలు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థి, యువజన, కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కోదండరాంకు సన్మాన కార్యక్రమముంటుందన్నారు.

గాండ్ల, తెలి కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌రూరల్: గాండ్ల, తెలి కుల వృత్తిదారులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన చర్యలు చేపట్టాలని గాండ్ల కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, ప్రధాన కార్యదర్శి జక్కం పుల్లయ్య కోరారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎద్దులను గానుగకు కట్టి స్వచ్ఛమైన నువ్వులు, పల్లినూనెను తీసి ప్రజలకు విక్రయించి జీవనోపాధి పొందినట్లు చెప్పారు. ప్రస్తుతం పెద్దపెద్ద ఆయిల్ మిల్లుల రాకతో కుటీర పరిశ్రమ దెబ్బతిని ఉపాధి కోల్పోయినట్లు తెలిపారు. దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలకు గానుగ నూనె వాడేవారని, నూనె సరఫరా చేసే టెండర్లను గాండ్ల కులస్తులకు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి గుజ్జేటి రవీందర్, జక్కం విద్యాసాగర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



అనిరుధ్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్ స్పోర్ట్స్: ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో అండర్-14 బాలుర విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పారమిత ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి కె.అనిరుధ్ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. అతను కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, వి.యు.ఎం. ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, కవిత తదితరులు మంగళవారం అభినందించారు.

'ఉన్నతి, తొలిమెట్టు' రద్దు చేయాలి



డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంపీ సంజయ్, తపస్ నాయకులు

కరీంనగర్: టీచర్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాలను రద్దు చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, గన్నమనేని రంగారావు కోరారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు పీఆర్సీ ఫిట్‌మెంట్, మూడు డీఏలు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్(పెండింగ్ బిల్స్) మంజూరు చేయాలని, ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తూ కొత్త నియమకాలు చేపట్టాలని, పరిశుభ్రత కోసం ప్రతీ స్కూల్‌కు ఒక అటెండర్, స్కావెంజర్‌లను నియమించాలని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శులు అంబటి వేణుకుమార్, అన్నమనేని తిరుపతిరావు, వీరమల్ల వెంకటరమణారావు, తపస్ బాధ్యులు బొట్ల రామస్వామి, శశిధర్ రెడ్డి, ప్రేమ్‌చందర్ రెడ్డి, శ్రీధర్, హరి చరణ్, కరుణాకర్‌రావు, శాంతిరాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సహస్ర దీపారాధన..

విద్యానగర్(కరీంనగర్): నగునూర్ గ్రామంలోని దుర్గాభవానీ దేవాలయంలో అమ్మవారికి ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పల్లకి సేవ, సహస్ర దీపారాధన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌కృష్ణశర్మ ఉయ్యాల సేవలతో పాటు విశేష హారతి, పూజ కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. ఫౌండర్ వంగల లక్ష్మణ్, కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కనుల పండువగా శోభాయాత్ర

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌లో మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతలు, కలశం శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. కరీంనగర్ నుంచి తీసుకొచ్చిన కలశం, అక్షింతలకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం దుర్శేడ్ ప్రధాన రహదారి నుంచి చేపట్టిన శోభాయాత్ర భక్తుల జైశ్రీరాం నినాదాలతో గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా భక్తాంజనేయ స్వామి ఆలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు తుమ్మ ఓంప్రకాశ్, రాపెల్లి శ్రీనివాస్, చంద్రమౌళి, పవన్‌రావు, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్ తోట తిరుపతి, నందాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధికి ప్రత్యేక దరఖాస్తులు

- రేపటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు
- గ్రామసభ నిర్వహణకు రూ.10వేలు



గోపాల్‌పూర్ గ్రామ పంచాయతీ

కరీంనగర్‌రూరల్: వివిధ సంక్షేమ పథకాల లబ్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కరీంనగర్ మండలంలో ప్రజాపాలన గ్రామసభలను ఈనెల 28 నుంచి వచ్చేనెల జనవరి 4 వరకు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. గ్రామసభలను విజయవంతం చేసేందుకు కరీంనగర్ నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా ఆర్డీవో కె.మహేశ్వర్, మండల ప్రత్యేక అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందంను కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం నియమించారు. కరీంనగర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభ నిర్వహణకు ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రభుత్వం రూ.10వేల చొప్పున నిధులను మంజూరు చేసింది.

రెండు బృందాలతో..

తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు ఆధ్వర్యంలో రోజుకు రెండు, మూడు గ్రామ సభల చొప్పున నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామసభల్లో ప్రజల దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేస్తారు. దరఖాస్తులను అధికారులు పరిశీలించి రశీదు అందిస్తారు. అయితే ప్రభుత్వమే రూపొందించిన నిర్ణీత దరఖాస్తు ఫారంలోనే మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ గృహాలు, చేయూత తదితర పథకాలకు దరఖాస్తు చేయాలని తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు సూచిస్తున్నారు. గ్రామసభ రోజున దరఖాస్తు చేసుకోనట్లయితే జనవరి 6 లోపు సంబంధిత గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకునే అవకాశముందని తెలిపారు.

షెడ్యూల్..

ఈనెల 28న బొమ్మకల్, చామనపల్లి, 29న నగునూరు, చెర్లభూత్కూర్, 30న దుబ్బపల్లి, దుర్శేడ్, ఎలాబోతారం, జనవరి 2న ఫకీర్‌పేట, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, 3న జూబ్లీనగర్, మందులపల్లి, మొగ్ధుంపూర్, 4న బహుదూర్‌ఖాన్‌పేట, నల్లగుంటపల్లి, తాహెర్‌కొండాపూర్, చేగుర్తి గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారు.

ప్రజాపాలనను వినియోగించుకోండి

- నగరంలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ సతీశ్

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత క్షేత్రస్థాయిలో తొలిసారిగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వ యంత్రాంగంతో పాటు పార్టీ నాయకులు కూడా నడుం కట్టారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రధాన అంశమైన ఆరు గ్యారంటీల పథకాల అమలుకు ఈ ప్రజాపాలన కార్యక్రమం పునాది వేయనుండడంతో.. ప్రజల్లో విస్తృతంగా ప్రాచుర్యం కల్పిస్తున్నారు. మంగళవారం నగరంలోని 9, 31 డివిజన్ల పరిధిలో మాజీ కార్పొరేటర్లు కట్ల విద్య, కట్ల సతీశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ప్రజాపాలనను వినియోగించుకోవాలంటూ ఇంటింటికి కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు కోరుతున్నందున.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సమన్వయకర్తలుగా పని చేయాలి

ఈనెల 28 నుంచి అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు సమన్వయకర్తలుగా పని చేయాలని పురుమల్ల శ్రీనివాస్ కోరారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

ప్రజాపాలనను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి కోరారు. డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేసిన ప్రభుత్వం.. మరో నాలుగు పథకాల అమలుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందన్నారు. నాయకులు మడుపు మోహన్, పులి ఆంజనేయులు, రామిడి రాజిరెడ్డి, సిరికొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోకపోవడం శోచనీయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమౌతున్నా.. పాలక పక్షం, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దుర్గం మారుతి, నాయకులు మిర్యాలకార్ ఆనంద్, తాడూరి బ్రహ్మం, గుడిపాటి జితేందర్‌రెడ్డి, గంప జగన్, బాసం కుమార్, గోధారి చంద్రయ్య, ఆర్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెరమరుగైనా.. ఇప్పటికీ అధికారులు ఆ పార్టీకే కొమ్ము కాస్తూ ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్మార్ట్ సిటీ పనుల్లో రూ.130కోట్ల అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నాయకుడే ఆరోపించడం గమనించాల్సిన విషయమన్నారు. ఈనెల 28న కార్పొరేషన్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

చిత్ర కథ



రోడ్డుపై మురుగు నీరు

రాజీవ్ రహదారి నిర్వహణను హెచ్‌కేఆర్ సంస్థ పట్టించుకోవడం లేదు. దుర్శేడ్‌లోని ప్రధాన రహదారిలో డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురుగు నీళ్లు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. పెద్దపల్లి రోడ్డు వైపున్న నివాసాలకు చెందిన మురుగు నీరు రోడ్డు పక్కనుంచి పోతున్నా.. పంచాయతీ అధికారులు, హెచ్‌కేఆర్ సంస్థ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీళ్లు పోయేందుకు డ్రెయినేజీ నిర్మించాలని రెండేళ్ల నుంచి కోరుతున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– కరీంనగర్‌రూరల్

పాహిమాం.. దత్తాత్రేయ..



కొత్తపల్లిలో పూజలందుకున్న సాయిబాబా



భక్తి గీతాలు ఆలపిస్తున్న నీలకంఠ భజన మండలి సభ్యులు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని శివాలయం(శ్రీసీతారామచంద్ర శ్రీసాయిబాబా సహిత దేవాలయం)లో దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని మంగళవారం గురుదత్త పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదత్తాత్రేయ, సాయిబాబా విగ్రహాలకు అభిషేకంతో పాటు పరమేశ్వరుడికి అన్నపూజ చేశారు. భక్తులకు ఫల, పంచామృతాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాసాలమర్రి నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన భజన కార్యక్రమాలు

విద్యానగర్(కరీంనగర్): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో జరుగుతున్న దత్తాత్రేయస్వామి జయంతోత్సవాల్లో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మంగళవారం కరీంనగర్ గణేశ్‌నగర్‌కు చెందిన శ్రీనీలకంఠ భజన మండలి సభ్యులు భక్తి సంగీత, భజన కార్యక్రమాలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు గర్రెపెల్లి ఆంజనేయులు, సభ్యులు సంధ్య, కవిత, పంజాల శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్, కనకరాజు, సదానందం, స్వామి, కమలాకర్, కృష్ణస్వామి, రవీంద్రచారి భక్తి గీతాలను ఆలపించారు.

సమాజాన్ని అధ్యయనం చేసి కవిత్వం రాయాలి



పాల్గొన్న కవులు

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సుభాష్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం 128వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, అఖిల భారత తెరవే అధ్యక్షుడు జూకంటి జగన్నాథం మాట్లాడారు. కవులు పూలే, అంబేడ్కర్ వెలుగులో భారతీయ సమాజాన్ని అధ్యయనం చేసి, కవిత్వం రాయాలన్నారు. కార్యక్రమంలో కవులు విలాసాగరం రవీందర్, గజ్జెల కిశోర్, మేడి చంద్రయ్య, సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, పెనగొండ బసవేశ్వర్, పీఎస్ రవీంద్ర, సంకేపల్లి నాగేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోండి

- నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్
- ప్రజాపాలన కార్యక్రమంపై అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28 నుంచి చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని నగరంలో పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలిక కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులు, ఆర్పీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ప్రజాపాలనను డివిజన్ల వారీగా నగరంలోని 60 డివిజన్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు డిసెంబర్ 31, జనవరి 1వ తేదీలను మినహాయించి, దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రతీ 10 డివిజన్లకు ఒక ప్రత్యేక అధికారిని, ప్రతీ డివిజన్‌కు ఆరుగురు సిబ్బందిని నియమించామని తెలిపారు. కార్పొరేటర్ల భాగస్వామ్యంతో ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అదనపు కమిషనర్ స్వరూపారాణి, ఈఈ మహేందర్, ఆర్‌వో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా ఇలా..

ఈనెల 28న 1, 6, 12, 14, 18, 20, 25, 33, 42, 45 డివిజన్లు, 29న 2, 7, 13, 15, 19, 21, 26, 34, 46, 49, 30న 3, 8, 16, 22, 27, 30, 35, 37, 48, 51, జనవరి 2న 4, 9, 17, 23, 28, 31, 38, 40, 50, 54, 3న 5, 10, 29, 32, 36, 39, 41, 52, 53, 57, 4న 11, 24, 43, 44, 47, 55, 56, 58, 59, 60 డివిజన్లలో నిర్వహిస్తారు. రోజూ 10 డివిజన్లలో నిర్వహించనున్నారు.

నేడు దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ

కరీంనగర్: మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో బుధవారం ఉదయం 10 గంటలకు దివ్యాంగులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.



పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో ఈనాడు ప్రతులను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

వలంటీర్ల సమ్మె అవాస్తవం

- సమ్మె ప్రచారాన్ని ఖండించిన వలంటీర్ల సంఘాలు

సాక్షి, అమరావతి/చిత్తూరు కలెక్టరేట్/పటమట (విజయవాడ తూర్పు)/వీరఘట్టం: నిన్న మొన్నటి దాకా వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా చిత్రీకరించిన విపక్ష పార్టీలు, వారి అనుకూల పచ్చ మీడియా ఇప్పుడు వలంటీర్లలో కొందరినైనా చీల్చి వారిలో ప్రభుత్వ విద్వేషాన్ని రగిల్చి సమ్మెబాట పట్టించాలన్న కుట్రలు పటాపంచలయ్యాయి. తామెలాంటి సమ్మెలో పాల్గొనడంలేదని వలంటీర్ల సంఘాలు తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో మొత్తం 2.60 లక్షల మంది వలంటీర్లు పనిచేస్తుండగా.. ఆయా వలంటీర్లు తమ వృత్తి సంబంధిత అంశాలపై తలెత్తే సందేహాలు నివృత్తి చేసుకునేందుకు జిల్లాల వారీగా లేదా ఎక్కడికక్కడ అనధికారికంగా సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటుచేసుకున్నారు. కొన్నింటిలో ఎవరికి వారే ఆ గ్రూపుల్లో చేరే అవకాశం ఉండడంతో.. వివిధ ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులు కొందరు వలంటీర్ల ముసుగులో ఆ గ్రూపుల్లోకి దూరి వలంటీర్లను రెచ్చగొట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వంపై రెచ్చగొట్టే పోస్టులు పెడుతూ వచ్చారని వలంటీర్లు చెప్పారు. నిజానికి.. వలంటీర్లకుగానీ, వలంటీర్ల సంఘాల ప్రతినిధులకు గానీ సమ్మె చేయాలని ఎలాంటి ఆలోచన లేకపోయినా ప్రేరేపిత పోస్టులకు స్పందించే ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు సమ్మెకు దిగుతున్నారని మిగిలిన వలంటీర్లను రెచ్చగొట్టి వారితో సమ్మె ముసుగులో ఆందోళన చేపట్టేందుకు తెలుగుదేశం సహా మరికొన్ని రాజకీయ పక్షాలు యత్నిస్తున్నాయి. అయితే, వలంటీర్ల సమ్మెను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు కొట్టిపారేశారు. రాష్ట్రంలో వలంటీర్లు ఎక్కడా విధులు బహిష్కరించినట్లుగానీ, ఆందోళనలు చేపట్టినట్లుగానీ ఎలాంటి సమాచారంలేదని వారు పేర్కొంటున్నారు. ఇక.. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా'కార్యక్రమంలో వలంటీర్లు పూర్తిస్థాయిలో పాల్గొన్నారని వారు స్పష్టంచేశారు. చంద్రబాబుకు లబ్ధి చేకూర్చాలన్న దురుద్దేశంతో ఈనాడులో ప్రచురించిన తప్పుడు కథనంపై వలంటీర్లు మండిపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలోని సీపీఎస్ రోడ్డులో మంగళవారం ఈనాడు ప్రతులతో ఆందోళన చేశారు. రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ ఈనాడు ప్రతులను దగ్ధంచేశారు.

ఆటలతో.. ఆరోగ్యం.. ఆణిముత్యాలు

గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను సానపట్టి దేశానికి అందిస్తాం: సీఎం జగన్

- ప్రతి ఒక్కరికీ వ్యాయామం ఎంత అవసరమో అవగాహన కల్పిస్తాం
- ఇక ఏటా 'ఆడుదాం.. ఆంధ్ర' టోర్నీ
- మెగా టోర్నీని గుంటూరులో ప్రారంభించిన ముఖ్యమంత్రి



గుంటూరు జిల్లా నల్లపాడులో జ్యోతి ప్రజ్వలన చేసి 'ఆడుదాం ఆంధ్ర'ను ప్రారంభిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రి రోజా, బ్యాడ్మింటన్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'ఆడుదాం ఆంధ్ర'ఆటల పోటీల ద్వారా గ్రామీణ ఆణిముత్యాలను వెలికి తీసి సానపట్టి వజ్రాలుగా మార్చి దేశానికి అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలోనే అతిపెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్ర'ను మంగళవారం గుంటూరు జిల్లా నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఇవాళ మొదలవుతున్న ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలుస్తాయని, 47 రోజుల పాటు ఫిబ్రవరి 10వతేదీ దాకా ఊరూరా పండుగ వాతావరణంలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. అందరూ పాల్గొనే ఒక గొప్ప పండుగగా ఇది చరిత్రలో నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు ప్రధాన లక్ష్యాలు..

'ఆడుదాం.. ఆంధ్ర'కార్యక్రమం వెనుక ప్రభుత్వానికి రెండు ప్రధాన ఉద్దేశాలున్నాయి. ఒకటి.. గ్రామ స్థాయిలోని ఆణిముత్యాలను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయడం. రెండోది.. వ్యాయామం, క్రీడల వల్ల అనారోగ్య సమస్యలను దూరం చేయవచ్చు. ఇవి రెండూ సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వ్యాయామం, క్రీడల వల్ల ప్రతి మనిషికి ఆరోగ్యపరంగా ఎంత మేలు జరుగుతుంది? ప్రతి ఒక్కరికీ అవి ఎంత అవసరం? అనే విషయాలను తెలియజేసేందుకు ఇది ఒక అవగాహన కార్యక్రమంలా ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల బీపీ కంట్రోల్‌లో ఉంచుకోగలుగుతాం. టైప్ 2 డయాబెటీస్‌ని నిరోధించడంలో క్రీడలు చురుకైన పాత్ర పోషిస్తాయి.

మెంటార్లుగా పీవీ సింధు, శ్రీకాంత్

ఈ క్రీడోత్సవాలు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు జరుగుతాయి. వివిధ స్థాయిల్లో ఆణిముత్యాలను గుర్తించేందుకు ప్రొఫెషనల్ లీగ్ టీమ్స్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తాయి. క్రికెట్‌కు సంబంధించి చెన్నై సూపర్ కింగ్స్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ముందుకు వచ్చాయి. ఆణిముత్యాలను వెతికి వారికి మెరుగులు దిద్ది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఈ టీమ్స్ తోడుగా ఉంటాయి. బ్యాడ్మింటన్‌కు సంబంధించి కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు ఇందులో భాగస్వాములు అవుతున్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా వారిలో ఒకరికి విశాఖపట్నంలో, మరొకరికి తిరుపతిలో స్థలం ఇచ్చాం. బ్యాడ్మింటన్ అకాడమీలు స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా వారికి సహకరిస్తుంది. శ్రీకాంత్, సింధు మెంటార్లుగా వ్యవహరిస్తూ ప్రతిభ ప్రదర్శించే మన పిల్లలకు తోడుగా నిలుస్తారు.

+ ఇక ఏటా ఆటలు..

ఆడుదాం ఆంధ్ర టోర్నీని ప్రతి సంవత్సరం నిర్వహిస్తాం. గ్రామస్థాయి నుంచి మొదలై మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరుగుతాయి. ఏటా ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు గ్రామాల్లో ఆరోగ్యపరమైన అవగాహన కల్పిస్తూ టాలెంట్ హంట్ కొనసాగిస్తాం. తద్వారా మరిన్ని ఆణిముత్యాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. సచివాలయ స్థాయి, మండల స్థాయి నుంచి గెలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు ప్రొఫెషనల్ కిట్లు పంపిణీ జరుగుతుంది. ఏటా కిట్లు ఇస్తూ మన పిల్లలను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.



వేడుకగా 'ఆట'

జెండా ఆవిష్కరించి ప్రారంభించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేశంలోనే అతి పెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్ర'గుంటూరు శివారు నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. జెండాను ఆవిష్కరించి పోటీలను లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడోత్సవాల ప్రారంభ సూచకంగా గాల్లోకి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం బ్యాడ్మింటన్ క్రీడాకారుడు క్రీడాకారిణి సీహెచ్ రమాదేవికి క్రీడల టార్చ్ అందచేశారు. కిడాంబి శ్రీకాంత్‌తో కలసి క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం సీఎం జగన్ స్వయంగా మైదానాల వద్దకు వెళ్లి ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి జగన్ కొద్దిసేపు క్రికెట్ బ్యాటింగ్ చేశారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బౌలింగ్ చేయగా మంత్రి రోజా వికెట్ కీపింగ్ చేశారు. సీఎం జగన్ మంచి షాట్లు బాది అందరినీ ఉత్సాహపరిచారు. మంత్రి రోజాకు క్రికెట్ మెళకువలు సూచించారు. అంతకు ముందు పలు క్రీడలకు సంబంధించిన కిట్లను క్రీడాకారులకు అందచేశారు. క్రికెట్ కిట్‌లు, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్లు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 5.09లక్షల స్పోర్ట్స్ కిట్స్ అందిస్తున్నట్లు తెలిపారు.

టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు

- పోటు కార్మికులకు వేతనం మరో రూ.పదివేలు పెంపు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడి



గోవింద కోటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

తిరుమల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు కురిపించనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీటీడీ చైర్మన్, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్య నిర్ణయాలు ఇవీ..

- టీటీడీ ఉద్యోగులకు సంబంధించి మొదటి దఫా డిసెంబరు 28న 3,518 మందికి, రెండో దఫా జనవరి మొదటి వారంలో 1,500 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ
- ఇళ్లస్థలాలను ప్రభుత్వం నుంచి టీటీడీ కొనుగోలు చేసి అభివృద్ధి చేసి ఉద్యోగులకు అందిస్తుంది. ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు
- శ్రీవారి పోటు కార్మికులకు మరో రూ.10 వేల వేతనం పెంచాలని నిర్ణయం
- టీటీడీలోని పలు విభాగాల్లో వర్క్ కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలు పెంపు.
- ఇప్పటికే స్కిల్డ్ కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.18,500, సెమిస్కిల్డ్ కార్మికులకు రూ.12 వేల నుంచి రూ.15 వేలకు, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.10,340 నుంచిరూ.15 వేలకు పెంపు
- కల్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న పీస్‌రేట్ క్షురకులకు నెలకు రూ.20 వేల కనీస వేతనం
- ఫిబ్రవరిలో తిరుమలలో పీఠాధిపతులు, మఠాధిపతుల సదస్సు
- వందల సంవత్సరాలుగా శ్రీవారి ఆలయ అర్చక కైంకర్యాలను పర్యవేక్షిస్తున్న పెద్దజీయర్ మఠానికి రూ.60 లక్షలు, చిన్నజీయర్ మఠానికి రూ.40 లక్షలు ఆర్థిక సహకారం పెంపు.

కాగా, శ్రీ భగవద్గీత, స్థానిక ఆలయాల క్యాలెండర్లు, గోవింద కోటి పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

నెల్లూరు జిల్లా నార్తురాజుపాళెంలో జరిగిన సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



కోవూరులో సాధికార ప్రదర్శన

నెల్లూరు జిల్లా నార్తురాజుపాళేనికి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర

బ్రహ్మరథం పట్టిన ప్రజలు.. జై జగన్ నినాదాలతో హోరెత్తిన రాజుపాళెం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలన్నీ నార్తురాజుపాళేనికి కదలి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన చేయూతతో తాము సాధించిన సాధికారతను ప్రదర్శించాయి. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాజుపాళెంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేశాయి. వారికి రాజుపాళెంలో వీధివీధినా ఘనస్వాగతం లభించింది. జై జగన్ నినాదాలతో రాజుపాళెం హోరెత్తింది. యాత్ర అనంతరం జరిగిన బహిరంగ సభలో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. నేతలు సీఎం జగన్ పేరు పలికిన ప్రతిసారీ ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విద్యార్థులకు వృత్తివిద్య నైపుణ్యం



గురుకుల విద్యార్థినులు(ఫైల్)

- ఒకేషనల్ కోర్సులకు ఉమ్మడి జిల్లాలో 17పాఠశాలలు ఎంపిక
- కేజీబీవీలకే తొలి ప్రాధాన్యం
- రాష్ట్ర సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శిక్షణ

నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలఅర్బన్: జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో నూతన హంగులు సమకూర్చాలనే లక్ష్యంతో పీఎంశ్రీ అమల్లోకి తెచ్చింది. ఉపాధి చదువు(వృత్తి విద్య) అందించాలని నిర్ణయించింది. దశలవారీగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి కల్పించేందుకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వృత్తివిద్య కోర్సుల అమలుకు చర్యలు చేపట్టింది. 2023–24 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 80 పాఠశాలల్లో విద్యార్థులకు ఒకేషనల్ ట్రైనింగ్ కోర్సులు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 17విద్యాసంస్థలను ఎంపిక చేసింది. వీటిలో 16కేజీబీవీలు, ఒకటి తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాల ఉన్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో కోర్సులు నిర్వహించే ఏజెన్సీలు గుర్తించి కోర్సుల ప్రారంభానికి సన్నద్ధమవుతున్నారు. ఉన్నత చదువులకు వెళ్లలేని వారికి ఈ వృత్తి విద్య కోర్సులు ఉపాధిపై భరోసానిచ్చే విధంగా సర్కారు నిర్ణయం తీసుకుంది.

శిక్షణ తరగతులు ఇలా..

ఎంపిక చేసిన పాఠశాల, కళాశాలల్లో 9, 11వ తరగతుల విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత 10, 12వ తరగతుల్లో విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్స్ నిర్వహించి ఎంపిక చేసిన వృత్తివిద్య కోర్సుల్లో నైపుణ్యం సాధించేలా చర్యలు తీసుకోనున్నారు. పాఠశాల విద్య పరీక్ష విభాగం బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఆధ్వర్యంలో వృత్తివిద్య కోర్సుల థియరీ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయోగ పరీక్షలను సెక్టార్ స్కిల్ కౌన్సిల్(ఎస్ఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించి ప్రతిభను చాటిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు.

భాగస్వామ సంస్థలు ఇవే..

రాష్ట్ర సమగ్ర శిక్షతోపాటు దేశంలోని ప్రముఖ వృత్తి శిక్షణ సంస్థలు, ఈ–ఒకేషనల్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నాయి. వృత్తివిద్య శిక్షణలో భాగస్వాములుగా బెంగళూరుకు చెందిన ఇండస్ ఎడ్యుట్రెయిన్, లక్ష్య జాబ్ స్కిల్స్ అకాడమీ, న్యూఢిల్లీకి చెందిన మైండ్ లీడర్స్ లర్నింగ్ ఇండియా, మధ్యప్రదేశ్‌కు చెందిన యంగ్ శక్తి శిక్షణ సామాజిక వికాస్ సంస్థలు న్నాయి. వీటితోపాటు నేషల్ స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) కూడా సమన్వయంతో పని చేయనుంది. ఆయా జిల్లాల్లో అమలు చేయనున్న వృత్తివిద్య కోర్సుల నిర్వహణను ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్(వీటీపీ)కు అప్పగించారు. ఆయా సంస్థల నిపుణులైన శిక్షకులను నియమించి త్వరలోనే తరగతులు ప్రారంభిస్తారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు పాఠశాలలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ అర్బన్ మండలం కేజీబీవీ, ఇంద్రవెల్లి మండలంలోని కేజీబీవీ, కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి, బెజ్జూరు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూరు మండలాల్లో కేజీబీవీలు, మంచిర్యాల జిల్లాలోని తాండూరు, బెల్లంపల్లి, జన్నారం, చెన్నూరు, జైపూర్, నెన్నెల మండల కేంద్రాల్లోని కేజీబీవీలు, నిర్మల్ జిల్లా భైంసా, నిర్మల్ మండలాల్లోని కేజీబీవీలు, నిర్మల్‌లోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల విద్యాలయం ఎంపికయ్యాయి.

ఈ అంశాల్లో శిక్షణ ..

మైక్రోఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్
డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్
కుట్టుమిషన్ ఆపరేటింగ్
అసిస్టెంట్ బ్యూటీథెరపిస్ట్
సొలనాసియస్ క్రాప్ కల్టివేటర్

రెండు దశల్లో..

పదో తరగతి వరకున్న పాఠశాలల్లో రెండు దశల్లో కోర్సులు నేర్పించనున్నారు. 9వ తరగతి విద్యార్థులకు లెవల్ –1 పేరిట విలువైన సమయాన్ని వృథా చేయకుండా వృత్తి విద్య నేర్చుకునేలా మానసికంగా సిద్ధం చేయనున్నారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసేనాటికి విద్యార్థులు నేర్చుకున్న అంశంలో పట్టు సాధించేలా శిక్షణ ఇస్తారు. మిగతా రెండు దశలను ఇంటర్మీడియెట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేస్తారు. విద్యార్థులు సులభంగా నేర్చుకునేందుకు 19రకాల కోర్సులు ఉండగా.. ప్రతీ పాఠశాల నుంచి ఏవైనా రెండు కోర్సులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. పాఠ్యాంశాల బోధనతోపాటు ప్రయోగాలు నిర్వహించనున్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా కోర్సులు ఎంపిక చేస్తారు.

నైపుణ్యాలు పెంపొందించేందుకే..



వృత్తివిద్య శిక్షణ ద్వారా ఉపాధి నైపుణ్యాలను విద్యార్థులలో పెంపొందించేందుకు ఈ కార్యక్రమం సమగ్ర శిక్ష ద్వారా రూపొందించింది. ఇప్పటికే జిల్లా నుంచి మా పాఠశాల ఎంపికైనట్లు ఉత్తర్వులుందాయి. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యార్థుల్లో స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించవచ్చు.

– నీరడి గంగాశంకర్, ప్రిన్సిపల్, తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయం, సోఫీనగర్, నిర్మల్

బాసర ఆలయంలో చండీహోమం

భైంసా: బాసర అమ్మవారి ఆలయంలో మంగళవారం చతుర్వేద సరస్వతి మంత్రసహిత చండీహోమం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున ఆలయంలో హోమం నిర్వహిస్తారు. ఉదయం 9గంటలకు గణపతిపూజ, కళశస్థాపన, రక్షాబంధనం, మండపారాధన, దీక్ష సంకల్పంతో ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు హోమం చేశారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా దత్త జయంతి..

బాసర గ్రామస్తులు మంగళవారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయస్వామి పాదుకలతో శోభాయాత్ర నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



హోమపూజల్లో అర్చకులు

గురుగోవింద్ సింగ్ చరిత్ర మరుగున పడేస్తారా?

- హిందువులను హింసించిన మొగల్స్ చరిత్ర పాఠ్యాంశాల్లో పెడతారా?
- వీర్ బాల్ దివస్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



గురుద్వారలో పూజలు చేస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: పిల్లలకు, యువతకు స్ఫూర్తిదాయకమైన గురుగోవింగ్ సింగ్ చరిత్రను మరుగున పడేసి, హిందువులను హింసించిన మొగల్స్ చరిత్రను పాఠ్యాంశాల్లో పెడతారా అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. వీర్ బాల్ దివస్ సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లో సిక్కులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. గురుద్వారకు వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. త్యాగం, ధర్మ రక్షణ భావాలు కల్పించాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం వీర బాల దివస్ నిర్వహిస్తోందన్నారు. సిక్కు మతం నుంచి ముస్లిం మతంలోకి మారకుంటే చంపుతామని బెదిరించినా భయపడకుండా గురుగోవింద్ సింగ్ కుటుంబం బలిదానం చేసిన చరిత్ర చాలా గొప్పదని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరించి, మొగల్స్‌ను పొగిడిన పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలను ధ్వంసం చేసిన నీచులకు వత్తాసు పలుకుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అయ్యప్ప భక్తుల కష్టాలు కనిపించవా?

తీవ్రవాదులను తయారు చేస్తూ బలవంతపు మత మార్పిడికి పాల్పడుతున్న తబ్లిగీ జమాతే సంస్థకు నిధులిస్తున్న ప్రభుత్వం 41 రోజుల కఠోర దీక్ష చేసే అయ్యప్ప స్వాములకు సౌకర్యాల కల్పనకు ఎందుకు ఇవ్వడం లేదని ఎంపీ సంజయ్ ప్రశ్నించారు. శబరిమలలో కొన్ని రోజులుగా వారు పడుతున్న కష్టాలు కనిపించడం లేదా అన్నారు. ఇమామ్‌లకు, పాస్టర్లకు జీతాలిస్తున్న ప్రభుత్వం పూజారులు, గురుద్వారాల్లో పనిచేసే గురువులకు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మైనారిటీ సెల్ నాయకుడు బల్బీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సీట్ల కోసం 'రాజన్న' భక్తుల గొడవ

- బస్సు కిందపడుకున్న ప్రయాణికుడు
- గంటపాటు బస్టాండ్‌లో హంగామా
- ఠాణాకు చేరిన గొడవ

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు సీటు కోసం వరంగల్ జిల్లాకు చెందిన భక్తులు గొడవకు దిగారు. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన పలువురు భక్తులు వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చారు. మంగళవారం తిరుగు ప్రయాణంలో వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు వరంగల్ వెళ్లేందుకు వేములవాడ బస్టాండ్‌కు రావడంతో బస్సులోని ఒకే సీటులో ఇద్దరు వ్యక్తులు టవల్స్ వేశారు. దీంతో సీటు 'నాదంటే నాది' అని మాటామాటా పెరిగి గొడవకు దారి తీసి రెండు కుటుంబాల వారు కొట్టుకున్నారు. దీంతో గొడవ పడ్డ ఇద్దరిలో ఓ వ్యక్తి బస్సుకింద పడుకున్నాడు. రెండు కుటుంబాల వారు సుమారు గంటపాటు హంగామా సృష్టించారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు.



బస్సు కింద పడుకున్న వ్యక్తి





అంజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొండగట్టు(చొప్పదండి):కొండగట్టు అంజన్న ఆలయానికి మంగళవారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సుమారు 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వరుస సెలవులు రావడంతో రోజంతా రద్దీ కొనసాగింది. క్యూలైన్లలో భక్తులకు తాగునీటి వసతి లేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వేంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, అధికారులు శ్రీనివాసశర్మ, సునీల్, లక్ష్మీరాజం, సంపత్ పర్యవేక్షించారు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఏడాది కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. ఇదే సంవత్సరంలో ఆ పార్టీ అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడింది. 2023 మొదట్లో దారీతెన్నూ లేని దిశలో సాగిన టీపీసీసీ ప్రయాణం ఏడాది ముగిసేసరికి విజయతీరాలను చేరింది. సంక్షోభం నుంచి సక్సెస్ వరకు, పోటీ ఇస్తామా అనే స్థాయి నుంచి పవర్ దక్కించుకునేంత వరకు ఈ సంవత్సరం కాంగ్రెస్ పార్టీకి బలాన్నిచ్చింది. ఏడాది చివర్లో ప్రభుత్వ ఏర్పాటు కలను కూడా నెరవేర్చుకుంది.

- సాక్షి, హైదరాబాద్

కాంగ్రెస్‌కు కలిసొచ్చింది

2023లో ఎన్నికల లక్ష్యాన్ని ఛేదించిన హస్తం పార్టీ

ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ విస్తరణ, ప్రజాపాలనతో ఏడాది చివర్లో బిజీబిజీ



డిగ్గీరాజా వచ్చి... ఠాగూర్‌ను తప్పించి

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా కాంగ్రెస్ పార్టీలో కలహాలతోనే ప్రారంభమైంది. ఆ పార్టీ నేతలు అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో మాటల యుద్ధానికి దిగారు. ఒకదశలో ఇది తీవ్ర రూపం దాల్చడంతో అధిష్టానం జోక్యం చేసుకుంది. సీనియర్‌నేత దిగ్విజయ్‌సింగ్ అలియాస్ డిగ్గీరాజాను రంగంలోకి దించింది. ఆయన స్థానిక నాయకత్వంతో చర్చించి అధిష్టానానికి కీలక నివేదిక అందజేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో మార్పులు ప్రారంభమయ్యాయి. అప్పటివరకు ఉన్న రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ మాణిక్యంఠాగూర్ అనూహ్యంగా తప్పించి ఆయన స్థానంలో మహారాష్ట్రకు చెందిన మాజీ మంత్రి మాణిక్‌రావ్ ఠాక్రేను అధిష్టానం తెలంగాణకు పంపింది. ఠాక్రే రాక తర్వాత క్రమంగా కాంగ్రెస్ అంతర్గత పరిస్థితులు ఒకొక్కటిగా చక్కబడ్డాయి. రాష్ట్ర నేతల మధ్య సమన్వయం కుదర్చడంలో చాలా మేరకు ఆయన విజయవంతమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఐక్యరాగాన్ని అందుకున్నారు. పైకి కనిపించిన ఆ ఐక్యరాగమే తెలంగాణ కాంగ్రెస్‌ను ఓ రకంగా విజయతీరాలకు చేర్చిందని చెప్పవచ్చు.

5 నుంచి 65కు పెరిగిన బలం

ఈ ఏడాది మొదట్లో కాంగ్రెస్ పార్టీకి ఐదుగురు ఎమ్మెల్యేలే మిగిలారు. 2018 ఎన్నికల్లో గెలిచిన వారిలో మెజారిటీ సభ్యులు పార్టీని వీడడంతో ప్రధాన ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఏడాది తిరిగే సరికి 65 మంది సభ్యుల (మిత్రపక్షమైన సీపీఐతో కలిపి)కు తన బలాన్ని పెంచుకుంది. ఇక, ఏడాది చివర్లో ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ విస్తరణ, ప్రజాపాలన లాంటి కార్యక్రమాలతో బిజీబిజీగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో భట్టి విక్రమార్క లాంటి నాయకుల ఆధ్వర్యంలో వచ్చే ఏడాదిలో లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూసుకెళుతోంది.

మూడోస్థానం నుంచి మొదటి స్థానానికి

ఏడాది ఆరంభంలో మూడోస్థానంలో (బీఆర్‌ఎస్, బీజేపీల తర్వాత) ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకునే కొద్దీ రెండో స్థానంలోకి, ఆ తర్వాత మొదటి స్థానంలోకి చేరుకుంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద బూస్టప్ ఇచ్చాయి. ఆ తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మార్పుతో ఇక కాంగ్రెస్ పార్టీకి వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. అప్పటికే డిక్లరేషన్‌ల పేరుతో ప్రజల్లోకి వెళుతున్న కాంగ్రెస్, ఆ తర్వాత ఆరు గ్యారంటీలు, ఎన్నికల ప్రచారంలో దూకుడుతో బీఆర్‌ఎస్‌ను వెనక్కి నెట్టగలిగింది. బీఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమనే భావనను ప్రజలకు కలిగించడంలో సఫలీకృతమైంది. జూలై మొదట్లో ఖమ్మంలో నిర్వహించిన ప్రజాగర్జన సభ నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ మొదలైంది. సభకు రాహుల్‌గాంధీ హాజరు కావడం, రాష్ట్రమంతా ప్రభావం చూపే విధంగా మాజీ ఎంపీ పొంగులేటి బృందం కాంగ్రెస్‌లో చేరడం, సీఎల్పీ నేత హోదాలో భట్టి విక్రమార్క చేపట్టిన రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర ముగింపు అక్కడే జరగడంతో పార్టీకి కొత్త ఊపు వచ్చింది. అదే ఊపుతో ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీకి డిక్లరేషన్‌లు, ఆరుగ్యారంటీలకు తోడు తెలంగాణలో అధికారం రావడం తన కల అని సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు కలిసి వచ్చాయి. ఇతర పార్టీల నుంచి కూడా ఈ ఏడాదిలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. పార్టీ నుంచి వెళ్లిపోయిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు, విజయశాంతి తదితరులు రావడం, మైనంపల్లి హన్మంతరావు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి లాంటి నేతలు పార్టీలోకి రావడం పెద్ద బలాన్నే ఇచ్చింది. వెరసి... మూడో స్థానం నుంచి మొదటి స్థానం వరకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతుతో అధికారాన్ని దక్కించుకోగలిగింది.



మూడో సారీ...

అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించాలన్న బీఆర్‌ఎస్ కోరిక నెరవేరలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. పార్టీని విస్తరించే లక్ష్యంతో గత ఏడాది భారత్‌రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుంది. జాతీయ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు, శాసనసభ ఎన్నికలు లక్ష్యంగా ఈ ఏడాది ఆరంభం నుంచే సన్నద్ధమైంది.

నెరవేరని బీఆర్‌ఎస్ 'హ్యాట్రిక్' కల

ఏడాది పొడవునా ఎన్నికల కోణంలోనే పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు

కేంద్ర ప్రభుత్వం, గవర్నర్‌తో ఘర్షణ వైఖరి, కవితకు ఈడీ నోటీసులు

ఏడాది చివరిలో శ్వేతపత్రం, స్వేదపత్రం పేరిట కాంగ్రెస్‌తో యుద్ధం

జాతీయస్థాయిలో విస్తరణే లక్ష్యంగా...

బీఆర్‌ఎస్‌గా పేరు మార్చుకున్నాక పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జనవరి 18న ఖమ్మంలో తొలి బహిరంగసభ జరిగింది. ముఖ్యమంత్రులు అర్వింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), భగవంత్‌మాన్ (పంజాబ్), పినరయి విజయ్ (కేరళ)తో పాటు యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్, సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా హాజరయ్యారు. ఏపీ బీఆర్‌ఎస్ శాఖ అధ్యక్షుడిగా పార్టీలో కొత్తగా చేరిన తోట చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఒడిషా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్‌తో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. మహారాష్ట్రలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా తొలిసారిగా ఫిబ్రవరి 5న నాందేడ్‌లో జరిగిన తొలి బహిరంగసభకు కేసీఆర్ హాజరయ్యారు. మార్చి 26న కాందార్ లోహ, ఏప్రిల్ 24న ఔరంగాబాద్ సభల్లోనూ కేసీఆర్ పాల్గొన్నారు. మే 19న నాందేడ్‌లో రెండు రోజుల కార్యకర్తల శిబిరాన్ని ప్రారంభించిన కేసీఆర్ జూన్ 15న నాగపూర్‌లో పార్టీ శాశ్వత కార్యాలయాన్ని ప్రారంభించారు. జూన్ 28న మహారాష్ట్ర పర్యటనకు రోడ్డు మార్గాన భారీ కాన్వాయ్‌తో వెళ్లి పండరీపూర్, తుల్జాపూర్ ఆలయాల్లో పూజలు చేశారు. ఆగస్టు ఒకటిన కొల్హాపూర్‌లో అన్నాభావ్ సాఠే వర్ధంతి కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు

ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మార్చి 8న నోటీసులు జారీ చేసింది. మార్చి 11న కవిత ఈడీ విచారణకు హాజరైంది. కవితపై ఈడీ విచారణకు పలు మార్లు నోటీసుల జారీ అంశం బీఆర్‌ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. మరోవైపు తీహార్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ అటు కేటీఆర్, ఇటు కవితను ఉద్దేశిస్తూ లేఖలు విడుదల చేయడంతో విపక్షాల విమర్శలకు దారితీసింది. టీఎస్‌పీఎస్సీ, పదోతరగతి ప్రశ్నపత్రాల లీకేజీ అంశాలు కూడా బీఆర్‌ఎస్‌కు తలనొప్పులు సృష్టించాయి.

గవర్నర్‌తో ఘర్షణ

రాష్ట్ర గవర్నర్‌తోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘర్షణ వైఖరి కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్‌ను కారణంగా చూపడంతో గణతంత్ర వేడుకలు రాజ్‌భవన్‌లోనే జరిగాయి. ఫిబ్రవరి మొదటివారంలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభల భేటీలో గవర్నర్ ప్రసంగం అంశంపై రాజ్‌భవన్, ప్రగతిభవన్ నడుమ కోల్డ్‌వార్ జరిగింది. చివరకు గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం ఓకే చెప్పగా, బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. అసెంబ్లీ పంపిన బిల్లులు గవర్నర్ ఆమోదించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గవర్నర్ కోటాలో శాసనమండలికి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్ తమిళిసై తిరస్కరించగా, రాజకీయాలకు రాజ్‌భవన్ అడ్డాగా మారిందని బీఆర్‌ఎస్ ఆరోపించింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే బిల్లుపైనా గవర్నర్, ప్రభుత్వం నడుమ మాటల యుద్ధం జరిగింది. మరోవైపు కేంద్రంతోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘర్షణ ఏడాది పొడవునా కొనసాగింది. కేటీఆర్ పలు సందర్భాల్లో ప్రధాని మోదీకి కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ మొదలుకొని రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలపై లేఖలు రాశారు.

ఫిబ్రవరి నుంచే...

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే బీఆర్‌ఎస్ వివిధ రూపాల్లో అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమైంది. సీపీఐ, సీపీఎంతో ఎన్నికల అవగాహన ఉంటుందని మొదట్లో భావించినా, అది కుదరలేదు. శాసనమండలి స్థానిక సంస్థల ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి ఎంఐఎం అభ్యర్థి రహమత్ బేగ్‌కు మద్దతు ప్రకటించింది. మార్చి 12 నుంచి నియోజకవర్గస్థాయిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు ప్రారంభించి మే నెలాఖరు వరకు కొనసాగించింది. జూన్‌లో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పేరిట 20 రోజుల పాటు గ్రామస్థాయి వరకు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. సచివాలయం, భారీ అంబేడ్కర్ విగ్రహం, అమరుల జ్యోతి ప్రారంభం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించింది. వివిధ జిల్లాల కలెక్టరేట్ల ప్రారంభం సందర్భంగా బీఆర్‌ఎస్ భారీ సభలు ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 27న తెలంగాణ భవన్‌లో పార్టీ ప్లీనరీ జరగ్గా, రెండు రోజుల ముందే జిల్లాల్లోనూ మినీ ప్లీనరీలు నిర్వహించారు.

ఒకేసారి 115 మంది జాబితా..

షెడ్యూల్ రాకముందే ఆగస్టు 21న ఒకేసారి 115 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కేసీఆర్ ప్రకటించారు. జాబితాలో ఉన్న మైనంపల్లి హన్మంతరావు పార్టీని వీడగా, అలంపూర్ అభ్యర్థి అబ్రహంకు చివరి నిమిషంలో టికెట్ నిరాకరించారు. ఏడుగురు సిట్టింగులకు టికెట్లు నిరాకరించారు. టికెట్లు ఆశించిన జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకమునుపే అక్టోబర్ 15న పార్టీ అభ్యర్థులకు బీ ఫారాలు అందజేశారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 28 వరకు మూడు విడతల్లో పార్టీ అధినేత కేసీఆర్ 97 నియోజకవర్గాల్లో బహిరంగసభల్లో పాల్గొన్నారు. నవంబర్ 30న పోలింగ్ జరగ్గా, డిసెంబర్ 3న వెలువడిన ఫలితాల్లో 39 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు.

కేసీఆర్‌కు శస్త్ర చికిత్స

సీఎం పదవికి రాజీనామా చేసిన కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్‌కు చేరుకున్నారు. డిసెంబర్ 8న బాత్‌రూంలో కాలు జారడంతో ఆస్పత్రిలో చేరిన కేసీఆర్ శస్త్ర చికిత్స అనంతరం డిసెంబర్ 15న డిశ్చార్జి అయ్యారు. డిసెంబర్ 9 నుంచి ప్రారంభమైన శాసనసభ సమావేశాల్లో కొత్త ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయడంపై బీఆర్‌ఎస్ మండిపడింది. శ్వేత పత్రం తప్పులతడక అంటూ డిసెంబర్ 24న తెలంగాణభవన్‌లో కేటీఆర్ 'స్వేదపత్రం' విడుదల చేశారు.



అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయింది. 2023 జనవరి నాటికి అప్పటి రాష్ట్రపార్టీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పలు విడతలుగా చేపట్టిన 'ప్రజాసంగ్రామ పాదయాత్ర'తో నూతనోత్సాహం వెల్లివిరిసింది. అధికార బీఆర్‌ఎస్‌కు రాజకీయ ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందని, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీ మూడోస్థానానికి పరిమితం అవుతుందన్న స్థాయిలో పెద్ద ఎత్తున హైప్ వచ్చింది. కానీ బండి సంజయ్ మార్పుతో పరిస్థితి క్రమక్రమంగా తారుమారు అయ్యింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య వర్గపోరు తారస్థాయికి చేరింది. అసెంబ్లీ ఎన్నికలకు కొద్దినెలల ముందే అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కిషన్‌రెడ్డి అంతగా సుముఖంగా లేకపోయినా అధిష్టానం ఒత్తిడితో అయిష్టంగానే నాయకత్వ భారాన్ని మోసేందుకు సిద్ధమయ్యారు.

కంగుతిన్న కమలదళం

ఏడాది మొదట్లో బీజేపీ దూకుడు.. చివరలో మిశ్రమ ఫలితాలతో హైరానా

ఊపందుకున్న అసంతృప్త నేతల సమావేశాలు

బండి సంజయ్ మార్పుపై ఢిల్లీస్థాయిలో కసరత్తు ప్రారంభమైందనే వార్తలు వెలువడిన నాటి నుంచే రాష్ట్ర పార్టీలో మునుపెన్నడూ చూడనంతస్థాయిలో అసంతృప్త నేతల రాజకీయాలు, అసమ్మతి అంతస్థాయిలో లేకపోయినా విడిగా భేటీలు ఊపందుకున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రమేయం ఉందని జాతీయనేతలు విమర్శలు గుప్పించి, ఆరోపణలపై విచారణ జరిపినా, అరెస్ట్ చేయకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, అది బీఆర్‌ఎస్‌కు ఏటీఎంగా మారిందంటూ అమిత్ షా, నడ్డా విమర్శించినా ఈడీ, సీబీఐ వంటి వాటిద్వారా చర్యలెందుకు తీసుకోలేదనే ప్రశ్నలు గుప్పించారు. జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు ప్రేక్షకపాత్ర వహించడమే కాకుండా అటు అసంతృప్త నేతలకు నచ్చజెప్పడమో, చర్యలపై స్పష్టత ఇవ్వడమో చేయకపోవడంతో జన సామాన్యంలోనూ బీఆర్‌ఎస్‌తో బీజేపీకి అంతర్గత దోస్తీ ఉందనే అనుమానాలు ఏర్పడేందుకు అవకాశం ఏర్పడింది. ఈ కారణంగానే అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలను బీజేపీ సాధించలేకపోయిందనే చర్చ కూడా పార్టీలో జరిగింది. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, యెన్నం శ్రీనివాసరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి వంటి నాయకులు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

2018లో 1 సీటు...7 శాతం ఓటింగ్‌తో మొదలై...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌లోనే గెలిచింది.105 స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. కేవలం ఏడుశాతం ఓట్లు రాగా, ఆరునెలలలోపే 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 4 ఎంపీ సీట్లు గెలుపొంది 19 శాతం ఓటింగ్‌ను సాధించి బీజేపీ సత్తా చాటింది. అప్పటి నుంచి మూడేళ్ల వ్యవధిలో వరుసగా జరిగిన దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలుపు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 2 సీట్ల నుంచి ఏకంగా 48 స్థానాల్లో గెలుపు, మొదటిసారిగా పార్టీ బీ ఫామ్‌పై టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి ఏవీఎన్‌రెడ్డి సంచలన విజయం సాధించి, రాజకీయంగా ప్రజల మద్దతు సాధించి ముందుకుసాగింది. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి తీసికట్టుగా ఓట్లు రావడం, మునుగోడు ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి 12 వేల పైచిలుకు ఓట్లతో ఓటమి చవిచూసినా ఫలితం వెలువడే దాకా నువ్వానేనా అంటూ బీఆర్‌ఎస్‌కు బీజేపీ చెమటలు పట్టించింది. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర బీజేపీకి జాతీయ నాయకత్వం అన్నిరకాలుగా అండదండలు అందించి మద్దతుగా నిలిచింది. రెండు,మూడునెలల వ్యవధిలోనే ప్రధాని మోదీ పది సార్లకు పైగా తెలంగాణలో పర్యటించారు. అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు జాతీయపార్టీ మద్దతు ప్రకటన, కేంద్రప్రభుత్వ సానుకూల నిర్ణయం వంటివన్నీ కూడా రాష్ట్రంలో బీజేపీ గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలిచేందుకు దోహదపడలేదనే అభిప్రాయంలో పార్టీనాయకుల్లో నెలకొంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రపార్టీ అధ్యక్షుడి మార్పు, ఆలస్యంగా అభ్యర్థుల ఖరారు, తెలంగాణలో ఏమాత్రం బలం, ఉనికి లేని జనసేనతో పొత్తు కుదుర్చుకొని 8 సీట్లు కేటాయించడం వంటి అంశాలు బీజేపీ ఎన్నికల ఫలితాల సాధనలో ప్రభావం చూపాయి.



ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేల పరాజయం..

తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 111 స్థానాల్లో పోటీచేసి 8 సీట్లలో గెలిచి, 19 చోట్ల రెండోస్థానంలో, 46 చోట్ల డిపాజిట్లు దక్కించుకుంది. మొత్తంగా 14 శాతం ఓటింగ్‌ను సాధించింది. సిట్టింగ్ ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్ (హుజూరాబాద్, గజ్వేల్ రెండుచోట్ల), ఎం.రఘునందన్‌రావు ఓటమి చవిచూడడం పార్టీకి షాక్ కలిగించింది. కచ్చితంగా గెలుస్తారనుకున్న వీరిని ప్రజలు ఓడించడంతో ఆ పార్టీ నాయకులు అవాక్కయ్యారు. గ్రేటర్‌లో రాజాసింగ్ ఒక్కరే విజయం సాధించారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి 7 అసెంబ్లీ స్థానాలు దక్కించుకొని పరువు నిలబెట్టుకుంది. అయితే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్, బండి సంజయ్ ఎంపీగా ఉన్న కరీంనగర్ లోక్‌సభ సెగ్మెంట్‌లో ఒక్క ఎమ్మెల్యే సీటును కూడా దక్కించు కోలేకపోయారు.



అసెంబ్లీలో అడుగిడిన సీపీఐ

కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కూనంనేని

అసెంబ్లీలోకి సీపీఐ ఎమ్మెల్యే అడుగిడగా, శాసనసభ ఎన్నికల్లో సీపీఎంకు మాత్రం పరాభావమే మిగిలింది. సీపీఎం 19 స్థానాల్లో పోటీ చేసి ఎక్కడా డిపాజిట్లు దక్కించుకోలేకపోయింది. ఎంతో ప్రతిష్ట కలిగిన సీపీఎంకు గత అసెంబ్లీలోనూ, ప్రస్తుత అసెంబ్లీలోనూ ప్రాతినిధ్యం దక్కలేదు.

పొత్తుల్లో సీపీఐ సక్సెస్

బీఆర్‌ఎస్‌తో పొత్తు విఫలం కావడంతో సీపీఐ కాంగ్రెస్‌కు దగ్గరమైంది. కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు ఖరారు కాగా, సీపీఎంతో పొత్తు కుదరలేదు. చివరకు సీపీఎం ఒంటరిగా బరిలోకి దిగగా, సీపీఐ కొత్తగూడెంలో పోటీ చేసి గెలిచింది. ఆ పార్టీ తరఫున రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు 26,568 మెజారిటీతో గెలుపొందారు. వాస్తవానికి వామపక్షాలు కలిసి పనిచేయాలని ఎన్నికలకు ముందే నిర్ణయించుకున్నాయి. కానీ పొత్తుల విషయంలో పొసగక ఎవరిదారి వారు చూసుకున్నారు. ఎన్నికల దృష్టితో చూస్తే సీపీఐ వ్యూహం ఫలించదని అంటున్నారు. సీపీఎం మాత్రం పరాజయం పాలవడమే కాకుండా, తన ఓట్లను నిలబెట్టుకోలేకపోయిందన్న ఆరోపణలు వచ్చాయి.



సీపీఎంకు ఘోర పరాభవం...



తెలంగాణలో ఒంటరిగా బరిలోకి దిగిన సీపీఎం ఎక్కడా తన ప్రభావం చూపలేకపోయింది. భద్రాచలం మినహా ఇతరచోట్ల గెలుపోటములను నిర్దేశించలేకపోయింది. సీపీఎం పోటీ చేసిన 19 స్థానాల్లో 15 చోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా, మిగిలిన నాలుగు చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిచారు. అంతేకాదు అన్ని స్థానాల్లోనూ సీపీఎం డిపాజిట్లు పొందకపోవడంపై ఆ పార్టీ కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తాను పోటీ చేసిన పాలేరు నియోజకవర్గంలోనూ సత్తా చాటలేకపోయారు. ఆయనకు కేవలం 5,308 ఓట్లు మాత్రమే వచ్చాయి. భద్రాచలం నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి 5,860 ఓట్లు సాధించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి అక్కడ 5,719 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇక్కడ మాత్రం కాంగ్రెస్ గెలుపునకు సీపీఎం అడ్డుపడినట్టుగా హస్తం వర్గాలు అంటున్నాయి. 19 చోట్ల పోటీ చేస్తే సీపీఎంకు వచ్చిన మొత్తం ఓట్లు కేవలం 52,349 మాత్రమే కావడం గమనార్హం.

టీడీపీ వాష్‌ఔట్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరమై.. ఉనికే కనుమరుగు

తెలంగాణ ఏర్పాటు తర్వాతే టీడీపీ ఉనికి కోల్పోవడం క్రమక్రమంగా మొదలైంది. 2023 అసెంబ్లీ ఎన్నికలో టీడీపీ పూర్తిగా కనుమరుగైంది. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది తానేనని చెప్పుకునే మాజీ సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని బలోపేతం చేస్తానని ఏడాది ఆరంభంలోనే ప్రకటించారు. అందుకు అనుగుణంగా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఖమ్మంలో బహిరంగసభలు నిర్వహించారు. తెలంగాణలో ఎన్నికల ప్రక్రియ మొదలయ్యేనాటికి ఏపీలో చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అరెస్టు చేసింది. రాజమహేంద్రవరం జైలులో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించారు. దీంతో పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్‌ఎస్‌లో చేరగా, రాష్ట్రంలో అక్కడక్కడ మిగిలిన పార్టీ నాయకులు కూడా ఇతర పార్టీల్లోకి వెళ్లిపోయారు. 2023 ఎన్నికల్లో పార్టీ గుర్తు ఈవీఎం మిషన్‌లో కనిపించకుండాపోయింది. 1983 నుంచి మూడుసార్లు ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చెలాయించిన పార్టీ చంద్రబాబు నిర్ణయంతో 40 ఏళ్ల తర్వాత తెలంగాణలో పూర్తిగా కనుమరుగైంది.



కష్టపడినా దక్కని ఫలితం

రెండు చోట్లనే బీఎస్పీకి డిపాజిట్

ఉత్తరప్రదేశ్‌కు చెందిన బహుజన సమాజ్ పార్టీని రాష్ట్రంలో విస్తరించే ప్రయత్నం మరోసారి విఫలమైంది. ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ స్వచ్ఛంద పదవీవిరమణ చేసి బీఎస్పీలో చేరి ఆ పార్టీ పగ్గాలు చేపట్టారు. రెండేళ్ల పాటు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 2023లో ప్రవీణ్‌కుమార్ రాష్ట్రంలో పాదయాత్రల ద్వారా వందలాది పల్లెలను చుట్టి వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ ఓట్ల శాతం పెరిగి, కొన్ని సీట్లనైనా గెలుచుకుంటుందనే ధీమాను కల్పించడంలో సఫలమయ్యారు. కానీ దళితుల పార్టీగా బీఎస్పీకి ఉన్న ముద్రను తొలగించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో 108 నియోజకవర్గాల్లో పోటీ చేసినా, బీఎస్పీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నుంచి పోటీ చేసిన ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ గెలుపుతీరాలకు చేరుతారని అందరూ భావించారు. కానీ 40వేల పైచిలుకు ఓట్లు సాధించి మూడో స్థానానికే పరిమితమయ్యారు. పటాన్‌చెరు నుంచి పోటీ చేసిన నీలం మధు డిపాజిట్ దక్కించుకున్నారు. రాష్ట్రంలో ఈ రెండు చోట్ల మినహా ఎక్కడా బీఎస్పీకి డిపాజిట్లు దక్కలేదు.



పతంగి పాతబస్తీకే పరిమితం



హైదరాబాద్ పాత నగరంలో ఎంఐఎం తన పట్టును మరోసారి నిలుపుకుంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పోటీ చేసి పార్టీని విస్తరించాలని భావించింది. అయితే తెలంగాణలో పలు పట్టణాల్లో ఆ పార్టీ పోటీ చేయడం ద్వారా విస్తరణకు అవకాశమున్నా, హైదరాబాద్ నగరానికే పరిమితమైంది. 2018 ఎన్నికల్లో పోటీ చేసి ఏడు స్థానాలను కైవసం చేసుకున్న ఆ పార్టీ తిరిగి అవే స్థానాల్లో విజయం సాధించింది. అదనంగా జూబ్లీహిల్స్, అంబర్‌పేటలలో పోటీ చేసినా అక్కడ గెలవలేకపోయింది. అయితే ఈసారి పార్టీ నాంపల్లి, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో తీవ్ర పోటీని ఎదుర్కొంది. నాంపల్లిలో అయితే స్వల్ప మెజారిటీతోనే ఆ పార్టీ విజయం సాధించగలిగింది. మైనారిటీల నుంచి ఈ సారి ఎంఐఎం కొంత వ్యతిరేకతను ఎదుర్కొంది. బీఆర్‌ఎస్‌తో ప్రత్యక్షంగా పొత్తుపెట్టుకోకపోయినా, ఆ పార్టీ విజయం కోసం ఎంఐఎం తన వంతు సహకారం అందించింది.



టాప్ సీడ్ జోడీకి రష్మిక ద్వయం షాక్

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. నవీ ముంబైలో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 7-6 (7/5), 6-2తో టాప్ సీడ్ జిబెక్ కులమ్‌బయేవా (కజకిస్తాన్)-జస్టినా మికుల్స్‌కయిట్ (లిథువేనియా) జోడీని బోల్తా కొట్టించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో సహజ యామలపల్లి-వైష్ణవి (భారత్) జంట 1-6, 6-2, 12-14తో అకీకో ఒమాయి (జపాన్)-జీట్రయిస్ గుమల్యా (ఇండోనేసియా) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది.

సుమిత్ నగాల్‌కు ఏఐటీఏ షాక్



ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ కోసం అందుబాటులో ఉన్న వైల్డ్ కార్డు ఎంట్రీ కోసం భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పేరును పంపించడం లేదని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) స్పష్టం చేసింది. ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో జరిగే డేవిస్‌కప్ మ్యాచ్‌లో ఆడేందుకు సుమిత్ నిరాకరించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఏఐటీఏ సెక్రటరీ జనరల్ అనిల్ ధూపర్ తెలిపారు. దాంతో సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడాల్సి ఉంటుంది.

రాహుల్ పోరాటం

'బాక్సింగ్ డే' టెస్టు సవాళ్లతో మొదలైంది. బంతి ఒక బుల్లెట్‌గా బ్యాటర్లను అదేపనిగా ఢీకొట్టింది. పేసర్లు గర్జిస్తుంటే... ప్రధాన బ్యాటర్లు సైతం చేతులెత్తేశారు. అడుగడుగునా కఠిన సవాళ్లు ఎదురవుతున్న సెంచూరియన్ పిచ్‌పై మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన కేఎల్ రాహుల్ అసాధారణ పోరాటం చేశాడు. అజేయ అర్ధ సెంచరీతో భారత్ ఇన్నింగ్స్‌ను ఆదుకున్నాడు.

- భారత్ 208/8
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు
- ఐదు వికెట్లతో హడలెత్తించిన రబడ



రాహుల్

సెంచూరియన్: సఫారీ పేస్ దళానికి భారత బ్యాటింగ్ బలగమంతా వణికితే ఒకే ఒక్కడు కేఎల్ రాహుల్ మాత్రం పెను సవాలుకు తన బ్యాటింగ్ సత్తాతో ఎదురు నిలిచాడు. తొలిటెస్టులో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ వర్షం కారణంగా ఆట నిలిచి సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 59 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (105 బంతుల్లో 70 బ్యాటింగ్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారత్ మొదటిరోజే ఆలౌట్ కాకుండా అడ్డుపడ్డాడు. అజేయ అర్ధసెంచరీతో ఇన్నింగ్స్‌ను ఆదుకున్నాడు. రబడ ఐదు వికెట్లతో (5/44) చెలరేగాడు. ఈ మ్యాచ్ ద్వారా భారత యువ సీమర్ ప్రసిధ్ కృష్ణ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.

రోహిత్ 5, గిల్ 2

టాస్ నెగ్గిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. సీమర్లు తమ కెప్టెన్ నిర్ణయం సరైందనిపించడానికి ఎంతో సేపు పట్టలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ (5)ను రబడ అవుట్ చేయగా, కాసేపటికే బర్గర్ వరుస ఓవర్లలో యశస్వి జైస్వాల్ (17), శుబ్‌మన్ గిల్ (2)లను పెవిలియన్ చేర్చాడు. 24 పరుగులకే టీమిండియా విలువైన వికెట్లు కూలాయి. ఈ దశలో అనుభవజ్ఞుడైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (64 బంతుల్లో 38; 5 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (50 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్‌ను కనిపెట్టుకున్నారు. తొలిసెషన్‌లో మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుకున్నారు. భారత్ 91/3 స్కోరు వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.



రబడ

రబడ దెబ్బకు మళ్లీ...

అదేంటో ఏమో మ్యాచ్ మొదలైనపుడు కష్టాల్లో పడ్డట్లే... రెండో సెషన్ మొదలైనపుడు కూడా భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. కలిసొచ్చిన పిచ్... పనికొచ్చిన ఎక్స్‌ట్రా బౌన్స్‌తో వైవిధ్యమైన బంతులు వేసిన రబడ మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా నియంత్రణలోకి తెచ్చాడు. సెషన్ ఆరంభమైన ఓవర్లోనే అయ్యర్, జట్టు స్కోరు వంద పూర్తయ్యాక కోహ్లి, అశ్విన్ (8)లను రబడ పెవిలియన్ చేర్చాడు. ఓ దశలో 121/6 స్కోరు వద్ద భారత్ ఆలౌట్‌కు దాదాపు చేరువైంది. ఎందుకంటే ఒక్క రాహుల్ మినహా ప్రధాన బ్యాటర్లెవరూ మిగల్లేదు!

వీరోచిత పోరాటం

కష్టమైన పిచ్... నిప్పులు చెరుగుతున్న బౌలర్లు... భారత్‌కు అన్నీ కష్టాలే! ఇలాంటి పరిస్థితిలో రాహుల్ అద్వితీయ పోరాటం చేశాడు. కీలక బ్యాటర్లెవరూ లేకపోయినా... టెయిలెండర్ శార్దుల్ ఠాకూర్ (33 బంతుల్లో 24; 3 ఫోర్లు)తో రెండో సెషన్‌ను నడిపించాడు. అయితే వేగంగా ఆడే క్రమంలో శార్దుల్ వికెట్‌ను పారేసుకున్నాడు. బుమ్రా క్రీజులోకి రాగా... టీమిండియా 176/7 వద్ద టీ బ్రేక్‌కు వెళ్లింది. విరామనంతరం రాహుల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే కాసేపటికే బుమ్రా (1)ను జాన్సెన్ బౌల్డ్ చేశాడు. సిరాజ్ (0 బ్యాటింగ్) క్రీజులోకి రాగా... రాహుల్ కష్టపడి జట్టు స్కోరును 200 దాటించాడు. బ్యాడ్‌లైట్, వర్షం వల్ల ఫైనల్ సెషన్ ఎక్కువసేపు సాగలేదు. 208/8 స్కోరు వద్ద వాన రావడంతో తొలిరోజు ఆట అక్కడితోనే ఆగిపోయింది. మ్యాచ్ ఆరంభం కూడా ఆలస్యం కావడంతో మొదటి రోజు కేవలం 59 ఓవర్ల ఆటే సాధ్యమైంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) వెరిన్ (బి) బర్గర్ 17; రోహిత్ (సి) బర్గర్ (బి) రబడ 5; గిల్ (సి) వెరిన్ (బి) బర్గర్ 2; కోహ్లి (సి) వెరిన్ (బి) రబడ 38; అయ్యర్ (బి) రబడ 31; రాహుల్ (బ్యాటింగ్) 70; అశ్విన్ (సి) సబ్-ముల్డర్ (బి) రబడ 8; శార్దుల్ (సి) ఎల్గర్ (బి) రబడ 24; బుమ్రా (బి) జాన్సెన్ 1; సిరాజ్ (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (59 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి) 208. వికెట్ల పతనం:** 1-13, 2-23, 3-24, 4-92, 5-107, 6-121, 7-164, 8-191. **బౌలింగ్:** రబడ 17-3-44-5, మార్కో జాన్సెన్ 15-1-52-1, బర్గర్ 15-4-50-2, కొయెట్జీ 12-1-53-0.

'ఖేల్‌రత్న... అర్జున' వెనక్కి...

భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రకటన



న్యూఢిల్లీ: ఇప్పుడు వినేశ్ ఫొగాట్ వంతు వచ్చింది. ఈ స్టార్ రెజ్లర్ కూడా తన ఘనతలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను వెనక్కివ్వాలని నిర్ణయించుకుంది. రోడ్డెక్కి పోరాడినా... క్రీడాశాఖ నుంచి స్పష్టమైన హామీ లభించినా... మళ్లీ రెజ్లర్లకు అన్యాయమే జరిగిందని వాపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పురస్కారాలను అట్టిపెట్టుకోవడంలో అర్థమేలేదని వినేశ్ తెలిపింది. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా తన ఆవేదనను ప్రధానికి లేఖ ద్వారా తెలియజేసింది. 'ఇంత జరిగాక ఇక నా జీవితంలో ఈ రెండు అవార్డులకు విలువే లేదు. ఎందుకంటే ఏ మహిళ అయినా ఆత్మగౌరవాన్నే కోరుకుంటుంది. నేనూ అంతే... నా జీవితానికి ఆ అవార్డులు ఇకపై భారం కాకూడదనే ఉద్దేశంతోనే నాకు మీరిచ్చిన అవార్డుల్ని వెనక్కి ఇస్తున్నాను ప్రధాని సార్' అని ఆమె 'ఎక్స్'లో లేఖను పోస్ట్ చేసింది. మహిళా సాధికారత, సమ సమానత్వం అనే ప్రకటనలకే ప్రభుత్వం పరిమితమని తీవ్రంగా ఆక్షేపించింది. మేటి రెజ్లర్ ఫొగాట్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది. మూడు (2014, 2018, 2022) కామన్వెల్త్ క్రీడల్లోనూ చాంపియన్‌గా నిలిచింది. ఆసియా క్రీడల్లో స్వర్ణం (2018), కాంస్యం (2014) చేజిక్కించుకుంది. కుస్తీలో ఆమె పతకాల పట్టును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లో అర్జున, 2020లో 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డులతో సత్కరించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో లైంగిక ఆరోపణల కేసులో నిందితుడైన వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ వర్గమే గెలిచింది. ఆయన విధేయుడు సంజయ్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో సాక్షి మలిక్ ఉన్న పళంగా రిటైర్మెంట్ ప్రకటించింది. రెజ్లర్ బజరంగ్ పూనియా, బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ 'పద్మశ్రీ' పురస్కారాలను వెనక్కి ఇచ్చారు. అయితే కేంద్ర క్రీడాశాఖ నియమావళిని అతిక్రమించడంతో డబ్ల్యూఎఫ్‌ఐని సస్పెండ్ చేసింది.

పుణేరి పల్టన్ జోరు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ తమ జోరు కొనసాగిస్తోంది. పట్నా పైరేట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 46-28తో ఘనవిజయం సాధించింది. పంకజ్ మొహితె 11 పాయింట్లు, మోహిత్ గోయట్ 9 పాయింట్లు సాధించి పుణేరి జట్టు గెలుపులో ముఖ్యపాత్ర పోషించారు. అస్లమ్ ముస్తఫా, మొహమ్మద్ రజా ఆరు పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. ఈ లీగ్‌లో పుణేరి జట్టుకిది ఆరో విజయం కావడం విశేషం. ఈ గెలుపుతో పుణేరి పాయింట్ల పట్టికలో మళ్లీ ఒంటరిగా అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో దబంగ్ ఢిల్లీ; తమిళ్ తలైవాస్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	7	6	1	0	31
హరియాణా స్టీలర్స్	7	5	2	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	8	3	3	2	22
యు ముంబా	6	4	2	0	21
బెంగళూరు బుల్స్	8	3	5	0	19
దబంగ్ ఢిల్లీ	6	3	3	0	17
పట్నా పైరేట్స్	7	3	4	0	17
యూపీ యోధాస్	7	2	4	1	15
తమిళ్ తలైవాస్	7	2	5	0	11
తెలుగు టైటాన్స్	7	1	6	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

అజేయంగా అర్జున్



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తొలి రోజు ఐదు రౌండ్‌లు ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మరో నలుగురితో కలిసి 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు. మంగళవారం జరిగిన ఐదు గేముల్లో అర్జున్... జాగ్నిసెవ్, బొచరోవ్, మత్లకోవ్ (రష్యా), దనెశ్వర్ (ఇరాన్)లపై గెలిచి చిగయెవ్ (స్పెయిన్)తో 'డ్రా' చేసుకున్నాడు. కార్ల్‌సన్ (నార్వే), చెపరినోవ్ (బల్గేరియా), యు యాంగి (చైనా), విదిత్ (భారత్) కూడా 4.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. మహిళల విభాగంలో నాలుగో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్లు వైశాలి 3.5 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో... కోనేరు హంపి 3 పాయింట్లతో 15వ ర్యాంక్‌లో ఉన్నారు. భారత్‌కే చెందిన పద్మిని రౌత్ 3 పాయింట్లతో 19వ స్థానంలో... ద్రోణవల్లి హారిక, నూతక్కి ప్రియాంక, సాహితి వర్షిణి, వేల్పుల సరయు 2 పాయింట్లతో వరుసగా 48వ, 61వ, 68వ, 69వ స్థానాల్లో ఉన్నారు.

ఆస్ట్రేలియా 187/3



లబుషేన్

మెల్‌బోర్న్: పాకిస్తాన్ జట్టుతో మంగళవారం మొదలైన 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 66 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. టీ విరామానికి 37 నిమిషాల ముందు వర్షం రావడంతో ఆటకు మూడు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. దాంతో తొలి రోజు 66 ఓవర్లు మాత్రమే సాధ్యమయ్యాయి. ఆసీస్ ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (38; 3 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (42; 5 ఫోర్లు) తొలి వికెట్‌కు 90 పరుగులు జోడించారు. స్టీవ్ స్మిత్ (26; 2 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. ఆట ముగిసే సమయానికి లబుషేన్ (44 బ్యాటింగ్; 3 ఫోర్లు), ట్రావిస్ హెడ్ (9 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నారు. పాక్ బౌలర్లు హసన్ అలీ, ఆమెర్ జమాల్, ఆగా సల్మాన్ ఒక్కో వికెట్ తీశారు.

సినిమా

ఈగల్‌లో నన్ను కొత్తగా చూస్తారు

- రవితేజ



టీజీ విశ్వప్రసాద్, శ్రీలీల, రవితేజ, కావ్యా థాపర్, విద్య, కార్తీక్

రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఈగల్'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది. అలాగే రవితేజ, శ్రీలీల జంటగా నక్కిన త్రినాథ రావు దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన హిట్ ఫిల్మ్ 'ధమాకా' విడుదలై ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'ఈగల్ X ధమాకా' సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు మేకర్స్. ఈ వేడుకలో రవితేజ మాట్లాడుతూ- ''ధమాకా' విడుదలై ఏడాది పూర్తయిందంటే నమ్మబుద్ధి కావడం లేదు. నిన్నో మొన్నో రిలీజైనట్లుగా అనిపిస్తోంది. ఈ సినిమాతో హీరోయిన్‌గా శ్రీలీల, మ్యూజిక్ డైరెక్టర్‌గా భీమ్స్‌కు మంచి పేరు వస్తుందని ముందే చెప్పాను. అది నిజమైంది. 'ధమాకా' యూనిట్ సభ్యులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. ఇక 'ఈగల్' విషయానికొస్తే... ఈ చిత్రంలో కొత్త రవితేజను చూస్తారు. కార్తీక్ ఘట్టమనేనికి దర్శకుడిగా మంచి భవిష్యత్ ఉందని నా నమ్మకం. నిర్మాత విశ్వగారితో నా జర్నీ కొనసాగుతుంది'' అన్నారు. ''అన్ని కమర్షియల్ అంశాలు ఉన్న మంచి చిత్రం 'ఈగల్'. థియేటర్స్‌లో చూడండి'' అన్నారు కార్తీక్ ఘట్టమనేని. ''గత ఏడాదిని బ్లాక్‌బస్టర్‌తో ఎండ్ చేశాం. వచ్చే ఏడాదిని బ్లాక్‌బస్టర్‌తో ఆరంభిస్తాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. అవసరాల శ్రీనివాస్, హైపర్ ఆది తదితరులు మాట్లాడారు.

నేను చేయనని చెప్పినా వినలేదు

- శ్రియా రెడ్డి



''సలార్' గురించి ప్రశాంత్ నీల్ చెప్పినప్పుడు చేయనని చెప్పాను. ఆ టైమ్‌లో నేను సినిమాలు చేయకూడదనుకున్నాను. అయితే ప్రశాంత్ మాత్రం పట్టు వదల్లేదు. పూర్తి కథ విని నిర్ణయం తీసుకోమన్నారు. హీరో ఎవరైనా పర్లేదు.. నా పాత్రకి ప్రాధాన్యం ఉండాలని చెప్పాను. 'నీ పాత్ర చాలా బాగుంటుంది.. నన్ను నమ్ము' అన్నారు. అలా 'సలార్'లో రాధా రమ పాత్ర చేశాను'' అని నటి శ్రియా రెడ్డి అన్నారు. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్'. శ్రుతీహాసన్, పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటించారు. విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో రాధా రమ పాత్ర చేసిన శ్రియా రెడ్డి మాట్లాడుతూ-''నేను నటించిన 'పొగరు' సినిమా చూసి ప్రశాంత్ నీల్‌గారు 'సలార్'లో రాధా రమ పాత్రకు ఎంపిక చేసుకున్నారు. నిజానికి 'సలార్' ఒరిజినల్ స్క్రిప్ట్‌లో నా పాత్ర లేదు. అయితే ప్రశాంత్‌గారు లేడీ విలన్ ఉంటే బావుంటుందని యాడ్ చేశారు. 'సలార్' రిలీజ్ తర్వాత ఇండస్ట్రీ నుంచి చాలామంది ఫోన్ చేసి, రాధా రమ పాత్ర బాగుందని అభినందించారు. తొలి భాగం కంటే రెండో భాగంలో ఎక్కువగా కనిపిస్తాను. 'సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్'లో మేం అసలు కథేంటి అనే విషయాన్ని ఎస్టాబ్లిష్ చేయటానికి ప్రయత్నించాం. రెండో భాగం నెక్ట్స్ రేంజ్‌లో ఉంటుంది. ప్రస్తుతం 'సలార్' రెండో భాగం, ఓజీ' సినిమాల్లో నటిస్తున్నాను'' అన్నారు.

ఈ హిట్‌తో ఈ ఏడాదికి వీడ్కోలు

- కల్యాణ్ రామ్



''నటుడిగా ఇరవై ఏళ్ల ప్రయాణంలో (మొదటి చిత్రం 'తొలి చూపులోనే' - 2003) చాలా సంతోషంగా ఉన్నాను. ఈ వృత్తిలో చాలా నేర్చుకున్నాను.. వేరే వృత్తిలో అయితే ఇంత నేర్చుకోలేకపోయేవాడినేమో? సినిమాల వల్ల ఎంతోమందితో మాట్లాడటం, పని చేయడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. వ్యక్తిగతంగా ఓ మంచి తండ్రిగా, భర్తగా పరిణితి చెందాను'' అని హీరో కల్యాణ్ రామ్ అన్నారు. అభిషేక్ పిక్చర్స్ పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'డెవిల్'. కల్యాణ్ రామ్ హీరోగా, సంయుక్తా మీనన్, మాళవికా నాయర్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ చెప్పిన విశేషాలు.

- 2021లో 'బింబిసార' షూటింగ్ టైమ్‌లో రచయిత శ్రీకాంత్ విస్సా నాకు 'డెవిల్' కథ చెప్పారు. 1940 బ్యాక్‌డ్రాప్‌తో సాగే ఈ కథలో హీరో క్యారెక్టర్ కొత్తగా అనిపించింది. నన్ను దృష్టిలో పెట్టుకునే కథ రాశారా? అని అడిగాను. ''నేను 'డెవిల్'ని కథగానే రాశాను. అభిషేక్ నామాగారు మీకు చెప్పమన్నారు. మీరు కమర్షియల్ హీరో కదా.. ఇలాంటి కథ ఒప్పుకుంటారా?'' అని శ్రీకాంత్ విస్సా అన్నారు. హీరో క్యారెక్టర్, బ్యాక్‌డ్రాప్ అలాగే ఉంచి, కమర్షియల్ పంథాలో స్క్రిప్ట్‌లో మార్పులు చేయమన్నాను. శ్రీకాంత్ రెండు, మూడు నెలలు సమయం తీసుకుని మార్పులు చేర్పులు చేయడంతో సినిమా ప్రారంభించాం.
- ప్రేక్షకులకు కొత్త తరహా చిత్రాలు అందించేందుకు ప్రయత్నిస్తుంటాను. అయితే ఒక్కోసారి వాణిజ్య అంశాలు మిస్ అవుతుంటాను. నా గత చిత్రం 'అమిగోస్'కి మరికొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలనే ఆలోచన నాకు ఆ రోజు రాలేదు. డైరెక్టర్‌తో మాట్లాడి ఆ పని చేసుండాల్సింది.. ఆ తప్పు నాదే. అందువల్ల మిస్‌ఫైర్ అయిందనుకుంటున్నాను. కానీ, 'డెవిల్'లో వాణిజ్య అంశాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాను. ఇన్వెస్టిగేటివ్ మూవీలో కమర్షియల్ ఎలిమెంట్స్ మిక్స్ అవడం నాకు కొత్తగా అనిపించింది. సినిమా చూశాక ప్రేక్షకులు కూడా అదే అనుభూతి చెందుతారు. 'డెవిల్' హిట్‌తో 2023కి వీడ్కోలు పలుకుతామనే నమ్మకం ఉంది.
- 'డెవిల్'లో నా క్యారెక్టర్‌లో గ్రే షేడ్స్ ఉండవు. ప్రతి విషయాన్ని వివరంగా చూపిస్తున్నాం. ఈ చిత్రాన్ని అభిషేక్ నామాగారు అద్భుతంగా తీశారు. నా అంచనాలకు మించి సౌందర్ రాజన్ గారు విజువల్స్ ఇచ్చారు. కాస్ట్యూమ్ డిజైనర్ రాజేశ్‌తో 2017 నుంచి వర్క్ చేస్తున్నాను. 'డెవిల్'లో నా పాత్ర కోసం దాదాపు 90 కాస్ట్యూమ్స్‌ని వాడాం. నా పాత్రకి భారతీయతను ఆపాదించే ప్రయత్నం చేశారాయన. 'అర్జున్ రెడ్డి' సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మంచి నేపథ్య సంగీతం అందించారు. 'బింబిసార'కి కీరవాణిగారిలా 'డెవిల్' విషయంలో హర్షవర్ధన్ న్యాయం చేస్తాడా? అనుకున్నాను. అయితే సినిమా చూసిన తర్వాత సంతోషంగా అనిపించింది. 'బింబిసార' హిట్ తర్వాత సంయుక్తా మీనన్‌తో మళ్లీ నటించాను. హీరోకు సమానంగా తన పాత్రకి ప్రాధాన్యత ఉంటుంది. మాళవిక పాత్ర కూడా చక్కగా ఉంటుంది. ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది.
- నేను ఒకే సమయంలో రెండు పడవల ప్రయాణం (నటుడు-నిర్మాత) చేయాలనుకోను. నటనకు ఎంత కష్టపడాలో.. నిర్మాణంలో అంతకు మించి కష్టపడాలి. 'ఓం' సినిమా విషయంలో నాకు ఆ విషయం అర్థమైంది. అప్పటి నుంచి మా బ్యానర్‌లో చేసే సినిమాలకు సంబంధించిన సినిమాల కథ మాత్రమే నేను వింటాను. మిగిలిన విషయాలన్నీ మా హరిగారు చూసుకుంటారు.

- 'డెవిల్' సినిమా సీక్వెల్‌కి 50 శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. 'డెవిల్' కి వచ్చే స్పందన బట్టి సీక్వెల్ చేయాలా? వద్దా అనేది ప్రకటిస్తాం. తమ్ముడి (ఎన్టీఆర్) 'దేవర' సినిమా 85 శాతం షూటింగ్ పూర్తయింది. మేం చేసే సినిమాల ఔట్‌పుట్ గొప్పగా ఉండాలనుకుంటాం.. అందుకే జాగ్రత్తలు తీసుకుని చేస్తాం. నేను, తారక్ 'దేవర' విషయంలో క్లియర్‌గా ఉన్నాం. మేం సంతృప్తి చెందిన వెంటనే సినిమా గురించి అప్‌డేట్ ఇస్తాం. అంతేకానీ అప్‌డేట్ ఇవ్వాలనే ఒత్తిడితో పని చేయలేం కదా?

బోల్డ్ అనడంకంటే బ్యూటిఫుల్ అనాలి


- మానసా చౌదరి



''బబుల్‌గమ్' సినిమా కథ చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ప్రేమ, గౌరవం నేపథ్యంలో ఉంటుంది. యువతరానికే కాదు.. కుటుంబ ప్రేక్షకులకూ మా సినిమా నచ్చుతుంది'' అని హీరోయిన్ మానసా చౌదరి అన్నారు. రోషన్ కనకాల, మానసా చౌదరి జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించిన చిత్రం 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా మానసా చౌదరి మాట్లాడుతూ- ''నేను చిత్తూరు జిల్లా పుత్తూరులో పుట్టి, చెన్నైలో పెరిగాను. నాన్న వ్యాపారం చేస్తారు. మాకు సినిమా నేపథ్యం లేదు. సినిమాల్లోకి వెళ్తానంటే నా ఫ్యామిలీ సపోర్ట్ చేసింది. చదువు పూర్తయ్యాక మోడలింగ్ ఆరంభించాను. గతంలో 'ఎమోజీ' అనే వెబ్ సిరీస్ చేశాను. హీరోయిన్‌గా 'బబుల్‌గమ్' నా తొలి సినిమా. ఇందులో జాన్వీ పాత్రలో ఫ్యాషన్ డిజైనర్‌గా కనిపిస్తాను. 2023లో 22 ఏళ్ల వయసు ఉన్నవాళ్లు ఎలా ఉంటారో ఈ సినిమా కథ అలాగే ఉంటుంది. ఇందులో ఉండే సన్నివేశాలను బోల్డ్ అనడం కంటే రవికాంత్‌గారు చాలా బ్యూటిఫుల్‌గా చూపించారని చెప్పాలి. ఆయన తీసిన 'క్షణం' సినిమా నా ఫేవరెట్. రోషన్‌కి, నాకు ఇది తొలి సినిమా. ఈ సినిమాతో తను నేర్చుకోవడంతో పాటు నాకు కూడా చాలా విషయాలు నేర్పించాడు. సుమగారు మా సినిమా చూసి, చాలా బాగా చేశావని అన్నారు. నాకు అన్ని జోనర్స్ ఇష్టం. మంచి కథలు, పాత్రలు చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగు, తమిళ్‌లో కొన్ని కథలు చర్చల దశలో ఉన్నాయి'' అన్నారు.

రీల్స్

సముద్రంలో తండేల్



నాగచైతన్య

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ కర్ణాటకలోని ఉడిపిలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో ముఖ్య సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. ప్రస్తుతం సముద్రం మధ్యలో అడ్రినలిన్ పంపింగ్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో నాగచైతన్య కొత్తగా కనిపిస్తారు. పూర్తిగా భిన్నమైన నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

ఊహల్లోని ప్రేమ



నందు, అవికా గోర్

నందు, అవికా గోర్ జంటగా ప్రణవ స్వరూప్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అగ్లీ స్టోరీ'. బొక్కెం వేణుగోపాల్, సీహెచ్ సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ప్రణవ స్వరూప్ మాట్లాడుతూ- ''ఊహల్లోని ప్రేమ నిజ జీవితంలో ఉండదనే కాన్సెప్ట్‌తో 'అగ్లీ స్టోరీ' రూపొందింది. నన్ను, కథను నమ్మి ఈ సినిమా నిర్మించిన వేణుగోపాల్, సుభాషిణి, లక్ష్మణ్‌గార్లకు థ్యాంక్స్. యువతని ఆకట్టుకునే డైలాగులు ఈ మూవీలో ఉన్నాయి. త్వరలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, కెమెరా: శ్రీ సాయికుమార్ దారా, సహనిర్మాతలు: రాజ్, అశ్వనీ శ్రీకృష్ణ.

మల్లిగాడు వస్తున్నాడు



సుహాస్

థియేటర్స్‌లో అంబాజీపేట మ్యారేజి బ్యాండు మోత మోగనుంది. సుహాస్, శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో దర్శకుడు వెంకటేశ్ మహా మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను నిర్మించాయి. ఇందులో మ్యారేజ్ బ్యాండు లీడర్ మల్లి పాత్రలో సుహాస్ నటించారు. ఫిబ్రవరి 2న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ''వైవిధ్యమైన కథాకథనాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర.

ఓ ప్రేమకథ



దియా, కిశోర్

కేఎస్‌డీ కిశోర్, దియా సితెపల్లి జంటగా రూపొందిన చిత్రం 'ప్రేమకథ'. శివశక్తి రెడ్డి .డి దర్శకత్వంలో విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 5న విడుదల కానుంది. ''ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమకథ' సినిమా ట్రైలర్, 'ఎవడు మనోడు..' లిరికల్ సాంగ్‌కు మంచి స్పందన లభిస్తోంది. విభిన్నమైన ప్రేమకథతో నేటి తరం ప్రేక్షకులకు నచ్చేలా రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రథన్, సహనిర్మాత: ఉపేందర్ గౌడ్ ఎర్ర.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
230	92
71,337	21,441

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,054	▲ 61
డోజోన్స్	37,489	▲ 103
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,698	▲ 3
డాక్స్	16,706	▲ 19
షాంఘై	2,890	▽ 20
నికాయ్	33,305	▲ 53

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	63,057
బంగారం (99.5 స్వచ్ఛత)	62,805
వెండి (కేజీ)	74,750

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.77	83.79
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.49	107.06
€	యూరో	ఒకటి	90.66	93.04
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.84	59.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.78	57.73
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.02	63.51
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.75	23.55
¥	చైనా యువాన్	పదింటికి	10.52	12.60

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్'

హైదరాబాద్: పండుగ సీజన్‌ను మరింత ఉత్సాహపరిచేందుకు జీఆర్‌టీ జ్యువెలర్స్ 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్' ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.5000 విలువైన ప్రతి కొనుగోలు పై కస్టమర్లు లక్కీ డ్రా కూపన్ పొందుతారు. దీని ద్వారా మహీంద్రా ఎక్స్‌యూవీ 300 డబ్ల్యూ4(24 విజేతలు), రూ.2 లక్షల డైమండ్ నెక్లెస్ సెట్‌లు(47 విజేతలు), టీవీఎస్ జూపిటర్ 125(47 విజేతలు), 10 గ్రాముల బంగారు నాణేలు(236 విజేతలు), 100 గ్రాముల వెండి నాణేలు(708 విజేతలు) వంటి బహుమతులు గెలుచుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక జీఆర్‌టీ షోరూంల్లో ఇప్పటికే ప్రారంభమైన ఈ కాంటెస్ట్ జనవరి 31 వరకు ఉంటుంది. అలాగే బంగారు ఆభరణాల వేస్టేజ్‌పై 20%, డైమెండ్స్, అన్‌కట్ డైమండ్స్ విలువపై 25% తగ్గింపు, వెండి వస్తువుల వేస్టేజీ 25% తగ్గింపు, వెండి ఆభరణాలపై ఎంఆర్‌పీపై 10% తగ్గింపు వంటి ప్రత్యేక ఆఫర్లు పొందవచ్చని సంస్థ ప్రకటనలో పేర్కొంది.

స్మాల్‌కేస్‌ నుంచి వీసీ ఫండ్



రూ. 373 కోట్ల నిధికి సై

న్యూఢిల్లీ: స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఇన్వెస్ట్‌ ఓన్లీ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌గా వ్యవహరించే స్మాల్‌కేస్‌ వెంచర్ క్యాపిటల్(వీసీ) ఫండ్‌కు తెరతీసింది. 4.5 కోట్ల డాలర్ల(రూ. 373 కోట్లు) నిధితో ఫండ్‌ను ప్రారంభించింది. తద్వారా వేగంగా వృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్, గేమింగ్ రంగాలలో నూతన ఆవిష్కరణలకు మద్దతుగా ఆర్థిక మద్దతును సమకూర్చనుంది.

గ్రీన్ ఎనర్జీపై అదానీ దృష్టి

రూ. 9,350 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ గ్రూప్ పర్యావరణహిత(గ్రీన్) ఇంధనం(ఎనర్జీ)కి మరింత ప్రాధాన్యత ఇస్తోంది. 2030కల్లా 45 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించాలని ఆశిస్తోంది. ఇందుకు అనుగుణంగా అదానీ కుటుంబం రూ. 9,350 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధపడుతోంది. గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్(ఏజీఈఎల్) ప్రమోటర్ కుటుంబీకులతోపాటు ఆర్డోర్ ఇన్వెస్ట్‌మెంట్, హోల్డింగ్ లిమిటెడ్, అదానీ ప్రాపర్టీస్ ప్రయివేట్ లిమిటెడ్‌కు మొత్తం 6.31 కోట్ల వారంట్లను జారీ చేయనుంది. ఒక్కో వారంట్‌ను రూ. 1,480.75 ధరలో కేటాయించేందుకు కంపెనీ బోర్డు తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిధులను రుణ చెల్లింపులు, పెట్టుబడి వ్యయాలకు వినియోగించనున్నట్లు అదానీ గ్రీన్ పేర్కొంది. తాజా పెట్టుబడుల కారణంగా కంపెనీలో ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు 3.83 శాతం వాటా లభించనుంది. వచ్చే ఏడాది 1.2 బిలియన్ డాలర్ల విలువైన బాండ్ల గడువు తీరనుంది. ఇప్పటికే వీటి చెల్లింపులు లేదా రీఫైనాన్సింగ్‌కు కంపెనీ ప్రణాళికలు వేసింది. 19.8 గిగావాట్ల విద్యుత్ కొనుగోలుకి అదానీ గ్రీన్ ఇప్పటికే ఒప్పందాన్ని పీపీఏ కుదుర్చుకుంది.

ప్రమోటర్ పెట్టుబడుల వార్తలతో అదానీ గ్రీన్ షేరు బీఎస్‌ఈలో 4.3 శాతం ఎగసి రూ. 1,600 వద్ద ముగిసింది.

మెటల్, ఇంధన షేర్లలో కొనుగోళ్లు

- సెన్సెక్స్ లాభం 230 పాయింట్లు
- 21,450 పాయింట్ల చేరువలో నిఫ్టీ
- కొనసాగిన శాంటాక్లాజ్ లాభాలు



ముంబై: మెటల్, ఇంధన, యుటిలిటీ, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 230 పాయింట్లు పెరిగి 71,337 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు బలపడి 21,441 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది మూడోరోజూ లాభాల ముగింపు. వరుస సెలవుల తర్వాత ఉదయం దేశీయ మార్కెట్ ఫ్లాట్‌గా మొదలయ్యాయి. అయితే ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు క్రమంగా లాభాల దిశగా కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 364 పాయింట్లు పెరిగి 71,471 వద్ద, నిఫ్టీ 128 పాయింట్లు బలపడి 71,471 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఐటీ, టెక్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి. బాక్సింగ్ డే సందర్భంగా యూరప్ మార్కెట్లు పనిచేయలేదు. అమెరికా సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,636 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,464 కోట్ల షేర్లను కొన్నారు. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (0.75%), రిలయన్స్ (0.50%), కోటక్ బ్యాంక్ (1.35%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.

మోటిసన్స్ లిస్టింగ్ భళా

మోటిసన్స్ జ్యువెలరీ లిస్టింగ్ రోజునే ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. ఇష్యూ ధర రూ. 55తో పోలిస్తే బీఎస్‌ఈలో ఏకంగా 89 శాతం ప్రీమియంతో రూ. 104 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఆపై ఒక దశలో 98 శాతంపైగా దూసుకెళ్లి గరిష్ఠంగా రూ. 109ను అధిగమించింది. చివరికి 84 శాతం లాభంతో రూ. 101 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 98 శాతం జంప్‌చేసి రూ. 109 వద్ద లిస్టయ్యింది. ఆపై దాదాపు రూ. 110 వద్ద గరిష్టానికి చేరింది. చివరికి 88 శాతంపైగా వృద్ధితో రూ. 104 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 996 కోట్లుగా నమోదైంది. ఐపీవో ద్వారా కంపెనీ రూ. 151 కోట్లు సమకూర్చుకున్న విషయం విదితమే.

ఇన్నోవా క్యాప్‌టాబ్ ఐపీవో సక్సెస్

చివరి రోజుకల్లా 55 రెట్లు అధిక స్పందన

ఫార్మాస్యూటికల్ కంపెనీ ఇన్నోవా క్యాప్‌టాబ్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజు మంగళవారానికల్లా(26) 55 రెట్లుపైగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 90.78 లక్షల షేర్లను విక్రయానికి ఉంచగా.. 50.16 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 117 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 65 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. ఈ బాటలో రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 17 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. వెరసి షేరుకి రూ. 426–448 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 570 కోట్లు సమకూర్చుకుంది ఈక్విటీ జారీ నిధులలో రూ. 144 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 24 కోట్లు అనుబంధ సంస్థ యూఎంఎల్‌లో పెట్టుబడులకు, మరో రూ. 72 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

సూరజ్ ఎస్టేట్ డీలా..

సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్ లిస్టింగ్ రోజు ఇన్వెస్టర్లకు నిరాశను మిగిల్చింది. ఇష్యూ ధర రూ. 360తో పోలిస్తే బీఎస్‌ఈలో 4.5 శాతం తక్కువగా రూ. 344 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఆపై ఒక దశలో 10 శాతంవరకూ పతనమై రూ. 324 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 7 శాతంపైగా నష్టంతో రూ. 334 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 6 శాతం డిస్కౌంట్‌తో రూ. 340 వద్ద లిస్టయ్యింది. తదుపరి 10 శాతం పడిపోయి రూ. 324 వద్ద కనిష్టాన్ని చవిచూసింది. చివరికి 7 శాతం క్షీణతతో రూ. 335 వద్ద స్థిరపడింది.

ముత్తూట్ మైక్రోఫిన్ నేలచూపు

లిస్టింగ్ రోజు 9 శాతం క్షీణత

ఇటీవలే పబ్లిక్ ఇష్యూకి వచ్చిన ముత్తూట్ పాపచన్ గ్రూప్ అనుబంధ సంస్థ ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ లిస్టింగ్‌లో ఇన్వెస్టర్లను నిరాశపరచింది. ఇష్యూ ధర రూ. 291తో పోలిస్తే బీఎస్‌ఈలో 4.5 శాతం తక్కువగా రూ. 278 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఆపై ఒక దశలో 9 శాతంవరకూ పతనమై రూ. 265 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 8.5 శాతం నష్టంతో రూ. 266 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 5.4 శాతం డిస్కౌంట్‌తో రూ. 275 వద్ద లిస్టయ్యింది. చివరికి 8.6 శాతం క్షీణతతో రూ. 266 వద్ద నిలిచింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ. 4,539 కోట్లుగా నమోదైంది. 11 రెట్లుపైగా స్పందన లభించిన ఐపీవో ద్వారా కంపెనీ రూ. 960 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రమోట్ చేసిన కంపెనీ ప్రధానంగా మైక్రోఫైనాన్స్ సర్వీసులు అందిస్తోంది.

బీమా ప్రీమియం చెల్లించేందుకు రుణాలు

- 10 లక్షల మంది లక్ష్యం
- ఫిన్‌టెక్ స్టార్టప్ ఫిన్‌కేస్ ప్రకటన



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ స్టార్టప్ 'ఫిన్‌కేస్' బీమా ప్రీమియం చెల్లింపుల కోసం రుణ సాయాన్ని అందిస్తోంది. 2025 మార్చి నాటికి ఇలా 10 లక్షల మంది హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలుదారులకు రుణ సాయాన్ని సమకూర్చాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు తెలిపింది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను గడువులోపు చెల్లించడం తప్పనిసరి. పైగా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను నెలవారీ లేదా త్రైమాసిక వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉండదు. ఏడాదికి ఒకే ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. అంత ప్రీమియం ఒకేసారి చెల్లించడం చాలా మందికి భారంగా అనిపిస్తుంది. అలాంటి వారికి ఈ సంస్థ రుణ సదుపాయాన్ని అందిస్తోంది. అలాగే, ఆర్థిక ఆస్తులపైనా రుణాలను సమకూరుస్తుంటుంది. ఫిన్‌కేస్ అందించే రుణంతో హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను చెల్లించి.. ఆ తర్వాత నెలవారీ ఈఎంఐ రూపంలో తిరిగి చెల్లిస్తే సరిపోతుంది. డిజిటల్ ఇన్సూరెన్స్‌లో వెటరన్ అయిన అలోక్ భట్నాగర్‌ను ఆపరేషన్స్ హెడ్‌గా నియమించుకుంది. కాగా, దేశంలో 51.4 కోట్ల మంది హెల్త్ ఇన్సూరెన్స్ రక్షణలో ఉన్నట్టు ఫిన్‌కేస్ తెలిపింది. ఇందులో కేవలం 10 కోట్లు మాత్రమే రిటైల్ హెల్త్ పాలసీలని (సొంతంగా తీసుకున్నవి) పేర్కొంది.

జైడస్ హెల్త్‌కేర్‌కు రూ.284 కోట్ల పన్ను డిమాండ్

న్యూఢిల్లీ: జైడస్ లైఫ్ సైన్సెస్ అనుబంధ సంస్థ జైడస్ హెల్త్‌కేర్ లిమిటెడ్‌కు ఆదాయపన్ను శాఖ నుంచి రూ.284.58 కోట్ల మేర నోటీసు జారీ అయింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 143(1) కింద జారీ అయిన ఈ డిమాండ్ నోటీసు, 2023–24 అసెస్‌మెంట్ సంవత్సరానికి చెందినదని సంస్థ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. రిటర్నుల్లో స్పష్టమైన తప్పుల కారణంగానే ఇది చోటు చేసుకుందని, తప్పొప్పులను సరిదిద్దిన అనంతరం మొత్తం పన్ను డిమాండ్ తొలగిపోతుందని భావిస్తున్నట్టు పేర్కొంది.

పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ సూచనలు

కాగా, పన్ను చెల్లింపుదారులు దాఖలు చేసిన రిటర్నుల్లోని సమాచారం, రిపోర్టింగ్ ఎంటిటీల (బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు, బ్రోకరేజీలు తదితర) నుంచి అందిన సమాచారం మధ్య పోలిక లేని కేసుల్లో.. వారికి సూచనలు పంపినట్టు ఐటీ శాఖ ప్రకటించింది. టీడీఎస్/టీసీఎస్‌కు, దాఖలు చేసిన ఐటీఆర్‌లోని సమాచారం మధ్య వ్యత్యాసం ఉన్న వారికి కూడా సూచనలు పంపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-12-2023	
విశాఖ	625–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620–00
విజయవాడ	620–00
రిటైల్ ధర (డజను)	72.00
26-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	604–00
రిటైల్ ధర	6.65

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఏపీపీఎస్సీలో 99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో(ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్) లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 99
» సబ్జెక్టుల వారీగా ఖాళీలు: ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్–01, ఆటో మొబైల్ ఇంజనీరింగ్–08, బయో మెడికల్ ఇంజనీరింగ్–02, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్–12, సిరామిక్ టెక్నాలజీ–01, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–04, కెమిస్ట్రీ–08, సివిల్ ఇంజనీరింగ్–15, కంప్యూటర్ ఇంజనీరింగ్–08, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్–10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–02, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్–01, ఇంగ్లిష్–04, గార్మెంట్ టెక్నాలజీ–01, జియాలజీ–01, మ్యాథమేటిక్స్–04, మెకానికల్ ఇంజనీరింగ్–06, మెటలర్జికల్ ఇంజనీరింగ్–01, మైనింగ్ ఇంజనీరింగ్–04, ఫార్మసీ–03, టెక్స్‌టైల్ టెక్నాలజీ–03.
» అర్హత: సంబంధిత బ్రాంచ్‌లో ప్రథమ శ్రేణిలో బీఈ/బీటెక్, బీఫార్మసీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ విభాగానికి పీజీతోపాటు ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ హయ్యర్‌గ్రేడ్, షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులై ఉండాలి. » వయసు: 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.56,100 నుంచి 98,400.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష మెరిట్, మౌఖిక పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 29.01.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.02.2024.
» రాతపరీక్ష తేది: ఏప్రిల్/మే 2024.
» వెబ్‌సైట్: psc.ap.gov.in

ఏపీ దేవదాయ శాఖలో 70 ఏఈఈ, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్.. ఒప్పంద ప్రాతిపదికన ఏఈఈ, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హిందూ మతస్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 70
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్)–35, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–05, టెక్నికల్ అసిస్టెంట్(సివిల్)–30.
» అర్హత: టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు ఎల్‌సీఈ డిప్లొమా, ఏఈఈ పోస్టులకు బీఈ, బీటెక్(సివిల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు ఏఈఈకి రూ.35,000, టీఏకు రూ.25,000తో పాటు అదనపు అలవెన్సు చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: వెబ్‌సైట్‌లో సూచించిన దరఖాస్తు నమూనా పూర్తిచేసి, సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను ది కన్వీనర్, రిక్రూట్‌మెంట్ సర్వీస్, పవర్ అండ్ ఎనర్జీ డివిజన్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, గచ్చిబౌలి, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 05.01.2024.
» వెబ్‌సైట్: www.escihyd.org

గుంటూరు జీజీహెచ్‌లో 94 పారా మెడికల్ పోస్టులు

గుంటూరులోని హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 94
» ఖాళీలున్న వైద్య సంస్థలు: గుంటూరులోని జీఎంసీ, జీజీహెచ్, ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్.
» అర్హత: పోస్టును అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, గుంటూరు చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 30.12.2023.
» వెబ్‌సైట్: guntur.ap.gov.in

సీసీఎంబీ, హైదరాబాద్‌లో 40 టెక్నీషియన్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ).. టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 40
» అర్హత: ఎస్ఎస్‌సీ/పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 28 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.36,425.
» ఎంపిక విధానం:ట్రేడ్ టెస్ట్,రాతపరీక్ష ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.01.2024.
» వెబ్‌సైట్: https://www.ccmb.res.in

పదితోనే నేవీ కొలువు

» మొత్తం 910 పోస్ట్‌లకు నోటిఫికేషన్
» అర్హత: పది, ఐటీఐ, బీఎస్సీ, డిప్లొమా
» ఐఎన్‌సెట్ ద్వారా ఎంపిక ప్రక్రియ
» గ్రూప్–బి, గ్రూప్–సి నాన్ గెజిటెడ్ హోదాలు

ఇండియన్ నేవీ 910 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిని సొంతం చేసుకుంటే..గ్రూప్–బి, గ్రూప్–సి నాన్ గెజిటెడ్ హోదాల్లో.. పే లెవల్ 1, 6తో.. ప్రారంభ వేతనం లభిస్తుంది! ఆయా పోస్టులను అనుసరించి పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ అర్హతలుండాలి. నేవీ నిర్వహించే.. ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐఎన్‌సీఈటీ)లో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఈ నేపథ్యంలో.. ఐఎన్‌సీఈటీ ద్వారా భర్తీ చేయనున్న నేవీ ఉద్యోగాలు, అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఇండియన్ నేవీ నిర్వహించే ఐఎన్‌సీఈటీ పరీక్ష ద్వారా.. నేవీకి సంబంధించిన కార్యాలయాల సిబ్బందితోపాటు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోస్ట్‌లను కూడా భర్తీ చేస్తారు. తాజా నోటిఫికేషన్‌లో పోస్ట్‌లను నాన్–మినిస్టీరియల్, ఇండస్ట్రియల్ అనే పేరుతో రెండు కేటగిరీలుగా పేర్కొన్నారు.

మొత్తం 910 పోస్ట్‌లు

నాన్ మినిస్టీరియల్, ఇండస్ట్రియల్ కేటగిరీలలో మొత్తం 910 పోస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో గ్రూప్ బీలో చార్జ్‌మెన్ వర్క్‌షాప్ 22 పోస్టులు, చార్జ్‌మెన్ 20 పోస్టులు, సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ 258 పోస్టులు; అదేవిధంగా గ్రూప్ ట్రేడ్స్‌మెన్ మెట్ 610 పోస్టులు ఉన్నాయి.

విద్యార్హత


ఆయా పోస్ట్‌లను అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు

ఆయా పోస్ట్‌లను అనుసరించి 18–25 ఏళ్లు, 18–27 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

గ్రూప్–బి, గ్రూప్–సి కొలువులు

- కొలువులన్నీ గ్రూప్–బి, గ్రూప్–సి నాన్ గెజిటెడ్ హోదాలో ఉంటాయి. ట్రేడ్స్‌మెన్ మెట్ మినహా మిగిలిన పోస్ట్‌లను నాన్ మినిస్టీరియల్ విభాగంలో గ్రూప్–బి నాన్ గెజిటెడ్ పోస్ట్‌లుగా పేర్కొన్నారు. ఈ పోస్ట్‌లకు ప్రారంభ వేతన శ్రేణి రూ.35,400 –రూ.1,12,400 (పే లెవల్–6)గా నిర్ధారించారు.
- ట్రేడ్స్‌మెన్ మెట్ పోస్ట్‌లను గ్రూప్–సి నాన్ గెజిటెడ్ పోస్ట్‌లుగా పేర్కొన్నారు. ఈ పోస్టులకు ప్రారంభ వేతన శ్రేణి రూ.18,000–రూ.56,900 (పే లెవల్–1).



విధులు ఇవే

- ఛార్జ్‌మెన్(అమ్మ్యూనిషన్ వర్క్‌షాప్, ఫ్యాక్టరీ): అమ్మ్యూనిషన్ వర్క్‌షాప్‌లో సిబ్బంది పనితీరును పర్యవేక్షించడం, స్టోర్స్, టూల్స్‌కు సంబంధించి నిర్వహణ, వార్షిక తనిఖీలు నిర్వహించడం వంటి విధులు ఉంటాయి.
- సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్: తమకు కేటాయించిన విభాగంలో నౌక సమూనా/ప్రణాళిక/ ఎలివేషన్, ఫ్రేమ్ స్ట్రక్చర్ వంటి వాటిని ఆటోక్యాడ్ వినియోగించి రూపొందించడం, అదే విధంగా టెక్నికల్ డేటా సేకరణతోపాటు నౌకల వ్యవస్థలు, అమరికలకు సంబంధించి స్కెమాటిక్/స్కెచ్/ఫ్లో డయాగ్రమ్స్‌లను రూపొందించాల్సి ఉంటుంది.
- సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ కార్టోగ్రఫీ: ఈ విభాగంలో చేరిన వారు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడం, దీనికి సంబంధించి డాక్యుమెంటేషన్ విధులు నిర్వర్తించడం, శాటిలైట్ చిత్రాలను డౌన్‌లోడ్ చేసి, వాటిని నిక్షిప్తం చేయడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్(ఆర్మమెంట్): ఈ విభాగంలో నియమితులైన వారు డ్రాయింగ్స్ గీయడానికి అవసరమైన సాంకేతిక డేటాను సేకరించడం, డ్రాయింగ్స్/ స్పెసిఫికేషన్స్‌ను నిరంతరం పర్యవేక్షించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- ట్రేడ్స్‌మెన్ మెట్: వర్క్‌షాప్, షిప్స్/సబ్ మెరైన్స్‌లో ప్రొడక్షన్, నిర్వహణ విభాగాల్లో పని చేయాల్సి ఉంటుంది. అదే విధంగా తమకు కేటాయించిన సెక్షన్/యూనిట్ దైనందిన కార్యకలాపాల నిర్వహణ, ఇతర క్లరికల్ విధులు(లెటర్స్, ఫ్యాక్స్ తీసుకోవడం/పంపడం), డిస్పాచ్ సెక్షన్ విధులు వంటివి నిర్వర్తించాల్సి ఉంటుంది.

100 మార్కులకు ఐఎన్‌సెట్

ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను నాలుగు విభాగాల్లో 100మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం గంటన్నర. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.

మెరిట్ జాబితా ఇలా

రాత పరీక్షలో సాధించిన మార్కులు,అందుబాటులో ఉన్న పోస్ట్‌లు, రిజర్వేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ పేరిట సర్టిఫికెట్లను పరిశీలిస్తారు.అదే సమయంలో వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తారు. నేవీ ప్రమాణాలకు సరితూగేలా ఉన్న వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: డిసెంబర్ 31, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://incet.cbtexam.in/login/user

పరీక్షలో రాణించేలా

ఇండియన్ నేవీలో కీలక పోస్ట్‌ల భర్తీకి నిర్వహించే ఐఎన్‌సీఈటీలో మంచి మార్కులు సాధించేందుకు విభాగాల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

జనరల్ ఇంటెలిజెన్స్

వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. సిరీస్(నంబర్/ఆల్ఫా న్యూమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్స్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్–డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పద జాలంపైనా పట్టు సాధించడం ఎంతో మేలు చేస్తుంది. కరెంట్ అఫైర్స్‌ను కూడా కీలకంగా భావించాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలను చదవాలి. స్టాక్ జీకే కోసం చరిత్రలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు వాటి తీర్మానాలు, అవార్డులు–విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, శాతాలపై ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా త్రికోణమితి, ఆల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా సాధన చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్,యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.

క్లుప్తంగా...

‘వ్యూహం’పై స్టే ఇవ్వలేం

- తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్‌: ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్‌ వర్మ దర్శకత్వం వహించిన ‘వ్యూహం’చిత్రం విడుదలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. సెన్సార్‌బోర్డు వాదనలు విన్న తర్వాత ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. ‘వ్యూహం’చిత్రానికి సెన్సార్‌ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేసి, విడుదలను ఆపాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్‌ సూరేపల్లి నందా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ తరఫున న్యాయవాది మురళీధర్‌రావు, అనధికారిక ప్రతివాదుల తరఫున సీనియర్‌ న్యాయవాది ఎస్‌.నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. సెన్సార్‌ బోర్డు తరఫున వాదనలు వినిపించేందుకు డిప్యూటీ సొలిసిటర్‌ జనరల్‌ వస్తారని, రెండు రోజుల సమయం కావాలని మరో న్యాయవాది కోరడంతో.. ధర్మాసనం విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

ప్రతికూల వాతావరణంతో విమానం మళ్లింపు

శంషాబాద్‌: శంషాబాద్‌ విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం కారణంగా మంగళవారం కూడా ఓ విమానాన్ని దారి మళ్లించారు. రస్‌అల్‌ఖైమా నుంచి వచ్చిన ఇండిగో విమానం ఉదయం 7.14 గంటలకు శంషాబాద్‌ విమానాశ్రయంలో ల్యాండ్‌ కావాల్సి ఉండగా పొగమంచు కారణంగా సరైన పరిస్థితులు లేకపోవడంతో దాన్ని నాగ్‌పూర్‌ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

కొత్తగా 8 కరోనా పాజిటివ్‌ కేసులు



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కొత్తగా 8 కరోనా పాజిటివ్‌ కేసులు నమోదయ్యాయి. దీంతో కోవిడ్‌–19 చికిత్స పొందుతున్న వారి సంఖ్య 59కి చేరింది. కొత్తగా నమోదైన పాజిటివ్‌ కేసులన్నీ హైదరాబాద్‌ జిల్లా పరిధిలోనివే. మంగళవారం నలుగురు కోవిడ్‌–19 బాధితులు చికిత్స పూర్తి చేసుకుని డిశ్చార్జి అయ్యారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 1,333 కోవిడ్‌– 19 నిర్ధారణ పరీక్షలు చేసినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇందులో 30 నమూనాలకు సంబంధించి ఫలితాలు వెలువడాల్సి ఉంది.

రైతు శాస్త్రవేత్త విజయకుమార్‌కు ‘సృష్టి సమ్మాన్‌’

- చిరుధాన్యాల సాగు వ్యాప్తికి విశేష కృషి చేస్తున్నందుకు గుర్తింపు
- ‘సాత్విక్‌ సంప్రదాయ ఆహారోత్సవం –2023’లో పురస్కారం ప్రదానం



సాక్షి సాగుబడి, హైదరాబాద్‌: చిరుధాన్య పంటల జీవ వైవిధ్యానికి విశేష కృషి చేస్తున్న వైఎస్సార్‌ కడప జిల్లాకు చెందిన ప్రముఖ సేంద్రియ రైతు శాస్త్రవేత్త కొమ్మూరి విజయ కుమార్‌ (60)ను ప్రతిష్టాత్మక ‘సృష్టి సమ్మాన్‌’ పురస్కారం వరించింది. అహ్మదాబాద్‌లోని భగవత్‌ విద్యాపీఠ్‌లో జరుగుతున్న ‘సాత్విక్‌ సంప్రదాయ ఆహారోత్సవం–2023’లో భాగంగా సోమవారం గుజరాత్‌ మాజీ ప్రధాన కార్యదర్శి పి.కె. లహరి, ఐఐఎం అహ్మదాబాద్‌ డైరెక్టర్‌ భరత్‌ భాస్కర్‌, అహ్మదాబాద్‌ ఐఐఎం మాజీ ప్రొఫెసర్‌ అనిల్‌ కె. గుప్తా చేతుల మీదుగా విజయకుమార్‌ జీవవైవిధ్యం విభాగంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రొ.అనిల్‌ కె గుప్తా నెలకొల్పిన సొసైటీ ఫర్‌ రీసెర్చ్‌ అండ్‌ ఇనీషియేటివ్స్‌ ఫర్‌ సస్టయినబుల్‌ టెక్నాలజీస్‌ అండ్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ (సృష్టి) సంస్థ 1995 నుంచి ఏటా గ్రామీణ రైతు శాస్త్రవేత్తలు, జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు జాతీయ స్థాయిలో సృష్టి సమ్మాన్‌ పురస్కారాలు ప్రదానం చేస్తోంది.

సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాల సాగుకు కృషి...

వైఎస్సార్‌ కడప జిల్లాలోని ఈవీ పల్లె గ్రామంలో పుట్టిన కొమ్మూరి విజయకుమార్‌ వర్షాధార భూముల్లో సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాల సాగును పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. చిరుధాన్యాల విత్తనాలను ఇతర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా తిరిగి చిరుధాన్యాల సంప్రదాయ సేంద్రియ సాగు వ్యాప్తికి కృషి చేశారు. స్థానికంగా లభించే అనేక మొక్కల వినూత్న కషాయాలను రూపొందించి రైతులకు అందిస్తూ సేంద్రియ వ్యవసాయంలో పంటలను ఆశించే చీడపీడల నియంత్రణకు విజయకుమార్‌ కృషి చేస్తున్నారు. ఆయన కృషిపై గత దశాబ్దకాలంగా అనేక కథనాలను ‘సాక్షి సాగుబడి’అందించింది.

పథకం ఏదైనా ఒకటే దరఖాస్తు!

- లబ్ధిదారులు సమర్పించాల్సిన ఉమ్మడి దరఖాస్తును రూపొందించిన ప్రభుత్వం
- అభయహస్తం పేరిట రెండు భాగాలుగా సిద్ధం.. నేడు విడుదల చేయనున్న సీఎం రేవంత్‌!



సాక్షి, హైదరాబాద్‌: ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సభల్లో ప్రజలు సమర్పించాల్సిన దరఖాస్తు ఫారాన్ని ప్రభుత్వ వర్గాలు సిద్ధం చేశాయి. అభయహస్తం పేరుతో రూపొందించిన ఈ ఉమ్మడి దరఖాస్తును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం విడుదల చేయనున్నట్లు సమాచారం. రెండు విభాగాలుగా ఉండే ఈ దరఖాస్తు ఫారంలో వ్యక్తిగత వివరాలతోపాటు ప్రభుత్వ పథకాల లబ్ధికి అవసరమయ్యే వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. మొదటి విభాగంలో దరఖాస్తుదారుని పేరు (ఇంటి యజమాని), లింగం, కులం, పుట్టిన తేదీ (ఆధార్‌ ప్రకారం), ఆధార్‌ నంబర్‌, మొబైల్‌ నంబర్‌, వృత్తి, కుటుంబ సభ్యుల వివరాలతోపాటు చిరునామా, రేషన్‌కార్డు నంబర్‌ ఇవ్వాలి. అలాగే దరఖాస్తుదారుని ఫొటోను కూడా జత చేయాలి. రెండో విభాగంలో ఏ పథకం కింద లబ్ధి పొందాలనుకుంటున్నారో ఆ పథకానికి సంబంధించిన సమాచారం ఇవ్వాలి. దరఖాస్తు ఫారాలన్నీ బుధవారం రాత్రికల్లా గ్రామాలు, వార్డులకు చేరతాయని, వీలును బట్టి బుధవారం లేదంటే గురువారం నుంచి జరిగే సభలకు వచ్చే సరికి వాటిని దరఖాస్తుదారులు పూర్తి చేయాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దరఖాస్తుతో పాటు ఆధార్‌ జిరాక్స్‌, తెల్ల రేషన్‌ కార్డు జిరాక్స్‌ జత పరచాలి. దరఖాస్తులో పేర్కొన్న వివరాలన్నీ నిజమేనని ధ్రువీకరిస్తూ సంతకం చేయాలి. ప్రతిపాదిత లబ్ధిదారులకు సంబంధిత అధికారులు దరఖాస్తును స్వీకరించినట్లు రశీదు అందించాలి.

ఏ పథకం కోసం ఏయే వివరాలివ్వాలంటే...

➤ మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం కావాలంటే అక్కడ టిక్‌ చేయాల్సి ఉంటుంది. రూ. 500 గ్యాస్‌ సిలిండర్‌ కోసం గ్యాస్‌ కనెక్షన్‌ నంబర్‌, సరఫరా చేస్తున్న కంపెనీ, సంవత్సరానికి వినియోగించే సిలెండర్ల సంఖ్యను పేర్కొనాలి.

➤ రైతు భరోసా పథకం కోసమైతే సాగు రైతా లేక కౌలు రైతో పేర్కొనాలి. సాగు రైతు అయితే దరఖాస్తులో పట్టాదారు పాస్‌బుక్‌ నంబర్‌ ఇవ్వాలి. కౌలు రైతు అయితే కౌలు చేస్తున్న భూమి వివరాలు సమర్పించాలి. వ్యవసాయ కూలీలైతే ఉపాధి హామీ కార్డు నంబర్‌ రాయాల్సి ఉంటుంది.


➤ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లులేని వారు ఇంటి నిర్మాణ ఆర్థిక సాయం కోసం అని రాసి ఉన్న చోట టిక్‌ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు 250 గజాల ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయాలనుకుంటే అమరవీరుడి పేరు, అమరుడైన సంవత్సరం, ఎఫ్‌ఐఆర్‌ నంబర్‌, డెత్‌ సర్టిఫికెటనంబర్‌ సమర్పించాలి. ఉద్యమకారులైతే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న సందర్భంగా అయిన కేసు తేదీ, సంఖ్య, జైలుకు వెళ్లి ఉంటే వాటి వివరాలను పేర్కొనాలి.

➤ గృహ జ్యోతి కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ పొందేందుకు విద్యుత్‌ మీటర్‌ కనెక్షన్‌ నంబర్‌ ఇవ్వాలి.

➤ చేయూత పథకం కింద నెలకు రూ. 4 వేల పింఛన్‌ కోసమైతే ఏ కేటగిరీ (వృద్ధాప్య, గీత కార్మికులు, డయాలసిస్‌ బాధితులు, బీడీ కార్మికుల జీవన భృతి, ఒంటరి మహిళ జీవన భృతి, వితంతు, చేనేత కార్మికులు, ఎయిడ్స్‌ వ్యాధిగ్రస్తులు, ఫైలేరియా బాధితులు, బీడీ టేకేదారు జీవన భృతి)లో పింఛన్‌ అడుగుతున్నారో టిక్‌ చేయాల్సి ఉంటుంది. దివ్యాంగుల రూ. 6 వేల పింఛన్‌ కోసమైతే సదరం సర్టిఫికెట్‌ నంబర్‌ను పేర్కొనాల్సి ఉంటుంది.

ఉన్నత విద్యామండలి | కంప్యూటర్‌ మాయం!

- కీలక డేటా ఉన్నట్టు అనుమానం !
- 2014 నుంచి ఫైళ్లు యథాతథంగా ఉంచాలని సీఎస్‌ ఆదేశం
- అప్పటి నుంచే కనిపించని సిస్టమ్‌



సాక్షి, హైదరాబాద్‌: ఉన్నత విద్యామండలికి సంబంధించి కీలకమైన డేటా ఉన్నట్టు భావిస్తున్న కంప్యూటర్‌ కనిపించకుండాపోయింది. 2014 నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లోని ఫైళ్లు యథాతథంగా ఉంచాలని సీఎస్‌ ఆదేశించిన రోజే ఈ ఘటన జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనిపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇస్తామని మండలి వైస్‌చైర్మన్‌(వీసీ) అహ్మద్‌ తెలిపారు. ఏం జరిగిందో పరిశీలిస్తున్నామని మండలి కార్యదర్శి శ్రీనివాస్‌ చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ లింబాద్రి, వైస్‌ చైర్మన్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణను ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. వైస్‌ చైర్మన్‌ వెంకటరమణ బాసర ట్రిపుల్‌ ఐటీ ఇన్‌చార్జ్‌ వీసీగా కూడా ఉన్నారు. ఈ కారణంగా ఆయన మండలి కార్యాలయానికి వచ్చి పోతున్నట్టు సిబ్బంది చెబుతున్నారు.

అందులో ఏముందో...?

కీలకమైన ఫైళ్లు స్టోర్‌ చేసేందుకు అత్యాధునిక సాంకేతిక సామర్థ్యమున్న కంప్యూటర్‌ను 2017లో కొనుగోలు చేశారు. అయితే, గత ఏడాది నుంచి అది పనిచేయడం లేదని కొందరు అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగానే దీనిని స్క్రాప్‌గా నమోదు చేసి, స్టోర్‌ రూంలో ఉంచామంటున్నారు. దీని స్థానంలో వేరే కంప్యూటర్‌ కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు. అయితే ఫైళ్లు భద్రపరచాలన్న ఆదేశాలొచ్చిన రోజు కంప్యూటర్‌ కనిపించడం లేదని అధికారులు వీసీ అహ్మద్‌ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన హడావిడిగా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అసలు అందులో ఏముంది? పనిచేయకపోయినా పాత డేటా హార్డ్‌ డిస్క్‌లో ఉండే అవకాశం లేదా? హార్డ్‌డిస్క్‌ ఎక్కడుంది? అందులో డేటాను ఏం చేశారు? పనికి రాని కంప్యూటర్‌ తీసుకెళ్లాల్సిన అవసరం ఎవరికి ఉంది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సిబ్బందిని కోరారు. అయితే, ఈ సమావేశానికి మండలి కార్యదర్శి హాజరుకాలేదని చెబుతున్నారు.

దోస్త్‌ డేటా ఉన్నట్టేనా?

ఆన్‌లైన్‌ ద్వారానే ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశాలను భర్తీ చేస్తుంది. ఈ డేటా అంతా కంప్యూటర్‌లో పొందుపరుస్తారు. దీంతోపాటు మండలి ఆదేశాలు, డిగ్రీ కాలేజీల అనుమతులు ఇందులో ఉంటాయి. ప్రొఫెసర్‌ లింబాద్రి వీసీ–1గా ఉన్నప్పుడు, వెంకటరమణ వీసీ–2గా ఉన్నారు. లింబాద్రి మండలి చైర్మన్‌ అయిన తర్వాత అహ్మద్‌ను మండలి వైస్‌చైర్మన్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో వెంకటరమణ వీసీ–2 నుంచి వీసీ–1 మారుస్తూ అప్పటి విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు. ఇది మండలిలో తీవ్ర వివాదానికి దారి తీసింది. వీసీ–1, వీసీ–2 మధ్య రగడ తారస్థాయికి చేరింది. ఈ సమయంలోనే దోస్త్‌ వ్యవహారాలపై ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం మారడం, వీసీ–1గా ఉన్న వెంకటరమణను తీసేయడం, ఇదే సమయంలో దోస్త్‌కు సంబంధించిన కంప్యూటర్‌ మాయం కావడం అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇంతకీ దోస్త్‌ మొదలైనప్పట్నుంచీ డేటా ఉందా? అనే సందేహం మండలివర్గాల నుంచే వినిపిస్తోంది.

ఈ-వెరిఫికేషన్‌తో పన్ను చెల్లింపులు సులువు

- స్వచ్ఛంద పన్ను సమ్మతిని ప్రోత్సహించేందుకు ఈ పథకం ఎంతగానో దోహదం
- ఐటీ ప్రిన్సిపల్‌ డైరెక్టర్‌ జనరల్‌ సునితా బైన్స్‌లా వెల్లడి


మాట్లాడుతున్న సునితా బైన్స్‌లా

నాంపల్లి: ఈ– వెరిఫికేషన్‌తో ఆదాయపు పన్ను చెల్లింపులు చాలా సరళమవుతాయని ఇన్‌కమ్‌ ట్యాక్స్‌ (ఇంటెలిజెన్స్‌ అండ్‌ క్రిమినల్‌ ఇన్వెస్టిగేషన్‌–న్యూఢిల్లీ) ప్రిన్సిపల్‌ డైరెక్టర్‌ జనరల్‌ సునితా బైన్స్‌లా చెప్పారు. ది ఫెడరేషన్‌ ఆఫ్‌ తెలంగాణ చాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ ఇండస్ట్రీ, ది ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ చార్టెర్డ్‌ అకౌంటెంట్స్‌ ఆఫ్‌ ఇండియా సంయుక్త నిర్వహణలో మంగళవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్‌ హౌస్‌ కేఎల్‌ఎన్‌ ప్రసాద్‌ ఆడిటోరియంలో ‘‘ఈ–వెరిఫికేషన్‌ స్కీమ్‌–2021’’అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సునితా బైన్స్‌లా మాట్లాడుతూ.. 2021 డిసెంబర్‌ 13న సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్ట్‌ ట్యాక్సెస్‌(సీబీడీటీ) ఈ– వెరిఫికేషన్‌ స్కీమ్‌ను నోటిఫై చేసినట్లు తెలిపారు. స్వచ్ఛంద పన్ను సమ్మతిని ప్రోత్సహించడానికి ఈ పథకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ–వెరిఫికేషన్‌ కింద హైదరాబాద్‌లో పెండింగ్‌ కేసులు అత్యధికంగా ఉన్నాయని తెలిపారు. ఇది రాబోయే కాలంలో ఇబ్బందులకు గురిచేసే అంశమని గుర్తుచేశారు. వ్యాపార వ్యవహారాల స్థితిగతులు, బ్యాలెన్స్‌ షీట్‌, యాజమాన్యపు ఆస్తులు వంటివి తెలుసుకోవడానికి ఈ–వెరిఫికేషన్‌ ఉపయోగపడుతుందన్నారు.

ఐటీఆర్‌ ధ్రువీకరణకు ఇది తక్షణ మార్గం

డైరెక్టర్‌ ఆఫ్‌ ఇన్‌కమ్‌ట్యాక్స్‌ (ఐ అండ్‌ సీఐ, అడ్మిన్‌–న్యూఢిల్లీ) రాజ్‌గోపాల్‌ శర్మ ఈ–వెరిఫికేషన్‌ను వివరించారు. ఈ–వెరిఫికేషన్‌ అనేది ఐటీఆర్‌(ఇన్‌కమ్‌ట్యాక్స్‌ రిటర్న్స్‌)ను ధ్రువీకరించడానికి అత్యంత అనుకూలమైన తక్షణ మార్గమని చెప్పారు. డైరెక్టర్‌ ఆఫ్‌ ఇన్‌కమ్‌ట్యాక్స్‌ (ఐఅండ్‌ సీఐ– హైదరాబాద్‌) ఎం.విజయ్‌కుమార్‌, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్‌, ఐసీఏఐ హైదరాబాద్‌ చైర్మన్‌ సీఏ సతీష్‌ కుమార్‌, ఎఫ్‌టీసీసీఐ సీనియర్‌ ఉపాధ్యక్షుడు సురేష్‌ సింఘాల్‌ పాల్గొన్నారు.

చలాన్ల రాయితీ ఉత్తర్వు విడుదల

సాక్షి, హైదరాబాద్‌: ట్రాఫిక్‌ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలపై భారీ రాయితీలు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వు జారీ చేసింది. పెండింగ్‌ ట్రాఫిక్‌ చలాన్లకు సంబంధించి ద్విచక్ర వాహనాలు, ఆటోలపై చలాన్ల మొత్తంలో 80 శాతం, కార్లు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాల చలాన్ల మొత్తంలో 60 శాతం, ఆర్టీసీ బస్సులపై 90 శాతం రాయితీని ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఏపీ సహా 12 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఏపీ సహా 12 రాష్ట్రాల్లో ఓటర్ల తుది జాబితా గడువును పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 తేదీని జనవరి 5వ తేదీకి బదులుగా జనవరి 22వ తేదీకి పెంచింది. అభ్యంతరాల స్వీకరణ గడువును జనవరి 12 వరకు పొడిగించింది. జనవరి 17లోగా అభ్యంతరాలను పరిష్కరించి, జనవరి 22న ఓటర్ల జాబితా విడుదల చేయనుంది.

రోగులకు మెరుగైన సేవలందించండి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని, ఇందుకు వైద్యులు, సిబ్బంది చొరవ తీసుకొని పని చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో జాతీయ ఆరోగ్య మిషన్‌ కార్యక్రమాలపై దామోదర ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని, పల్లె, బస్తీ దవాఖానాల పని తీరు మెరుగుపరచాలని ఆదేశించారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్‌ పరీక్షల ఫలితాల విడుదలలో జాప్యం జరుగుతోందని, వేగంగా ఫలితాలు ఇవ్వాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా పెరుగుతున్నందున వాటి నివారణకు మందులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

సరిహద్దు భద్రతలో అశ్వదళాల పాత్ర కీలకం

- బీఎస్‌ఎఫ్‌ అదనపు డీజీ అనురాగ్‌ గార్గ్‌
- 42వ ఆల్‌ ఇండియా పోలీస్‌ ఈక్వెస్ట్రియన్‌ చాంపియన్‌షిప్‌ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్‌: దేశ సరిహద్దు భద్రతా విధుల్లో అశ్వదళాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని బీఎస్‌ఎఫ్‌ రాయ్‌పూర్‌ స్పెషల్‌ ఆపరేషన్స్‌ కమాండెంట్‌, అడిషనల్‌ డీజీ అనురాగ్‌ గార్గ్‌ అన్నారు. తాను బీఎస్‌ఎఫ్‌ ఐజీగా పశ్చిమ బెంగాల్‌లో పనిచేసినప్పుడు బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి భద్రతా విధుల కోసం గుర్రాలను తొలిసారి గస్తీ విధుల్లో పెట్టినట్లు చెప్పారు. పోలీస్‌ అధికారుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు గుర్రపు స్వారీ ఉపయోగపడుతుందన్నారు. సర్దార్‌ వల్లబ్‌భాయ్‌ జాతీయ పోలీసు అకాడమీలో 42వ ఆల్‌ ఇండియా ఈక్వెస్ట్రియన్‌ చాంపియన్‌షిప్‌, మౌంటెడ్‌ పోలీస్‌ డ్యూటీ మీట్‌ 2023–24 మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఆల్‌ ఇండియా పోలీస్‌ స్పోర్ట్స్‌ కంట్రోల్‌ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మీట్‌ను అనురాగ్‌ గార్గ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రపు స్వారీతో ఒక జంతువును ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా కంట్రోల్‌ చేయడం పోలీస్‌ అధికారులు నేర్చుకుంటారని, ఇది శాంతిభద్రతల నిర్వహణలో పరిస్థితులను చక్కబెట్టేలా ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల పోలీసుశాఖల నుంచి 14 మంది మహిళా పోలీస్‌ అధికారులు సైతం పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ పోలీసు అకాడమీలో జనవరి 5 వరకు నిర్వహించనున్న 42వ ఆల్‌ ఇండియా ఈక్వెస్ట్రియన్‌ చాంపియన్‌షిప్‌, మౌంటెడ్‌ పోలీస్‌ డ్యూటీ మీట్‌–2023–24లో 22 గుర్రపు స్వారీ బృందాలతో కలిపి మొత్తం 610 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారని జాయింట్‌ డైరెక్టర్‌ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 340 గుర్రాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. మొత్తం 34 రకాల పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో భాగంగా జరిగిన షో జంప్‌, టెంట్‌ పెగ్గింగ్‌ వంటివి ఆకట్టుకున్నాయి.

రేపు అంబేడ్కర్‌ వర్సిటీ 25వ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా యూజీసీ చైర్మన్‌ ఎస్‌.జగదీశ్‌కుమార్‌
- గవర్నర్‌ తమిళిసై చేతులమీదుగా ఎంఫిల్‌, పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్‌ ప్రదానం
- ప్రొఫెసర్‌ వీఎస్‌ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్‌



మాట్లాడుతున్న కె.సీతారామారావు

బంజారాహిల్స్‌ (హైదరాబాద్‌): డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయం 25వ స్నాతకోత్సవం ఈనెల 28న విశ్వ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి కె.సీతారామారావు తెలిపారు. యూనివర్సిటీ అకడమిక్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటాచక్రపాణి, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఏవీఎన్‌ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి పి.వెంకటరమణతో కలిసి ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ విచ్చేసి విద్యార్థులకు ఎంఫిల్‌, పీహెచ్‌డీ పట్టాలు, ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, బుక్‌ప్రైజ్‌లను అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూజీసీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ ఎం.జగదీశ్‌కుమార్‌ హాజరై ప్రసంగిస్తారన్నారు. ఈ స్నాతకోత్సవంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్‌ వీఎస్‌ ప్రసాద్‌ను డాక్టర్‌ ఆఫ్‌ లెటర్స్‌ (హానరిస్‌ కాసా–గౌరవ డాక్టరేట్‌)తో సత్కరించనున్నట్లు తెలిపారు. మొత్తం 31,729 మంది విద్యార్థులు డిగ్రీలు, డిప్లొమా సర్టిఫికెట్లు పొందనున్నారని సీతారామారావు వెల్లడించారు. డిగ్రీలో 17, పీజీలో 26 బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణలలోని వివిధ జైళ్లలో ఉండి ఈ యూనివర్సిటీలో చదువుకొని 148 మంది ఖైదీలు డిగ్రీ పట్టాలు పొందనున్నారని వెల్లడించారు. డిగ్రీలో ఒక ఖైదీ గోల్డ్‌ మెడల్‌, బుక్‌ప్రైజ్‌ అందుకోనున్నట్లు చెప్పారు.

వర్సిటీల్లో కొత్త కోర్సులు..

కొత్త కోర్సులను ప్రవేశ పెట్టడమే కాకుండా 2019–22 విద్యా సంవత్సరం నుంచి యూజీ స్థాయిలో చాయిస్‌ బేస్డ్‌ క్రెడిట్‌ సిస్టమ్‌పై యూనివర్సిటీ దృష్టి సారించిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పీజీ, సెమిస్టర్‌ ప్రోగ్రామ్‌, ఎంఏ ఇంటర్నేషనల్‌ రిలేషన్స్‌, ఎంఏ అర్బన్‌ ప్లానింగ్‌ డెవలప్‌మెంట్‌, పీజీ డిప్లొమా ఇన్‌ డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌, పీజీ డిప్లొమా ఇన్‌ ప్రీ ప్రైమరీ టీచర్‌ ఎడ్యుకేషన్‌, పీజీ డిప్లొమా ఇన్‌ ఈ–గవర్నెన్స్‌, పీజీ డిప్లొమా ఇన్‌ యాంకరింగ్‌, డబ్బింగ్‌, వాయిస్‌ ఓవర్‌, పీజీ డిప్లొమా ఇన్‌ లీగల్‌ అవేర్‌నెస్‌ తదితర కోర్సులు ప్రవేశ పెడుతున్నామని సీతారామారావు తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.